విశాలాంధ్ర చందా వివరాలు

|  | ఏజెంటుద్వారా | పోస్టుద్వారా |
|---|---|---|
| నెలకు | రు. 7_50 | రు. 8_10 |
| 3 నెలలకు | 22_50 | 24_30 |
| 6 నెలలకు | 44_00 | 47_60 |
| సంవత్సరమునకు | 88_00 | 95_20 |

ఆదివారంతో సహా దినపత్రిక 25 పైసలు.

VISALAANDHRA Phone No. 75301 ఉదయం ★★★ Regd. No. H/VJ47

విశాలాంధ్ర

704734

సంపుటి 25 సంచిక 252

విజయవాడ 29—12—75 సోమవారం

6 పేజీలు 25 పైసలు

విశాలాంధ్ర పాఠకులకో

నూతనసంవత్సరకానుక!!!

మీ చిరునామా మాకుతెలిపితే, ముద్దులొలికే ముఖచిత్రం, అందంగా ముద్రించబడిన 'శక్తిమార్గం' అనే పుస్తకాన్ని మీకు పూర్తిగా ఉచితంగా, పోస్టుఖర్చులు కూడ లేకుండా మీకుపంపుతాము ఈరోజేవ్రాయండి. ఫార్ కార్నర్స్, పోస్టుబాక్సు 315, విజయవాడ-2

Far Corners

# ఆంధ్రప్రదేశ్‌లో హెక్టారులోపు భూకమతాలు 46 శాతం

హైదరాబాదు, డిసెంబరు 28

ఆంధ్రప్రదేశ్‌లోని భూకమతాలలో ఒక హెక్టారుకు లోపు కమతాలు 46 శాతం వున్నాయని ఆంధ్రప్రదేశ్‌లో 1970-71 సంవత్సరం ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచ వ్యవసాయ కమతాల సమాచార సేకరణ సంస్థ సేకరించిన సమాచారంలో తెలియ చేసింది

ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం భూకమతాల విస్తీర్ణంలో హెక్టారుకు లోపు భూకమతాల విస్తీర్ణం 8 శాతం మాత్రమే. మొత్తం భూ విస్తీర్ణం 135.86 లక్షల హెక్టార్లలో 46 శాతం భూకమతాల విస్తీర్ణం, 54.21 లక్షల హెక్టార్లు మాత్రమే.

10 హెక్టార్ల భూ కమతాలు మొత్తం భూ కమతాలలో 4.3 శాతం మాత్రమేవున్నా మొత్తం భూమిలో వాటి విస్తీర్ణం 30.7 శాతం వుంది.

## అసక్తికరాంశం

కోస్తా ఆంధ్రలో అధిక సంఖ్య భూకమతాలు వుండగా, తెలంగాణాలో వున్న భూ కమతాల క్రింద అత్యధిక విస్తీర్ణం భూమి వున్నట్లు ఆ సర్వే ఆసక్తికరమైన అంశాన్ని వెల్లడించింది

10హెక్టార్లు, అంతకు పైబడిన విస్తీర్ణం గల భూఖండాలు కోస్తా ప్రాంతంలో 2 శాతం మాత్రమేవుండగా, మొత్తం భూవిస్తీర్ణంలో 19.3 శాతం భూమి వాటిక్రింద వుంది. తెలంగాణా ప్రాంతంలో పది హెక్టార్లకు పైబడిన భూఖండాల క్రింద 35.9 శాతం భూమి, రాయలసీమలో 10 హెక్టార్లు, అంతకు పైబడిన భూ కమతాలు 6.7 శాతం శాతం వుండగా వాటిక్రింద 35.6 శాతంభూమివుంది పై సమాచారాన్నిబట్టి పరిశీలించగా, కోస్తా ఆంధ్రప్రాంతంలో సగంకంటే పైబడిన భూకమతాలు ఒక హెక్టారుకులోపు భూకమతాలే

సర్వేలో వెల్లడైన మరొక ప్రధానమైన అంశం ఏమిటంటే, వివిధ జిల్లాలలో వున్న భూకమతాలలో, అవిభక్త భూకమతాల సంఖ్య ఒక శాతం కంటే తక్కువగా వున్నాయి

ఇరిగేషన్ రంగంలో, మొత్తం భూకమతాలలో మూడవవంతు భూ కమతాలకు పూర్తి ఇరిగేషన్ సౌకర్యాలు వున్నాయి 39.4 శాతం భూఖండాలకు అసలు ఇరిగేషన్ సౌకర్యాలే లేవు మిగిలిన భూమికి పాక్షిక ఇరిగేషన్ సౌకర్యాలు వున్నాయి

మొత్తం 54.2 లక్షల భూకమతాలలో కౌలుదార్లకు పూర్తిగా కౌలుకు యిచ్చిన భూకమతాలు 3.07 లక్షలు మాత్రమే వున్నాయి 47.57 లక్షలు లేక 87.8 శాతం భూఖండాలు మొత్తంగా పూర్తిగా స్వంత కమతాలుగాను స్వంత వ్యవసాయం క్రింద వున్నాయి

## సాగుకు లాయికీ బంజరు

రాష్ట్రంలో 11,618 వేల హెక్టార్ల నికర భూమిలో విత్తనాలు చల్లుతుండగా సాగుకు లాయికీగావున్న బంజరు 1,98,000 హెక్టార్లు వుంది

భూమి వినియోగానికి సంబంధించి సర్వేలో వెల్లడించిన ముఖ్యవిషయం ఏమిటంటే, నికరంగా సాగుచేసే భూవిస్తీర్ణం నికరంగా విత్తనాలు వేసే విస్తీర్ణం సాగు చేసే విత్తనాలు చల్లే భూకమతాల దామాషా మొత్తం విస్తీర్ణం నుండి క్రమేణా తగ్గుతూ భూకమతాల విస్తీర్ణం పెరుగుతోంది

అదే సమయంలో, భూకమతాల పెరుగుదలతోపాటు, తాత్కాలికంగా సాగుచేయకుండా బంజర్లుగా వుంచిన భూముల దామాషా విస్తీర్ణం పెరుగుతోంది మరొక మాటలో చెప్పాలంటే చిన్న భూకమతాలలో సమగ్ర పద్ధతిలో వ్యవసాయం జరుగుతూంటే, పెద్ద కమతాలక్రింద వున్న భూములలో కొన్ని ప్రాంతాలు సాగు చేయకుండా బంజరుగా విడిచి పెట్టబడ్డాయి

# ఇరాక్ ప్రతినిధి వర్గం రాక

న్యూఢిల్లీ, డిసెంబరు 28

అయిదుగురు సభ్యులు గల ఇరాక్ ప్రతినిధి వర్గం నేడు న్యూఢిల్లీ చేరుకుంది

భారత సరిహద్దు దళాల ఉన్నతాధికార్లతో నిపుణుల మార్పిడి సమస్యపై ఇరాక్ ప్రతినిధి వర్గం చర్చలు జరుపుతుంది.

భారత సరిహద్దు దళాల డైరెక్టర్ జనరల్ శ్రీ అశ్వనీకుమార్ ప్రభృతులు ఇరాక్ ప్రతినిధి వర్గానికి ఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం చెప్పారు.

సరిహద్దు దళాల నిర్మాణంలో ప్రప్రథమంగా తమకు సహకరిస్తున్నది భారత దేశమేనని ఇరాక్ ప్రతినిధివర్గ నాయకులు విమానాశ్రయంలో అన్నారు.

# బంగ్లా-ఈజిప్ట్‌ల ఒప్పందం

ఢాకా, డిసెంబరు 28

బంగ్లాదేశ్-ఈజిప్టు ప్రతినిధివర్గాలు నిన్న యిక్కడ వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి.

ఒప్పందంమేరకు బంగ్లాదేశ్ తేయాకు, జనుం, జనుము ఉత్పత్తులు, న్యూస్‌ప్రింట్ పేపర్ ఈజిప్టుకు ఎగుమతి చేసి అక్కడనుండి ప్రత్తి, నూలుదారం, ఇనుము, రాక్ ఫాస్ఫేట్ దిగుమతి చేసుకుంటుంది

# స్వేచ్ఛాశంఖంపూరించిన 1975

న్యూఢిల్లీ, డిసెంబరు 28

ఈ ఏడాది సౌమనస్యం పెద్ద ముందంజ వేసింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఎన్నడూ లేని ద్రవ్యోల్బణ సంక్షోభంలో పశ్చిమ దేశాలు పీకలోతు కూరుకున్నాయి ఇంకా భూగోళంమీద ఏదో ఓ మూల తుపాకుల రొద వినిపిస్తూనేవుంది. పశ్చిమ దేశాలను హెల్సింకీకి రప్పించి యూరప్ భద్రతా ఒప్పందంపై సంతకం పెట్టించడంలో సోవియట్ ఘన విజయం సాధించింది

బాంబుల గర్జన, మానవ హాహాకారాలతో మూడున్నర దశాబ్దాలు హోరెత్తిన ఇండో చైనాపై శాంతి ఉదయించింది వియత్నాం కాంబోడియాలలో అమెరికా బాయినెట్లపై నిలిచిన కీలుబొమ్మ ప్రభుత్వాలు పేకమేడల్లా కూలిపోయాయి. పొరుగునున్న లావోస్‌లో 7 శతాబ్దాల రాచరికం అంతమయింది ప్రజాతంత్ర పాలనకు రాజు ఒప్పుకుని గద్దె దిగాడు.

1975 స్వేచ్ఛా సాధన సంవత్సరమయింది ఆరు వలసదేశాలు స్వాతంత్ర్యం సాధించుకున్నాయి.

ఇదిచూసిన దక్షిణాఫ్రికా, రోడీషియా శ్వేత మైనారిటీ ప్రభుత్వాలకు గంగవెర్రులెత్తింది ఎప్పటిలాగా కొత్తగా స్వేచ్ఛ పొందిన దేశాల్లో అమెరికా, పశ్చిమ దేశాల కుట్రలూ, అంతరంగిక కల్లోలం సాగుతున్నాయి

# చండీఘర్‌లో ఊరేగింపు

## బారువా రాక సందర్భంగా

చండీఘర్, డిసెంబరు 28

రేపిక్కడ ఎ ఐ సి సి 75 వ ప్లీనరీ సమావేశానికి అధ్యక్షత వహించడానికి వచ్చిన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ డి. కె. బారువాను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు.

ఊరేగింపులో వేలాది ప్రజలతోపాటు వాహనాలు కూడా పాల్గొన్నాయి.

ప్రదర్శకులు దేశభక్తిగీతాలు ఆలపిస్తూ సాగారు. శ్రీ బారువాను పూలతో అలంకరించిన వేదికపై కూర్చుండబెట్టి ఊరేగింపుగా తీసుకెళ్ళారు

ఆయన వున్న ప్రత్యేక రైలు స్టేషనులో ఆగగానే కాంగ్రెసు కార్యకర్తలు బారువా జిందాబాద్! కాంగ్రెస్ జిందాబాద్! అంటూ గట్టిగా నినాదాలిచ్చారు.

రైల్వే మంత్రి త్రిపాఠీ, రక్షణ మంత్రి బన్సీలాల్, పంజాబ్ హర్యానాల ముఖ్యమంత్రులు పంజాబ్, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆయనకు రైల్వే స్టేషనులో స్వాగతం పలికారు,

# బ్లాక్ మార్కెటీర్లపై తీవ్ర చర్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 27

అత్యవసర పరిస్థితి ప్రకటించిన అనంతరం గత అయిదు నెలలలో వివిధ రాష్ట్రాలలో నిత్యజీవితావసర వస్తువుల కంట్రోలు ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు అక్రమ నిల్వదారులు, బ్లాక్ మార్కెటుదార్లపై తీవ్రమైన చర్యలు తీసుకోవటం జరిగిందని అధికార ప్రకటన తెలిపింది

దేశంలోని వివిధ ప్రాంతాలలో అధికారులు దాడులు జరిపి కేసులు నమోదు చేయటం, లైసెన్సులు రద్దు చేయటం జరిగింది.

# సిడ్నీ హోటల్‌కు నిప్పు: 13 మంది మృతి

సిడ్నీ, డిసెంబరు 26

సిడ్నీలోని సరాయి హోటల్లో నిన్న అగ్నిప్రమాదంవల్ల 13 మరణించారు

మృతులలో ఎక్కువ మంది ఆసియన్లని భావించబడుతోంది. 21 మంది గాయపడ్డారు

76 మంది అతిథులు నిద్రిస్తుండగా ప్రమాదం జరిగింది.

# పోలింగ్ ప్రారంభం

## అహమ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో

అహమ్మదాబాదు, డిసెంబరు 28

105 మంది సభ్యులుగల అహమ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు నేటి ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది

మధ్య తరగతి ప్రజలున్న ప్రాంతాల్లో పోలింగ్ ఒకమోస్తరుగానూ కార్మికులున్న ప్రాంతాల్లో చురుగ్గానూ జరుగుతున్నట్లు తొలివార్తలు తెలుపుతున్నాయి. దాదాపు 9 లక్షల మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొననున్నారు.

కార్మిక పేటలు, మురికివాడలలోని క్యూలవద్ద ఓటర్లు బారులుతీరి నిల్చున్నారు.

# వచ్చే మార్చినాటికి 5వ ప్రణాళికకు తుదిరూపం

న్యూఢిల్లీ డిసెంబరు 28

1976 ఫిబ్రవరి లేదా మార్చినాటికి అయిదవ ప్రణాళికకు తుదిరూపం ఇవ్వబడుతుందని ప్రణాళికాసంఘ వర్గాలద్వారా తెలుస్తున్నది

1976-77 వార్షిక ప్రణాళికపై ప్రణాళిక సంఘం చర్చలు ముగించగానే 5 వ ప్రణాళికకు తుదిరూపం ఇచ్చే ప్రయత్నాలు ప్రారంభమవుతాయి

1976 జనవరి మూడవ వారం అంతానికి ఆ చర్చలు ముగియవచ్చునని భావిస్తున్నారు

ప్రణాళికసంఘం జనవరి 1 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రులతో వార్షిక ప్రణాళికపై చర్చలు ప్రారంభిస్తుంది. ఆ సమస్యపై ప్రస్తుతం కొనసాగుతున్న అధికారస్థాయి చర్చలు అప్పటికి ముగియగలవని భావిస్తున్నారు

1974 ఏప్రిల్ నుంచి అయిదవ ప్రణాళిక అమలులోవున్నప్పటికీ దేశంలో ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ రంగంలో ఇంధన సంక్షోభం వగైరా అనిశ్చిత పరిస్థితుల మూలంగా ప్రణాళిక ముసాయిదాకు ఇంకా తుదిరూపం ఇవ్వడం జరగలేదు గతంతో పోలిస్తే ధరలుకొంత స్థిరరూపం దాల్చడంతోపాటు, వనరుల పరిస్థితికూడా కొద్దిగా మెరుగుకావడంతోను అయిదవ ప్రణాళికకు తుదిరూపం ఇవ్వడానికి అవకాశం చిక్కిందని ప్రణాళిక సంఘం భావిస్తున్నట్లు యు. ఎన్. ఐ. విలేకరి రాస్తున్నారు.

ముఖ్యంగా కీలకరంగంలో పెట్టుబడులను వృద్ధిని పెంచడానికి గాను 1974-75 వార్షిక ప్రణాళిక మొత్తం కంటే 1975-76 వార్షిక ప్రణాళిక మొత్తాన్ని 23 శాతం పెంచారు ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధికిగాను రాష్ట్రాలకు అదనంగా రు 123 కోట్లు కేటాయించారు.

1976-77 జనరల్ బడ్జెట్ సమర్పించే నాటికిగాని 1976-77 వార్షికప్రణాళిక పరిమాణం పూర్తి వివరాలు స్పష్టంకావు అయితే తప్పనిసరిగా ప్రస్తుత వార్షిక ప్రణాళికలో కేటాయించిన దానికంటె గణనీయంగా ఎక్కువ మొత్తాలే కేటాయించబడవచ్చునని వూహిస్తున్నారు.

వచ్చే సంవత్సరం ప్రణాళిక ప్రాధాన్యతల్లో భేదం వుండకపోవచ్చు అంటే వ్యవసాయం, ఇరిగేషన్, విద్యుత్, ఎరువులు, బొగ్గు, పెట్రోలియం ఉక్కు, సిమెంట్, వగైరా ప్రాధాన్యతరంగాలపైనే ఎక్కువ శ్రద్ధవహించడం జరుగుతుంది.

విద్యా రంగానికి గత సంవత్సరంకంటే ఎక్కువ మొత్తం కేటాయించబడవచ్చు. ముఖ్యంగా ప్రాథమిక విద్యా సౌకర్యాల విస్తరణకు ప్రణాళిక సంఘం ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుందని తెలుస్తున్నది.

ఆహార పరిస్థితి కాస్త మెరుగుపడడంతో పౌష్టికాహార ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రణాళికాసంఘం భావిస్తున్నది ఈ సందర్భంగా ప్రభుత్వరంగంలో 100కి పైగా ఉన్న నూలు మిల్లులను త్వరత్వరగా ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉన్నట్లు కూడా ఆ సంఘం భావిస్తున్నది.

# విచ్ఛిన్నకర శక్తుల ప్రమాదం తొలిగేదాకా అత్యవసర పరిస్థితి కొనసాగింపు

## కాంగ్రెస్ కార్యవర్గం ఆమోదించిన తీర్మానం విజ్ఞప్తి

చండీఘర్, డిసెంబరు 28

దేశానికి బయటి నుండి లోపల నుండి ఏర్పడిన విచ్ఛిన్నకర ప్రమాదాలు పూర్తిగా తొలగేదాకా అత్యవసర పరిస్థితిని కొనసాగించాలని కాంగ్రెసు కార్యవర్గం నేడు విజ్ఞప్తి చేసింది

ఎ. ఐ. సి. సి. 75 వ ప్లీనరీ సమావేశం విషయ నిర్ణాయక కమిటీ పరిశీలన నిమిత్తం రూపొందించబడిన రాజకీయ ముసాయిదా తీర్మానానికి కార్యవర్గం తుది రూపం యిచ్చింది. కామాగతమారు నగర్‌లో ప్లీనరీ సమావేశం రేపుప్రారంభం కానున్నది

దేశానికి లోపలి, వెలుపలి, విచ్ఛిన్నకరశక్తుల నుండి ఏర్పడిన ప్రమాదం ఇంకా కొనసాగుతున్నదని తీర్మానం తెలియజేసింది.

దేశం లోపలి వెలుపలి విచ్ఛిన్నకర శక్తుల ప్రమాదం తొలగిపోయిందని భావించడం పొరపాటు కాగలదనీ, అప్రమత్తతను సడలించడం ప్రమాదకరమని తీర్మానంలో పేర్కొన్నారు.

ఈ శక్తుల సవాళ్ళను ఎదుర్కోగల సజీవమైన సాధనంగా రాజ్యాంగాన్ని తగు విధంగా సవరించేందుకు రాజ్యాంగాన్ని పూర్తిగా పరిశీలించాలని కోరింది.

రాజకీయ పరిస్థితి, ఆర్థిక పరిస్థితి, అంతరంగిక పరిస్థితులపై డిసెంబరు 10 వ తేదీన ఢిల్లీలో కాంగ్రెస్ కార్యవర్గం ఆమోదించిన తీర్మానాలకు కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బారువా పునరూపం యిచ్చిన తరువాత నేడిక్కడ విడుదల జేశారు.

# ప్రధాన మంత్రి చండీఘర్ రాక

చండీఘర్ డిసెంబరు 28

ఎ. ఐ. సి. సి. 75 వ ప్లీనరీ సమావేశంలో పాల్గొనే నిమిత్తం ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ఢిల్లీ నుండి నేడిక్కడికి వచ్చారు

# నిజలింగప్ప పత్రికా సమావేశం

బెంగుళూరు, డిసెంబరు 28

మహాత్మాగాంధి సూచించిన నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టినప్పుడు మాత్రమే దేశంలోని దారిద్ర్యం, నిరుద్యోగం సమస్యలను పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందని సిండికేట్ కాంగ్రెస్ నాయకుడు శ్రీ యస్ నిజలింగప్ప నేడిక్కడ ఒక పత్రికా సమావేశంలో తెలిపారు.

పావగడలో మూడు రోజుల భూదానోద్యమ రజతోత్సవాలు ముగిసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కేవలం ఉద్రేకాలు సమస్యలను పరిష్కరించజాలవని ఆయన చెప్పారు.

నీటిపారుదల క్రిందకు ఎక్కువప్రాంతాలను తేవడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుంటుందని ఆయన తెలిపారు.

# విద్యుత్ అపివేతవల్ల ఇబ్బంది

రాజమండ్రి, డిసెంబరు 28

గత వారం రోజులుగా ప్రతి రోజూ సాయంకాలం 6 గంటల నుండి ఒకగంటకు పైగా విద్యుత్ ఆగిపోవడంవల్ల ప్రజలు, అనేక రకాల వ్యాపారస్తులు, సినిమా హాళ్ళు తీవ్ర ఇబ్బందులకు లోనౌతున్నందున ఇకముండి విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా అధికారులు సత్వరం చర్యలు గైకొనాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

# ఖమ్మం, తూర్పుగోదావరి జిల్లాల్లో వెదురు యూకలిప్టస్ తోటలు

హైదరాబాద్, డిసెంబర్ 28

వచ్చే ఆరేళ్ళలో ఖమ్మం జిల్లాలో 12 వేల ఎకరాలు, తూర్పుగోదావరిలో 6 వేల ఎకరాల ప్రాంతంలో వెదురు, యూకలిప్టస్ తోటలు పెంచి కలప పరిశ్రమకు ముడి సరుకు సరఫరా చేసేందుకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పరచామని అటవీశాఖా మంత్రి శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ అన్నారు.

పశ్చిమ గోదావరిజిల్లా కన్నాపురంలో నిన్న ప్రసంగిస్తూ సింగరేణి బొగ్గు గనులకు అవసరమైన కలప సరఫరాకై ఖమ్మం జిల్లాలో యూకలిప్టస్ తోటలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు,

పశ్చిమ గోదావరిలో తక్కువ రకం మిశ్రమ అడవిని విలువైన టేకు తోటలుగా మారుస్తున్నామని తెలిపారు. పశ్చిమ గోదావరి అడవుల నుండి ఏటా రు 50 లక్షల ఆదాయం వస్తోంది. వన్యమృగ సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక విభాగాన్ని ఏర్పరిచిందని చెప్పారు.

తూర్పు గోదావరిజిల్లా మారేడుమిల్లిలో మిరియాల పెంపకానికి అనుకూల పరిస్థితులున్నాయి కాఫీ తోటలు నాటాలని కూడా అటవీశాఖ ప్రచారం చేస్తోందని మంత్రి వివరించారు.

# బీహార్ ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, డిసెంబరు 28

చాస్నాల బొగ్గు గనిలో ప్రమాదానికి గురైన కార్మికుల దురవస్థపట్ల బీహార్ ముఖ్యమంత్రి శ్రీ జగన్నాథమిశ్రా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

చాలా మంది మరణించి వుండవచ్చునని తాను విచారిస్తున్నానని సహాయ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగుతున్నాయని సహాయ కార్యక్రమాలు ముగిశాక కానీ వివరాలు తెలియవని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ఆయన సానుభూతి వ్యక్తం చేశారు.

# పార్లమెంటరీ వ్యవస్థకు స్వస్తిపలికేయోచన లేదు

## న్యాయశాఖ మంత్రి గోఖలే స్పష్టీకరణ

చండీఘర్, డిసెంబరు 28

ప్రస్తుత పార్లమెంటరీ తరహా ప్రభుత్వానికి స్వస్తి చెప్పే యోచన ఏదీలేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ గోఖలే నేడిక్కడ స్పష్టీకరించారు.

అఖిల భారత న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన పై విషయం తెలిపారు

మన పార్లమెంటరీ వ్యవస్థ సవ్యంగా పని జేస్తున్నదని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ యిటీవల అన్న మాటలను ఆయన సభ దృష్టికి తెచ్చారు.

అయితే పార్లమెంటరీ వ్యవస్థను మరింత సమృద్ధివంతమూ, ప్రజావాంఛలకు అనుగుణంగా వుండేదిగాను చేయడానికి త్వరితగతిని రాజ్యాంగ మార్పులు చేయవలసిన అవసరం వుందన్నారు

రాజ్యాంగంలో ఎలాటి మార్పులు ప్రవేశపెట్టడానికైనా పార్లమెంటుకు అధికారం వున్నదని రాజ్యాంగమే ఆ అవకాశం కల్పిస్తున్నదని ఆయన అన్నారు.

మొత్తం రాజ్యాంగాన్ని రద్దు చేసి ప్రస్తుత పార్లమెంటరీ తరహా ప్రభుత్వం స్థానే రాష్ట్రపతికి సర్వాధికారాలువుండే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ప్రమాదం వున్నదంటూ, అంతకు మునుపు పంజాబ్ అడ్వకేట్ జనరల్ చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ అది కేవలం పుకార్లేనని శ్రీ గోఖలే కొట్టివేశారు

ఈ విషయానికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను కూడా తాను చూశానని ప్రజల దృష్టిని ఎక్కడెక్కడికో మళ్ళించడానికి చేస్తున్న కుటిలయత్నాలు అవి తప్ప మరొకటికాదని తెలిపారు

రాజ్యాంగం అన్నది 'మార్చడానికి వీలులేని పవిత్ర పత్రం' ఏమీ కాదని ప్రజాతంత్ర పద్ధతులద్వారా, రాజ్యాంగ పద్ధతుల ద్వారా మార్పులు తలపెట్టకపోతే ప్రజలు వారికి నచ్చిన పద్ధతిలో మార్పులు తెచ్చుకుంటారని ఆయన అన్నారు

దేశంలోని అన్ని ప్రాంతాల న్యాయవాదులు హాజరవుతున్న ఈ సమావేశాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ జైల్‌సింగ్ ప్రారంభించారు

ప్రజలకోసమే రాజ్యాంగం వుంది కానీ రాజ్యాంగం కోసం ప్రజలు లేరని, ప్రజావాంఛల సిద్ధికి అడ్డంకంగావున్న దేనినైనా తొలగించాల్సిందేనని శ్రీ జైల్‌సింగ్ అన్నారు.

'అసంపూర్ణ ఆర్థిక విప్లవం' పరిపూర్తికి ఏం చేయడానికైనా వెనుకాడరాదన్నారు

శ్రీ గోఖలే తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ న్యాయస్థానాలు-ముఖ్యంగా రిట్ దరఖాస్తులకు సంబంధించి తమకివ్వబడిన స్వతంత్రాధికారాలను యధేచ్ఛగా వాడుకుంటున్నాయని అందువల్లసామాజిక ఆర్థిక సంస్కరణల పురోగతికి ఆటంకం కలుగుతున్నదని వివరించారు.

ఇందులోని కొన్ని అధికారాలను కుదించాలని పార్లమెంటు భావిస్తే అందులో తప్పేమీలేదన్నారు.

ప్రజలే సర్వాధికారులు పార్లమెంటు అత్యున్నత అధికార సంస్థకాబట్టి పార్లమెంటు చేసే చట్టాలపై న్యాయస్థానాల పరిశీలన వుండటం ప్రజాతంత్ర వ్యతిరేకమన్న భావనను అమెరికా, బ్రిటన్, భారతదేశాల్లోని ప్రముఖ న్యాయశాస్త్ర ప్రవీణులు వ్యక్తం చేస్తున్నారన్నారు

వర్తమాన పరిస్థితి అవసరాలకు అనుగుణంగా న్యాయస్థానాల వ్యవహారాలను క్రమబద్ధం చేయడానికి ప్రజాతంత్ర పద్ధతిలో చర్యలు తీసుకోవడం దోషమేమీ కాదన్నారు అలా చేయకపోతే న్యాయశాఖ వ్యవస్థ కూలిపోతుందని ఆయన హెచ్చరించారు

న్యాయశాఖ స్వతంత్ర్యపవిత్రతను కాపాడానికైనా కొన్ని సంస్కరణలు అవసరం అన్నారు

పేదలకు న్యాయ సహాయం అందజేయడానికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలపట్ల హర్షం వ్యక్తం చేశారు.

అంతకు మునుపు జైఘకార్ హఫీ అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రజల అభిప్రాయాలను, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రాజ్యాంగ వ్యవస్థలను సవరించడం అవసరమని ఉద్ఘాటించారు.

ఒకప్పుడు అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ అన్నట్లు రాజ్యాంగం యథాతథంగా వుండిపోదని దేశం అవసరాలకు అనుగుణంగా అది మారుతూ వుంటుందని ప్రజలకు ప్రజలే రాజ్యాంగాన్ని ఇచ్చారని, ఆ ప్రజలే దానిని మార్చే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించారని శ్రీ హఫీ అన్నారు.

# కాంగ్రెస్‌వాదుల ఇళ్ళపై జనతాఫ్రంట్ దాడి

## 16 మందికి గాయాలు

అహమ్మదాబాదు డిసెంబరు 27

మెహసన జిల్లాకు చెందిన విస్‌నగర్ తాలూకాలోని భాదర్‌పూర్ గ్రామానికి చెందిన దాదాపు 200 మంది జనతాఫ్రంటు మద్దతు దారులు గత గురువారం కాంగ్రెస్ వాదుల ఇళ్ళపై దాడిచేసిన ఫలితంగా 16 మంది గాయపడ్డారని, అందులో నలుగురికి తీవ్రంగా గాయాలు తగిలినట్లు గుజరాత్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శ్రీ జైరాం భాయ్ పటేల్ నేడిక్కడ ఆరోపించారు

గాయపడినవారు యింకా విస్‌నగర్ ఆస్పత్రిలోనే వున్నారని, తాలూకా పంచాయతీ ఎన్నికలలో జనతాఫ్రంటు ఓటమి పొందటమే ఈ దాడికి కారణమని ఆయన పేర్కొన్నారు

కాంగ్రెస్ వాదుల యిళ్ళలోని గృహోపకరణాలు, యితర విలువైన వస్తువులను వారు లూటీ చేసినట్లుకూడా ఆయన తెలిపారు.

ఈ విషయమై గ్రామీణులు ముందుగా పోలీసులకు హెచ్చరిక చేసినప్పటికీ వారు ఎటువంటిచర్యా తీసుకోలేదని చెప్పారు.

కైరో, డిసెంబరు 28

అమెరికా అధ్యక్షుడు గెరాల్డుఫోర్డు ఈజిప్టు పర్యటన వచ్చే మార్చికి వాయిదావేయబడిందని కైరో పత్రిక అక్బర్ ఎల్ యామ్ తెలిపింది

# 1976 లో వియత్నాంలో ఎన్నికలు

## గియాప్ ప్రకటన

పారిస్, డిసెంబరు 28

ఉభయ వియత్నాంలు విలీనమైన అనంతరం 1976లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఉత్తర వియత్నాం రక్షణ మంత్రి గుయేన్ గియాప్ వెల్లడించారు

మొత్తం దేశానికి ఒకేఒకజాతీయ అసెంబ్లీ ఉంటుందని ఒకే కేంద్రప్రభుత్వం ఉంటుందని ఆయన వివరించారు

వియత్నాం పునరేకీకరణ ముగిసింది ఇప్పుడు సమస్యల్లా పాలనా వ్యవహారాలకు సంబంధించి పునరేకీకరణ జరగడమే అని ఆయన అన్నారు

# ఖమ్మంజిల్లాఅంతటా అపూర్వ ప్రజా సమీకరణ విస్తృత స్థాయిలో అలంకరణ, ప్రదర్శనలు

(విశాలాంధ్ర విలేకరి)

ఖమ్మం, డిసెంబరు 28

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలు ఖమ్మం జిల్లాలో అపూర్వమైన రీతిలో జరిగాయి. ఇల్లెందు, బూర్గంపహాడ్, భద్రాచలం, పాల్వంచ, సత్తుపల్లి, కొత్తగూడెం తదితర కేంద్రాల్లో ఆకర్షణీయమైన అలంకరణలతో, ప్రభలు, బండ్లతో, వేలాదిమంది ప్రజలతో ప్రదర్శనలు జరిగాయి. ఈ ఉత్సవాలు జిల్లాఅంతటా కమ్యూనిస్టు ఉద్యమానికి నూతనోత్సాహాన్ని, ఉత్తేజాన్ని యిచ్చాయి.

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంలో ఖమ్మంజిల్లా యువజనోత్సవాలు యీ నెల 22 నుంచి 26 వ తేది వరకు ఇల్లెందు పట్టణంలో జయప్రదంగా జరుపుకొని చివరి రోజున పట్టణంలో అపూర్వమైన ప్రజాప్రదర్శన నిర్వహించారు ప్రదర్శన అగ్రభాగాన జనసేవాదళ్ సభ్యులు క్రమశిక్షణతో నడువగా వారి వెనుక తెల్లని దుస్తులు ధరించిన మహిళా సంఘ సభ్యులు వారితోపాటుగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్మిక, కర్షక స్త్రీలు, తమ చంటి పిల్లలను ఒక చంక విడుకొని రెండో చేతిలో ఎర్రజెండాను పట్టుకొని "కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" అని నినాదాలు చేస్తూ వచ్చిన గిరిజన స్త్రీలు వారి వెనుక వందలాదిగా బాల సంఘ సభ్యులు, వారివెంట సైకిళ్ళతోవచ్చిన యువకులుఅనేక గ్రామాల నుంచి వచ్చిన రైతులు, కూలీలు గిరిజనులు, గని కార్మికులు రెపరెపలాడే ఎర్రజెండాలు చేబూని ముందుకు సాగిపోతుండగా చివరిలో వివిధ గ్రామాల నుంచి అనేక వర్ణాలతో అలంకరించబడిన 25 ప్రభలు, వాటిపైన ప్రజానాట్యమండలివారు విచిత్ర వేషాలతోనూ, పాటలతోనూ, నినాదాలతోనూ ఇల్లెందు పట్టణం యావత్తూ ఉర్రూతలూగింది. ఊరేగింపు సాగినంతసేపు పట్టణంలో ఎక్కడి ట్రాఫిక్ అక్కడ ఆగిపోయింది.

## స్థూపం ఆవిష్కరణ

కమ్యూనిస్టుపార్టీ 50వ వార్షికోత్సవానికి జ్ఞాపక చిహ్నంగా పట్టణంలోని ఒక కూడలి స్థలంలో యువకులు నిర్మించిన 12 అడుగుల యెత్తున వున్న స్థూపంవద్దకు ఊరేగింపు చేరుకొన్న తరువాత రాష్ట్రకమ్యూనిస్టుసమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాదరావు స్థూపాన్ని ఆవిష్కరించారు జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు అక్కడే ఎర్రజెండా ఎగరవేయగా, మరోవైపు యువజన సమాఖ్య పతాకాన్ని జిల్లా యువజనసమాఖ్యకార్యదర్శి శ్రీ టి వి చౌదరి ఆవిష్కరించారు తిరువాత ప్రదర్శకులు బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు పట్టణానికి రెండుమైళ్ళ దూరంలో వున్న 21 సెట్గని ప్రాంతం నుంచి ప్రారంభమైన ఊరేగింపు సభాస్థలికి చేరుకునేసరికి సరిగా మూడు గంటలు పట్టింది. ఊరేగింపు సభాస్థలికి చేరుకునే

[మిగతా 3 వ పేజీలో]

విశాలాంధ్ర

1975 డిసెంబరు 29 సోమవారం

# రైతులపై జబర్దస్తీ

రాష్ట్రంలో అతివృష్టి ఫలితంగా డెల్టా ప్రాంతంలోనూ, మెట్ట ప్రాంతంలోనూ రైతాంగం తీవ్రమైన నష్టానికి గురైంది. డెల్టా ప్రాంతంలో ధాన్యం దిగుబడి సగటున 30 శాతానికంటే తక్కువేనని అనధికార అంచనాల ద్వారా తెలుస్తున్నది. మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంటలతో సహా యితర అన్ని పంటలు దెబ్బతిన్నాయి వర్జీనియా పొగాకు నాట్లు మూడు పిడతలవరకు వేసిన సందర్భాలున్నాయి. అలాగే వేరుశెనగ, ప్రత్తి, మిరప, పసుపులాంటి పంటలకు గతంలో యెన్నడూ లేని విధంగా దెబ్బ తగిలి దిగుబడి తగ్గింది. అధిక వర్షాల మూలంగా పోయింది పోగా మిగిలిన పంట నాణ్యత సహజంగానే వుండకపోవచ్చు. తెగుళ్ళు, చీడలు సరేసరి.

వ్యవసాయ ఉపకరణాల ధరలు మండిపోతున్నా అప్పో సప్పో చేసి రైతాంగం లక్షలాది రూపాయలు పొలాల్లో పోసింది. తీరా వారికి మిగిలింది నిరాశ, నిస్పృహలు మినహా మరేమీ లేదు. రాష్ట్రం అంతటా ఆమూలనుంచి యీ మూలవరకు యిదే పరిస్థితి అని చెబితే అతిశయోక్తి కాదు.

గుండె నీరైవున్న యీ పరిస్థితిలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు రైతాంగానికి యే విధంగా తోడ్పడేవిగా లేవు. గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లుగా వున్నది. పండిన కాలంలోనూ ఎండిన కాలంలోనూ రైతుకు ఏమాత్రం చేయూత నిచ్చి సహాయం చేసే హేతుబద్ధమైన వైఖరిని ప్రభుత్వం అనుసరించలేదు.

పంట పుష్కలంగా వున్ననాడు ప్రభుత్వం ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయలేదు. రైతాంగం బరువు బాధ్యతలను చూడలేదు. అలాగే ఎండిననాడు సహాయ చర్యలు చేకొనలేదు, ఇది కట్టిపట్టని వైఖరి మాత్రమే. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించలేదని చెప్పడానికి ఉదాహరణ అనేక జిల్లాలలో రెవిన్యూ అధికారుల వేధింపు చర్యలు. భూమిశిస్తు చెల్లించలేదనే సాకుతో అధికారులు రైతుల యిండ్లమీద బడి చేస్తున్న జప్తులు. మీసా క్రింద అరెస్టు చేస్తామంటూ బెదిరింపులు.

జనవరి నుండి మార్చివరకు మూడు దఫాలుగా వసూలు చేయవలసిన భూమిశిస్తును డిసెంబరులో వసూలు చేసే రెవిన్యూ అధికారుల 'ముమ్మర కార్యక్రమాన్ని' ఏమనాలి?

ప్రభుత్వం, రైతాంగాన్ని వేధించి సాధించే యీ జబర్దస్తీని నిలుపుదలచేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం తక్షణ కర్తవ్యం. అలాగే బ్రిటిష్ హయాంనాటి కాలంచెల్లిన శిస్తు రెమిషన్ నిబంధనలను సవరించి సహేతుకమైన రైతాంగాన్ని ఆదుకొనే పద్ధతులలో శిస్తు రెమిషన్ ప్రకటించడంతోపాటు వాణిజ్య పంటలపై విధించిన ప్రత్యేక పన్ను వసూలు నిలుపుదల చేయడం, ప్రభుత్వ సహకార రుణాల వసూలు వాయిదా వేయడం, ఆయా పరిస్థితులను బట్టి రైతాంగాన్ని లెవీనుండి మినహాయించడం, రెండవ పంటకు రుణాలు మంజూరు చేయడం, రెండవపంట వేసుకోడానికి అనుమతి యివ్వడంలాంటి సహాయక చర్యలు తీసుకోవాలి

# పెద్దఎత్తున గార్షియా అణుస్థావర నిర్మాణం

## వాషింగ్టన్ స్టార్ వార్తాపత్రిక వెల్లడి

వాషింగ్టన్, డిసెంబరు 27

హిందూ మహాసముద్రంలో డిగో గార్షియా దీవిలో అణుసైనిక స్థావర నిర్మాణాన్ని అమెరికా రక్షణశాఖ త్వరితం చేస్తున్నదని వాషింగ్టన్ స్టార్ వార్తాపత్రిక ప్రకటించింది

విమానాశ్రయాన్ని విస్తృతం చేయటం జరిగింది అమెరికా సైనికులు వుండేందుకుగాను నూతన బ్యారెక్సును నిర్మించటం పూర్తయింది

యుద్ధ వాహక నౌకలు వుండేందుకు వీలుగా వున్న దీవిలోని లాగూన్ ప్రాంతంలో త్రవ్వకం కొనసాగుతున్నది

డిగోగార్షియాలో ఇంధన కేంద్రాన్ని రెండు నౌకాశ్రయాలను ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తున్నది

ఇప్పటివరకు డిగోగార్షియా స్థావరం నిర్మాణంపై 6.5 లక్షల డాలర్లను ఖర్చు చేశారు

ప్రస్తుతమున్న సౌకర్యాలను ఉపయోగించుకొని దీవిలో తమ కార్యకలాపాలను అమెరికా రక్షణశాఖ తీవ్రతరం చేసింది జలాంతర్గాముల ధ్వంసక విమాన శకటాలను ఈ దీవిలో వుంచారు

ఈ విమానాలకు ఉపయోగించే విమానాశ్రయాన్ని యు.2 గూఢచారి విమానాలు ప్రస్తుతం ఉపయోగిస్తున్నాయి పెద్దవైన బి-52 బాంబర్లకు ఇంధనాన్నందించే ఎయిర్ టాంకర్లు కూడా పనిచేస్తున్నాయి

నావికా కమ్యూనికేషన్లు దూర ప్రాంతాల నౌకలతో సమాచారాలను అందచేసుకుంటున్నాయి.

అధికారయుతంగా బ్రిటన్ యాజమాన్యం క్రిందనే యిది వున్నప్పటికీ అమెరికా సైనికులే ఇక్కడ ఎక్కువగా వున్నారు

# తిమూర్‌కు రాకూడదని ఐరాసబృందానికి అడ్డంకులు

జకార్తా డిసెంబరు 27

పోర్చుగీసు వలస ప్రాంతమైన తిమూరుకు ఐరాస పరిశీలకుల బృందాన్ని పంపడం నిరవధికంగా వాయిదా వేయాలని ఐరాస ప్రధాన కార్యదర్శికి ఇండోనేషియా అనుకూల తాత్కాలిక ప్రభుత్వం లేఖ పంపింది.

వాల్దీమ్ ఇకనుంచీ సదుగా తమను సంప్రదిస్తే మంచిదని తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్షుడు అర్నాల్డో అరాజో రాశారు. ఐరాస దూతను తగిన సమయంలో పంపుతామన్నారు

### ఇండోనేషియా సేనల దాడి

తిమూరులో ఇండోనేషియా సేనలు గురువారం పెద్ద దాడి ప్రారంభించాయని తాము స్వతంత్రం ప్రకటించిన ఫ్రెటిలిన్ కేంద్ర కమిటీ సభ్యుడి రేడియో సందేశం తెలిపిందని డార్విన్ (ఆస్ట్రేలియా)కు అందిన వార్త పేర్కొంది

రాజధాని, కీలక పట్టణాల నుండి దక్షిణ ప్రాంతానికి నౌకల నుండి బాంబుదాడులో, హెలికాప్టర్లు, ఎనిమిది దళాలు పెద్ద సంఖ్యతో అనేక మంది మరణించారు. పౌరుల తరలింపుకై తక్షణ వైద్య సాయం కావాలని రేడియో సందేశంలో కోరింది

# శాంతి కోరుకుంటున్న అమెరికన్ల ఆశలు-నిరాశలు

న్యూయార్క్ డిసెంబరు 28

యుద్ధాలన్నీ అంతం కావాలని భూగోళంపై శాంతి రావాలని, జాతి మత విద్వేషాలు పోవాలని, స్వేచ్ఛాయుతమైన వాతావరణం వ్యక్తి స్వేచ్ఛ ఉండాలని అనేకమంది అమెరికను మనసారా కోరుకుంటున్నారు.

హారిస్ ప్రజాభిప్రాయ సేకరణలో పై విషయాల గురించి గత ఏడాది సర్వే చేయబడినవారు చెప్పినదే ఈసారి సర్వేలో కూడా చెప్పారు

అయితే తాము బతికి ఉండగా ఈ ఆశల్లో ఏదీ నెరవేరగా చూడగలమని అత్యధికులు నిరాశ ప్రకటిస్తున్నారు హారిస్ తాజా సర్వేలో ఈ వివరాలున్నాయి

తాము బతికుండగా సుస్థిర శాంతిని చూసేందుకు నోచుకోమని 29 శాతం అనుకుంటున్నారు. శాంతి సాధ్యమేనని 26 శాతం భావిస్తున్నారు జాతి, మత విద్వేషం అంతం కాగలదని 30 శాతం నమ్ముతూండగా అది సాధ్యం కాదని 65 శాతం నిరాశ వెలిబుచ్చారు

ప్రజలందరికీ వ్యక్తి స్వేచ్ఛ రావడం జరగబోదని 48 శాతం గట్టిగా నమ్ముతుండగా వ్యక్తి స్వేచ్ఛ రావచ్చునని 3[illegible] శాతం విశ్వసిస్తున్నారు తాము బతికుండగా అణు నిర్మూలన జరుగుతుందని 44 శాతం భావిస్తే అలా జరగబోదని 51 శాతం నమ్ముతున్నారు

యుద్ధాల నివారణం సాధ్యమేనని 41 శాతం అనుకుంటే సాధ్యం కాదని 53 శాతం అనుకుంటున్నారు

# పాలస్తీనా సమస్యపై ఇజ్రాయిల్ ప్రభుత్వంలో విభేదాలు

టెల్అవీవ్, డిసెంబరు 27

పాలస్తీనా నాయకులతో చర్చలకు ఇజ్రాయిల్ నిరాకరించరాదని రక్షణమంత్రి షిమన్ పెరెస్ చెప్పడంతో ఈ సమస్యపై ఇజ్రాయిల్ ప్రభుత్వంలో విభేదాలు మరింత తీవ్రతరమయ్యాయి

ఆక్రమిత పశ్చిమతీరం భవితవ్యంపై ఇజ్రాయిల్, జోర్డాన్ పాలస్తీనా ప్రతినిధుల మధ్య రౌండ్ టేబుల్ సమావేశం జరగాలని టూరిస్టు మంత్రి మోషేకోల్ కూడా అన్నారు.

అయితే యాసర్ అరాఫత్ నాయకత్వాన ఉన్న ప్రధానమైన పాలస్తీనా విముక్తి సంస్థతో చర్చలకు వీరిద్దరూ నిరాకరించారు

పాలస్తీనా విముక్తి సంస్థతో చర్చలకు ప్రధాని ఇజాక్ రాబిన్ మొత్తంగా తిరస్కరిస్తున్న విషయం విదితమే. అయితే పాలస్తీనా విముక్తి సంస్థను మనం కాదంటుంటే అది మొత్తం పాలస్తీనా వాసే నిరాకరించినట్లుంది కనుక, స్థానిక స్వయం ప్రతిపత్తికి మన సానుకూలత వ్యక్తంచేయాలని రక్షణమంత్రి పెరెస్ "మరివ్" పత్రిక కిచ్చిన యింటర్వ్యూలో చెప్పారు.

'మధ్యేవాద పాలస్తీనీయుల'తో చర్చలకు విదేశాంగమంత్రి ఇగిల్ అలాన్ కూడా సుముఖత ప్రకటించారు. అయితే పాలస్తీనా రాజ్యం ఏర్పాటుకు ఈముగ్గురు గానీ మంత్రివర్గంలో మరెవ్వరుగానీ ఒప్పుకోవడంలేదు

### మయోటేలో అల్లరు

మెరోనీ (కొమరో దీవులు): కొమరో ద్వీప సమూహంతో కలిసి జులైలో స్వాతంత్ర్యం పొందకుండా వేరుపడిన మయోటె దీవిలో గత కొద్దిరోజులుగా అల్లర్లలో పలువురు మరణించారు. ఈ దీవిలో ఫ్రెంచి సామ్రాజ్యవాద సేనల" ఆక్రమణను కొమరో దీవుల ప్రభుత్వం నిరసించింది.

### యుగోస్లావియాకు బంగ్లా జౌళి

ఢాకా యుగోస్లావియాకు 4 కోట్ల టాకాల విలువగల 9700 టన్నుల జౌళిని బంగ్లాదేశ్ పంపే విషయమై నిన్న ఇక్కడ ఒప్పందం జరిగింది

### పుళ్ళీ నూనెదేశాల భేటీ

బీరుట్: గెరిల్లాల దాడివల్ల అర్థాంతరంగా ముగిసిన పెట్రోలియం ఎగుమతి దేశాల సమావేశాన్ని తిరిగి వియన్నాలో తమ దేశంలో జరపవలసిందిగా [illegible] కోరింది.

### బంగారం ఒప్పందం అపాలి

న్యూయార్క్: ప్రపంచ ద్రవ్యనిధి పర్యవేక్షణలో రూపొందించిన అంతర్జాతీయ బంగారం ఒప్పందాన్ని నిరవధికంగా వాయిదా వేయాలని అమెరికా పార్లమెంటు బ్యాంకింగ్ కమిటీ చైర్మన్ హెన్రీ రస్ కోరారు.

# ఉత్పత్తి పెంపుకై యుగోస్లావియా పథకం

బెల్గ్రేడ్ డిసెంబరు 2[illegible]

1976 నాటికి పారిశ్రామికోత్పత్తిని 6 శాతం, వ్యవసాయోత్పత్తిని 4 శాతం పెంచాలని యుగోస్లావియా పథకం రూపొందించింది

ప్రతినిధుల సభ నిన్న ఆమోదించిన వార్షిక ప్రణాళిక మేరకు జాతీయోత్పత్తి 5.5 శాతం పెరుగుతుందని అంచనా సాంఘిక రంగంలో ఉద్యోగుల సంఖ్య 3 శాతం పెంచాలని నిర్ణయించారు

# దేశంలో పెద్దఎత్తున అత్యవసర మందుల తయారీ సంకల్పం

పాట్నా, డిసెంబరు 27

అత్యవసర మందులను పెద్దఎత్తున ఉత్పత్తి చేసి మారుమూల ప్రాంతాలలో గల ప్రజలకు గూడా అందుబాటులో గల ధరలకు వాటిని సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పెట్రోలియం రసాయన శాఖల స్టేట్ మంత్రి శ్రీ ఎ పి శర్మ నేడిక్కడ వెల్లడించారు

భారత మందుల ఉత్పత్తిదారుల 27 వ మహాసభ ప్రారంభోత్సవం చేస్తూ మొత్తం జనాభాలో 20 శాతానికి మాత్రమే అధునాతనమైన మందులు లభిస్తున్నాయని చెప్పారు

దేశంలోని మారుమూల ప్రాంతాల వారికి కూడా అవసరమైన మందులు సరఫరా చేయటానికి పెద్ద ఎత్తున మందులు ఉత్పత్తి చేయటం అవసరమని, ఇందుకు ఉత్పత్తిదారులు కృషి చేయాలని అన్నారు

ప్రస్తుతం దేశంలో సంవత్సరానికి రు 360 కోట్ల విలువగల మందులు ఉత్పత్తి అవుతున్నాయని రు. 700 కోట్లకు పెంచవలసి వుంటుందని అన్నారు ఇందుకు మందుల ఉత్పత్తి సౌకర్యాలతోపాటు అలాగే పరిశ్రమ అవసరాలకు యంత్రాలను పెద్ద ఎత్తున సరఫరా చేయవలసి వుందని అన్నారు

పెట్రోలియం రసాయనాలు, బొగ్గు ప్రాతిపదిగా మందుల పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు

మహాసభలో మొత్తం దేశమంతటినుండి వచ్చిన 300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. అమెరికా, బ్రిటన్, మారిషస్‌ల నుండి ప్రతినిధులు మహాసభకు వచ్చారు.

# పోలియో వ్యాక్సిన్ ఉత్పత్తికి అనుమతి

బొంబాయి డిసెంబరు 26

హాఫ్కిన్ సంస్థ ప్రతిపాదించిన పోలియో వ్యాక్సిన్ ఉత్పత్తి పథకాన్ని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆమోదించింది. పోలియో వాక్సిన్ ఉత్పత్తికి అవసరమైన సామగ్రిని అందచేయడానికికూడా ఆ సంస్థ అంగీకరించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఉన్నతాధికారవర్గం ఇటీవల ఇక్కడకు వచ్చిన సందర్భంగా ఇక్కడి హాఫ్కిన్ సంస్థ అధికారులతో ఈ విషయమై చర్చించింది. ఉత్తరోత్తరా సంస్థ ఉత్పత్తిచేసే వాక్సిన్‌ను పరీక్షించడానికి ఆ ప్రతినిధివర్గం అంగీకరించింది

పోలియో వ్యాక్సిన్ ఉత్పత్తికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందచేయడానికి కేంద్రం నిర్ణయించినట్లు కూడా తెలుస్తున్నది

# భూమి పంపకానికి సమైక్య కృషి

—బహుగుణ

పానారే, డిసెంబరు 2[illegible]

భూములను సమంగా పంచేందుకు సమైక్య కృషి అవసరమని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ బహుగుణ నేడిక్కడ అన్నారు.

భూదానోద్యమ రజతోత్సవసందర్భంగా రెండవరోజు సర్వోదయ కార్యకర్తల నుద్దేశించి అయన ప్రసంగించారు. భూమి పంపకాన్ని త్వరితం చేయకపోతే ఇన్నాళ్ళ అన్యాయాలకు గురైన పేదలు తిరుగుబాటు చేస్తారన్నారు.

సామాజిక న్యాయం మాట అటుంచి భూమిలేని వారికి కనీసం అర ఎకరం దున్నే వారికి సరిపడా ఎకరాలు ఇస్తే అదే గొప్ప అన్నారు. భూములు సక్రమంగా పంచితే ధనికులు పేదల మధ్య సంఘర్షణ పోతుందని కూడా అన్నారు

బీహార్ పి.సి.సి అధ్యక్షుడు శ్రీ సీతారాం కేసరి మాట్లాడుతూ భూమి పంపక సమస్య పరిష్కారానికి భూదానోద్యమమే సరైన మార్గమని చెప్పారు.

# అగ్ని ప్రమాదంలో ఇద్దరి మృతి

హైదరాబాదు, డిసెంబరు 27

ఈనెల 25వ తేదీన జరిగిన రెండు అగ్నిప్రమాదాలలో ఇద్దరు మహిళలు మరణించారు. కర్నూలు జిల్లా సంజామల గ్రామంలో ఒక ఇంట్లో వంటకాలు తయారు చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించి లక్ష్మమ్మ అనే గృహిణి మరణించింది. మొత్తం 6 పాకలు దగ్ధమయ్యాయి 74 బస్తాల వరిధాన్యం రు 9 వేలకు పైగా విలువగల వస్తువులు దగ్ధమై పోయాయి

శ్రీకాకుళంజిల్లా పాలకొండ సమీపంలో వీరఘట్టంలో అగ్ని ప్రమాదం సంభవించి లక్ష్మినరసమ్మ అనే 70 సంవత్సరాల వృద్ధ మహిళ మరణించింది ఈ ప్రమాదంలో 9 పాకలు, పశువుల కొట్టాలు దగ్ధమయ్యాయి.

రు. 15 వేల విలువగల ఆస్తి నష్టం వుంటుందని అంచనా.

# హైకోర్టు శెలవులు

హైదరాబాదు, డిసెంబరు 28

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంక్రాంతి శెలవులు జనవరి 2 నుండి 16వ తేదీవరకు వుంటాయి

వేసవికాలం శెలవులు ఏప్రిల్ 26 నుండి జూన్ 4వ తేదీవరకు వుంటాయని నేడిక్కడ విడుదలైన అధికార ప్రకటన తెలిపింది.

# పేదరికంనిర్మూలనకు మతగురువుల కృషి

## రాష్ట్రపతి ఉద్బోధ

న్యూఢిల్లీ, డిసెంబరు 27

ఉద్రిక్తతలకు మూలమైన పేదరికం నిరుద్యోగం లను తొలగించేందుకు మతగురువులు కృషి చేయాలని రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ నేడిక్కడ అన్నారు.

లోక సమైక్య శతదినోత్సవ సందర్భంగా జరుగుతున్న ప్రపంచ మత మహాసభకు ఆయన ప్రధాన అతిధిగా హాజరయ్యారు సమాజంలో ఉద్రిక్తతలకు అసలు కారణాలు పేదరికం నిరుద్యోగాలయితే మతంపేరును సాకుగా వాడుకుంటున్నారని చెప్పారు ఈ ఆర్థిక సమస్య పరిష్కారమైతే ఉద్రిక్తత అదృశ్యమవుతుంది దేశం పటిష్టవంతమవుతుంది అన్నారు

అన్నిరకాల మతగురువులు సభకు హాజరయ్యారు అనేక పేద దేశాలను కొన్ని సంపన్న దేశాలు దోపిడీచేసే వ్యవస్థ పోవాలని ఆయుధపోటీ అంతం కావాలని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవుడి సంక్షేమానికి ఉపయోగపడాలని ఉద్బోధించారు.

# పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

హైదరాబాద్ డిసెంబరు 28

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నిన్న ఇక్కడ పోలీసుశాఖలోని క్రీడాకారులకు ఆర్థికసహాయం ప్రమోషన్లు లాంటి కొన్ని ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించారు.

రాష్ట్రపోలీసుల 15వ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు

వచ్చే బడ్జెట్లో పోలీసు క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారు. మంచి క్రీడాకారులకు క్రీడల ప్రతిభ ప్రాతిపదికపై ప్రమోషన్లు ఇవ్వడానికి వీలుగా ప్రస్తుత చట్టాన్ని సవరించే విషయమై కూడా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.

పోలీసుల గృహ సౌకర్యానికిగాను 1 కోటి రూపాయలు ఖర్చుపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది గృహ సౌకర్యం లేని పోలీసులకు ఇంటి అద్దె అలవెన్సు చెల్లించే విషయాన్నికూడా ప్రభుత్వం యోచిస్తున్నదని ముఖ్యమంత్రి వెల్లడించారు

అంతకు ముందు డి జి పి శ్రీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో పోలీసులు సాధించిన విజయాలను ప్రస్తావించారు అత్యవసర పరిస్థితి అనంతరం రాష్ట్ర మంతటా శాంతి భద్రతలు క్రమశిక్షణ 'పటిష్ట' మయ్యాయన్నారు.

# రాత్రి, పగటి వేళల్లో వేరు వేరు విద్యుత్ రేట్లు :

## కేంద్ర ప్రణాళికాశాఖ మంత్రి శ్రీ గుజ్రాల్ సూచన

న్యూఢిల్లీ, డిసెంబరు 27

లభ్యమైన విద్యుత్‌ను సక్రమంగా వినియోగించేట్లు చూసేందుకు రాత్రి, పగలు వేళల్లో వేరు వేరు విద్యుత్ రేట్లను అమలు పరచే విధానాన్ని ప్రవేశ పెట్టాలని కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడిక్కడ సూచించారు.

'గ్రామీణ ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి వినియోగం" అనే అంశంపై రెండురోజులపాటు ఇక్కడ జరిగిన సదస్సు ముగింపు సభకు అధ్యక్షత వహిస్తూ అయన పైవిధంగా అన్నారు.

వినియోగదారుల దృష్టినుండిచూస్తే పగటిపూటకూడా విద్యుత్‌ను సరఫరా చేయటం మంచిదే. అయితే ఇందువల్ల విద్యుత్ వినియోగానికి తీవ్ర అంతరాయం కలిగింది అందువల్ల రాత్రివేళల్లో విద్యుత్ వాడకంలో పొదుపు చేసేందుకు మనం ప్రయత్నించాలి అని ఆయన అన్నారు

ఈ సదస్సులో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ ప్రసంగిస్తూ, రాష్ట్రాల మధ్య వివాదాలవల్లనూ లేదా తగిన ఆర్థిక వనరులు లేనందువల్లనూ అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు నిలిచిపోయాయని, మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం త్వరితంగా జరిగేట్లు చూసేందుకు రాష్ట్రాలమధ్య వివాదాలు పరిష్కరింపబడుతున్నాయని చెప్పారు.

ముందుగా ప్రణాళికా సంఘం అనుమతి పొందకుండానే మైక్రో విద్యుత్ ఉత్పాదన పథకాలకు అమలుపరచేందుకుగానూ రాష్ట్రాల విద్యుత్ బోర్డులకు గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ రుణాల నివ్వటాన్ని అనుమతించాలని సదస్సు సిఫార్సు చేసింది.

# పాటిల్ ప్రకటనపై మనూభాయ్‌పటేల్ ఖండన

అహ్మదాబాద్, డిసెంబరు 27

కమ్యూనిస్టేతర ప్రతిపక్షాలన్నీ కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా ఒకే పార్టీగా విలీనం కావాలని సిండికేట్ నాయకులు శ్రీ ఎస్. కె పాటిల్ చేసిన ప్రకటనను సిండికేట్ ప్రధాన కార్యదర్శి శ్రీ మనూభాయ్ పటేల్ నేడు ఖండించారు

ఆయన ఒక పత్రికా ప్రకటనలో ప్రతిపక్ష భాగస్వామిపార్టీలు అలాంటి విధానానికి సంబంధించి ఎట్లాంటి నిర్ణయం చేయలేదని, గుజరాత్‌లోని జనతా ఫ్రంటులో భాగస్వామ్య పార్టీలు వాటి ప్రత్యేక ప్రతిపత్తిలోనే కొనసాగుతున్నాయని ఇదే ప్రస్తుతానికి అమోదయోగ్యమైన పద్ధతని ఆయన అన్నారు.

ఇంతకంటే ఎక్కువగా సాధ్యపడదని కూడా ఆయన అన్నారు.

ఏ ఒక్క పార్టీ ప్రతిపత్తిని తాకట్టు పెట్టే విధంగా ప్రతిపక్షాల ఐక్యత ఉండకూడదని ఆయన అన్నారు.

# ఢిల్లీలో రు. 4½ కోట్లు గుప్తధనం వెల్లడి

న్యూఢిల్లీ. డిసెంబరు 27

నేడు రు. 4½ కోట్ల గుప్తధనం బహిరంగంగా తెలియ చేయబడింది.

ఈ రోజు దాదాపు వేయి డిక్లరేషన్లు దాఖలు అయినట్లు ఆదాయపు కమిషనర్ శ్రీ అవతార్ సింగ్ తెలియ చేశారు,

ఇంతవరకు ఢిల్లీలో ఈ పథకం క్రింద వెల్లడైన గుప్త ఆదాయం సంపద రు 25 కోట్లు మించిందని ఆయన తెలిపారు.

# ట్రాఫిక్ క్రమబద్ధం చేయటానికి విద్యార్థులు

విజయవాడ డిసెంబరు 27

ట్రాఫిక్ ను క్రమబద్ధం చేయడంలో విద్యార్థులు సహాయపడాలని కృష్ణా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ హెచ్ జె దొర విజ్ఞప్తి చేశారు

కె బి యన్. కళాశాల యన్ యస్ యస్ ప్రత్యేక ఉత్సవానికి ఆయన అధ్యక్షత వహించారు.

ట్రాఫిక్ క్రమబద్ధం చేయటంలో పాల్గొన్న 80 మందికి శ్రీదొర సర్టిఫికెట్లు అందజేశారు

డిప్యూటీ రీజనల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీ డి వి యస్. యన్. మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ యస్. సుందరం, ప్రెస్ మాస్టర్ శ్రీ టి. యస్. యన్ మూర్తి ప్రసంగించారు.

యన్ యస్. యస్ సభ్యులు శ్రమతో ఏర్పాటు చేసిన తోటకు శ్రీ కాకరపర్తి భావనారాయణ ప్రారంభోత్సవం చేశారు. శ్రీ యం కె నారాయణ వందన సమర్పణ చేశారు. (వి. వి)

# శ్రీమతి జయమ్మ మృతి

ఏలూరు, డిసెంబరు 27

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ యూనియన్ విజయవాడశాఖ అధ్యక్షుడు శ్రీ వంగల కామేశ్వరరావు తల్లి శ్రీమతి జయమ్మ ఏలూరులో మరణించారు. ఈమె వయస్సు 75సంవత్సరాలు. వీరికి ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు.

# తాలూకా సమాచార కేంద్రం ప్రారంభం

## అవనిగడ్డలో

అవనిగడ్డ, డిసెంబరు 28

కృష్ణాజిల్లా దివి తాలూకా, సమాచార, పౌర సంబంధాలశాఖ వారిచే అవనిగడ్డలో నిర్వహింపబడు తాలూకా సమాచార కేంద్రానికి రాష్ట్ర విద్యా మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు యిటీవల ప్రారంభోత్సవము చేస్తూ సమాచార కేంద్రాలు సామాన్య ప్రజలకు వుపయోగపడేవిగా వుండాలని ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య మంచి సంబంధాలు ఏర్పడేలాగునవిజ్ఞానాన్ని ఒక క్రొత్త ధనాన్ని ప్రజలకు అందించాలని కోరారు.

తొలుత తాలూకా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ బి. అగ్రవాల్ అతిథులకు స్వాగతం పలికారు ఈ సందర్భంలో జరిగిన సభకు సమితి అధ్యక్షులు శ్రీ కోట కేశవ పెరుమాళ్ళు అధ్యక్షత వహించారు సభలో జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీ పి రామకృష్ణారావు ఉపన్యసించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ డి. సి వెంకట సుబ్బన్న ఎగ్జిక్యూటివ్ యింజనీరు శ్రీ వెంకటరమణయ్య, బి డి. వో. శ్రీ మూర్తి పాల్గొన్నారు

### తల్లాడలో మహిళా సమావేశము

ఖమ్మంజిల్లా కల్లూరు సమితి కేంద్రంలో ఇటీవల శ్రీమతి బుచ్చమ్మగారి అధ్యక్షతన స్థానిక మహిళామండలి సమావేశమై ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని అభినందిస్తూ తీర్మానించారు

ఈ సమావేశంలో ముఖ్యంగా శ్రీమతి పరిటాల హైమావతి, శ్రీమతి శివ సావిత్రి ప్రస్తుత అత్యయిక పరిస్థితిని 20 సూత్రముల పథకమునుగూర్చి వివరించారు ఇటీవల వయోజన స్త్రీలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆటల పోటీలో గెలుపొందిన విజేతలకు జిల్లాకలెక్టరు సతీమణి శ్రీమతి గోపికా ప్రసాద్ బహుమతి ప్రదానం చేశారు శ్రీమతి టి. జి ప్రసూనాంబ వందన సమర్పణతో సభ ముగిసింది.

# రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కుదించే ప్రస్తావనలేదు

## ప్రధాని శ్రీమతి గాంధీ స్పష్టీకరణ

చండీఘర్ డిసెంబరు 2[illegible]

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని తగ్గించే ఉద్దేశ్యం లేదని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి స్పష్టీకరించారు.

ఎ ఐ సి సి 7[illegible]వ పీనరి సమావేశం సందర్భంగా విడుదల కానున్న సావనీరుకు యిచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పై విషయం తెలిపారు

'రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి తగ్గించాలని కొన్ని వర్గాలు కోరినాయి కాని మేము ఆ పని చేయటంలేదు మేము న్యాయం కోసం నిలబడతాం. విచక్షణను పాటించం ఆశయ పక్షపాతాన్ని పాటించం" అన్నారు

రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తి కావాలి డిమాండ్‌ను ప్రస్తావిస్తూ మన రాజ్యాంగంలో రాష్ట్రాలకు కావలసినంత స్వయంప్రతిపత్తి కల్పించబడిందన్నారు

రాష్ట్రాల మధ్య సరిహద్దు తగాదాలు దేశ ఐక్యతకు దోహదం చేయవన్నారు ఆ తగాదాలు ఆయా ప్రాంతాల్లో అస్థిరతను సృష్టిస్తాయని హెచ్చరించారు.

రాష్ట్రాల మధ్య నీటి తగాదాలు కూడా దేశ సమగ్రతను బలహీన పరుస్తాయన్నారు

నీటి వివాదాల పరిష్కారానికి ఉద్దేశించిన ట్రిబ్యునల్స్ నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతూందన్నారు.

# అదనపు స్టోరేజి నిర్మాణానికి ఆహార కార్పొరేషన్ నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 28

ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి 4, 6000 టన్నుల సరుకు అదనంగా నిలవ చేయడానికి వీలుగా ప్రాధాన్యత ప్రాతిపదికపై గోదాము నిర్మించాలని భారత ఆహార కార్పొరేషన్ నిర్ణయించింది.

కొత్త రాష్ట్రాలైన అంధ్రప్రదేశ్, అస్సాం, గుజరాత్, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా తమిళనాడు, త్రిపుర, పశ్చిమ బెంగాల్, సరిహద్దు రాష్ట్రమైన జమ్మూ-కాశ్మీరులలో ధాన్య సేకరణ, ప్రభుత్వ పంపిణీ అవసరాల దృష్ట్యా కొత్తగా గోదాము నిర్మిస్తుంది

దేశంలో అదనపు స్టోరేజి అవసరాలపై కేంద్ర స్టోరేజి కమిటీ రేపు ఇక్కడ సమావేశమై పరిశీలిస్తుంది కేంద్ర ఆహార కార్పొరేషన్, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ల ప్రతిపాదనలు కూడా సమావేశంలో పరిశీలిస్తారు.

# గట్టిగా పనిచేసే వైద్య పరికరాలు

## ఉత్పత్తికి అణుశక్తి కమిషన్ ప్రాధాన్యత

అహ్మదాబాదు, డిసెంబరు 27

వైద్య సంబంధమైన కార్యకలాపాలకు సాధారణమైన, తక్కువ ఖరీదు చేసే, విశిష్టవంతంగా పనిచేసే గట్టి సాంకేతిక పరికరాలను అభివృద్ధి పరచే అంశానికి అణుశక్తి కమిషన్ అధికతర ప్రాధాన్యత యిస్తోందని కమిషన్ చైర్మన్ శ్రీ హెచ్.ఎన్. సేత్నా నేడిక్కడ చెప్పారు.

సర్జన్స్ అసోసియేషన్ 35వ వార్షిక సమావేశాన్ని సేత్నా ప్రారంభిస్తూ, అణుశక్తి పరిశోధక కమిషన్‌శాఖ చేస్తున్న కృషి ఫలితంగా వివిధ వ్యాధుల రోగ నిదానం, చికిత్సల విషయంలో నూతన మార్గాలను అన్వేషించి పెట్టిందని ఆయన చెప్పారు.

స్వయం చలిత బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రోగ నిదానం, చికిత్సలలో అణు ధార్మిక ఐసోటోపుల వినియోగం, వ్యాధుల నిదానం చికిత్సలలో మాస్-స్పెక్ట్రోమెట్రీ, మెడికల్ ఎలక్ట్రానిక్స్, కృత్రిమ కిడ్నీ, శ్వాసకోశ యంత్రాలు, రేడియో ఫార్మస్యూటికల్, రేడియేషన్ పద్ధతులను యీ సందర్భంగా ఆయన ఉదహరించారు.

బాబా అణుపరిశోధనా కేంద్రం బయో 'మెడి'కల్ గ్రూపు, బొంబాయిలోని టాటా స్మారక కేంద్రం, యింతవరకు కష్టసాధ్యంగా భావింపబడుతున్న కొన్ని వ్యాధుల నిర్ణయం, చికిత్సల విషయంలో, శ్రీదే ఆధ్వర్యం క్రింద అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని సేత్నా చెప్పారు

అణుశక్తి కమిషన్ ఆధ్వర్యాన భారత ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ అనేక రకాల వైద్యపరికరాలు, ఉత్పత్తి చేస్తోందనీ ట్రాంబేలో శ్రీ శే ఫార్మస్యూటికల్ పరికరాల స్టెరిలైజేషన్‌కు సౌకర్యాలు ఏర్పాటు చేశారనీ చెప్పారు.

వివిధ రకాల రేడియో ఫార్మస్యూటికల్స్ (మందులు) ఉత్పత్తి ఫాక్టరీని త్వరలోనే నెలకొల్పనున్నట్లు కూడా ఆయనే చెప్పారు.

# హైదరాబాద్ ఇస్కాన్ సర్వసభ్య సమావేశం

హైదరాబాదు. డిసెంబరు 28

ఇస్కాన్ అవతరణ రజతోత్సవాల నిర్వహణను గురించి చర్చించే నిమిత్తం నగర ఇస్కాన్ సర్వసభ్య సమావేశం జనవరి ఒకటవ తేదీ సాయంత్రం 6 గంటలకు ఇస్కాన్ కార్యాలయంలో జరుగుతుంది.

జనవరిలోనే ఇస్కాఫ్ నగరశాఖ మహాసభ నిర్వహించడానికి ఏర్పాట్లు కూడా చర్చిస్తారు అంతకుముందు అక్కడే నగరశాఖ కార్యవర్గ సమావేశం కూడా జరుగుతుంది.

# లేఖలు

### సత్తుపల్లి తాలూకా రైతుల దుస్థితి

అయ్యా,

ఖమ్మంజిల్లా, సత్తుపల్లి తాలూకాలో రైతుల పరిస్థితి దీనావస్థగావున్నది ప్రస్తుతం భారత ప్రధాని ప్రకటించిన 20 సూత్రములు మా రైతులోకం హర్షించి 'అమలు చేయుటలో' మా సహకారము నందించుటకు ముందు నిలిచినను అందు మొదటి సూత్రమైన ధరల తగ్గింపు, ఉత్పత్తి సక్రమ పంపిణీ విషయములో ప్రభుత్వ జాప్య వైఖరివల్ల చాలాబాధలు పడుచున్నాము యీ సంవత్సరం తెగుళ్ళు, అధిక వర్షాల వల్ల రైతు పెట్టుబడికి తగినంత పండకపోవటమే గాక, ధరలు బొత్తిగా పడిపోయి మద్దతు ధర యిచ్చి కొనుటకు ప్రభుత్వమువారు యేర్పాటు చేయకపోవుటచే యీ దుస్థితికిలోనుగావలసి వచ్చినది.

పూర్వం వడ్లబస్తా ధరకు యూరియా బస్తా వచ్చుటచే రైతుకు బాధలేకపోయినది యిప్పుడు మూడు వడ్ల బస్తాలు అమ్మినను ఒక బస్తా రసాయనిక యెరువు రాకపోవుట ప్రభుత్వం గమనించి రసాయనిక ఎరువులు కుడి యోగంగా వడ్ల బస్తా ధరకు దొరుకునట్లు సప్లయి చేయుటకు యేర్పాట్లు చేయనియెడల రైతుకు అధిక దిగుబడిని సాధిద్దామనే కుతూహలము తగ్గి ఉత్పత్తి పడిపోగలదని భావించుచున్నాము

ఇట్లు
భవదీయుడు
చుక్కారి నాగభూషణం, సత్తుపల్లి

### మిలిటరీ పెన్షన్

అయ్యా!

నాకు రావలసిన 'మిలిటరీ పెన్షన్ అలవెన్సులు" ది 1-12-1974 తేది నుంచి యింతవరకు యివ్వబడలేదు యింత విషయమై నేనున్నూ - 'కంట్రోలర్ ఆఫ్ డిఫెన్సు అకౌంట్సు (పెన్షన్లు) అలహాబాదు-కమాండింగ్ ఆఫీసర్ ఆర్టిలరీ రికార్డ్సు నాసిక్‌రోడ్డు క్యాంపు - వారలకున్నూ ఎన్ని ఉత్తరములు "పశ్చిమ గోదావరిజిల్లా ట్రెజరీ ఆఫీసర్ - ఏలూరు' వారికి తెలియ పర్చినప్పటికిన్నీ యింతవరకు బట్వాడా ఉత్తర్వులు యిప్పించి వుండలేదు. ప్రస్తుత అత్యవసర పరిస్థితినికూడా గమనించక అందుకు భిన్నముగా, బాధ్యతగల జిల్లా అధికారి కాలయాపనం చేయుచు పేద మిలిటరీ పెన్షనరను కష్టములు పాలుచేయుట చాలా శోచనీయమైన విషయము

సదరు జిల్లా ట్రెజరీ ఆఫీసరు వారు వెంట వెంటనే బట్వాడా చేయుటకు ఆర్డర్లు యిప్పించక బాధించుట పరిపాటైనది లోగడ నాకు రావలసిన పెన్షన్" విషయమై "రిప్లయి పెయిడ్ టెల్గ్రాం" యిచ్చినప్పటికిన్నీ సమాధానపు 'టెల్గ్రాం' పంపక విపరీతముగా కాలయాపనం చేస్తున్నారు.

గనుక యిప్పటికైనను సదరు జిల్లా ట్రెజరీ ఆఫీసర్‌వారు వెంటనే నాకు రావలసిన 'మిలిటరీ పెన్షన్ అలవెన్సులు" 1.12.74 తేదీ నుంచి బట్వాడాచేయుటకు ఉత్తర్వులు యిప్పించ గలరని ఆశించుచున్నాను.

వా॥ సూర్యప్రకాశరావు
చట్యాల

### భీమవరం నుండి జువ్వలపాలెం వరకు రోడ్డు పరిస్థితి

అయ్యా!

భీమవరం నుండి జువ్వలపాలెం వరకు రోడ్డు పరిస్థితి మరీ అధ్వాన్నముగా వున్నది. ఆర్. టి. సి బస్సులో ప్రయాణము చేయుటకు ప్రయాణీకులు భయపడుచున్నారు. ఎప్పుడు ఎక్కడ బస్సు పడిపోతుందోనని ఎక్కాలంటే సందేహిస్తున్నారు భీమవరం నుండి జువ్వలపాలెం వరకు రోడ్డు సరిగా లేక బురద గుంటలు గోతులలో పడి చక్రము విరిగిపోయిన సంఘటనలు కూడా వున్నవి గర్భిణీ స్త్రీలు బస్సులలోగాని గుర్రపు బళ్ళలోగాని ప్రయాణము చేయుట చాలా ప్రమాదకరము కావున ప్రభుత్వము వారు ప్రయాణీకుల ప్రమాదములను గమనించి అర్థంచేసుకొని తక్షణమే రోడ్ల మరమ్మత్తు కార్యక్రమమును చేపట్టి ప్రజలకు సరియైన ప్రయాణమార్గమును నెలకొల్పవలసినదిగా ప్రార్థిస్తున్నాను

ఇట్లు
నెమలి రాంబాబు యాదవ్,
తంగెళ్ళమూడి, ఏలూరు 2.

# నిర్బంధశిస్తు వసూళ్ళ స్వస్తికై డిమాండ్

## ప్రభుత్వానికి రైతుసంఘం నాయకులు శ్రీ వై.వి.కృష్ణారావు విజ్ఞప్తి

విజయవాడ, డిసెంబర్ 27

భారీ వర్షాలవల్ల పంటలు దెబ్బతిన్న రైతులనుండి శిస్తు వసూళ్ళకై జప్తు చేయటం వంటి నిర్బంధ చర్యలను రెవిన్యూ అధికారులు చేపట్టకుండా నిరోధించేందుకై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు శ్రీ వై. వి. కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నిర్బంధ శిస్తు వసూళ్ళపై శ్రీ వై. వి. కృష్ణారావు నిన్న విడుదల చేసిన ప్రకటనలో ఇలా పేర్కొన్నారు.

గత వారం రోజులుగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణాజిల్లాల లోని కొన్ని గ్రామాలకు నేను పర్యటించటం జరిగింది.

శిస్తు వసూళ్ళకై రెవిన్యూ అధికారులు తీవ్రంగా బాధిస్తున్నారని అనేకచోట్ల రైతులు ఫిర్యాదు చేశారు. ఈ జిల్లాలలో సాధారణంగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో భూమిశిస్తు వసూలు చేయటం జరుగుతుంది. అయితే యీ సంవత్సరం డిసెంబర్‌లోనే భూమి శిస్తు చెల్లించాలని లేనిపక్షంలో జప్తులు చేయటం జరుగుతుందని గ్రామాలలో దండోరా వేశారు.

ఈ సంవత్సరం భారీ వర్షాల ఫలితంగా ధాన్యం దిగుబడి గణనీయంగా దెబ్బతిన్నాయి. ఎకరాన ధాన్యం దిగుబడి 30 శాతంకన్నా తక్కువగానే వున్నది. వ్యవసాయ ఖర్చులు ఒక వైపున పెరిగిపోగా ధరలు పడిపోయాయి. మిల్లర్లు లేవీ ధరకుకూడా ధాన్యం కొనుగోలు చేయటం లేదు.

కొద్ది మొత్తంలో వారు కొనుగోలు చేసినప్పటికీ ఉత్పత్తిదార్లకు వారు డబ్బు చెల్లించటంలేదు. ఈనాడు వున్నంత దుర్భర పరిస్థితులలో రైతాంగం ఎప్పుడూ లేదు.

ఈ దశలో గిట్టుబాటు ధరను నిర్ణయించి ఆ ధర ప్రకారమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించటం ద్వారా రైతాంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావలసి వుంటుంది.

అయితే కేంద్ర ప్రభుత్వం గత సీజన్‌లో మాదిరిగానే యీ సంవత్సరంకూడ రైతాంగం ఉత్పత్తులకు ధరలు నిర్ణయించాయి. ఈ ధరలు రైతులకు గిట్టుబాటు అయినవికావు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పునస్సమీక్షించవలసిన సమస్య యిది.

అయితే అన్నింటికన్నా తక్షణ సమస్యేమిటంటే భూమిశిస్తు వసూళ్ళకై రైతులను అధికార్లు బాధించటాన్ని నిలుపుచేయవలసి వుంటుంది.

భూమి శిస్తుకై చింతలపూడి, తదితర గ్రామాలకు చెందిన రైతుల చెరకు బండ్లను ఫ్యాక్టరీ గేటుముందే జప్తు చేయటం జరిగింది. ఇప్పటివరకు 15 మంది రైతుల చెరకు బండ్లను జప్తు చేయడం జరిగింది.

అలాగే దివి తాలూకా రావి వారిపాలెంకు చెందిన శ్రీ డి బసవయ్య లెవీ ధాన్యాన్ని రైసు మిలుకు తీసుకు వెళుతుండగా దారిలో జప్తుచేశారు. రెవిన్యూ శిస్తు వసూళ్ళకై రెవిన్యూ అధికారులు అనుసరిస్తున్న నిర్బంధ విధానాలకు యివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మీసా క్రింద అరెస్టులు చేస్తామని కూడా రైతులను వారు బెదిరిస్తున్నారు.

అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రస్తుత పరిస్థితిలో జోక్యం చేసుకుని రెవిన్యూ అధికారులచే ఆస్తుల జప్తుకు నిర్బంధ చర్యలకు స్వస్తి చెప్పించాలి. అదే సమయంలో ధాన్యం తదితర వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను నిర్ణయించాలి. అలాగే చెరకు ఉత్పత్తిదారులకు రావలసిన బకాయీలను చెల్లింపచేసేందుకు రాష్ట్రప్రభుత్వం పటిష్టమైన చర్యలను తీసుకోవాలి.

# అడవుల చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్సు

హైదరాబాదు డిసెంబరు 27

కలపకోసమో అటవీ ఉత్పత్తులను దొంగతనంచేస్తూ పట్టుబడితే, అపహరణకు వాడిన వాహనాలు ఇతర పనిముట్లను స్వాధీనం చేసుకొనే అధికారాన్ని అసిస్టెంట్ కన్సర్వేటర్లకు మాత్రమే పరిమితం చేస్తూ రాష్ట్రగవర్నర్ ఒక ఆర్డినెన్సును జారీ చేశారు. ఇదివరకు ఈ అధికారం ప్రతి ఫారెస్టు లేదా పోలీసు అధికారికి వుంది.

మేరకు 1967 అడవుల చట్టాన్ని సవరిస్తూ ఈనెల 17 వ తేదీన ఆర్డినెన్సు వెలువడింది. ఇది వెంటనే అమలులోకి వస్తుంది.

ఈ విధంగా వాహనాలను ఇతర పనిముట్లను వశపరచుకొనడాన్ని సవాలుచేస్తూ జిల్లా కోర్టులో అపీలు చేసుకొనేందుకు కూడా ఈ ఆర్డినెన్సువల్ల అవకాశం లభిస్తుంది.

అటవీ ఉత్పత్తులను అపహరిస్తుండగా పట్టుబడిన వారికి రెండు సంవత్సరాల కఠిన శిక్షగాని రెండు వేల రూపాయల జరిమానాగాని లేదా రెండూగాని విధించవచ్చు. ఇది కాక అపహరణకు వాడిన వాహనాలను స్వాధీనపరచుకోవటం కూడా జరుగుతుంది.

చందనం అపహరించే కేసుల్లో మూడు నెలల జైలుశిక్ష 10 వేల రూపాయలవరకు జరిమానా విధించవచ్చు.

# పుగాకు కమిషన్ గడువు పొడిగింపు

హైదరాబాద్, డిసెంబరు 27

పుగాకు పరిశ్రమపై ఏర్పాటు చేసిన ఏక సభ్య విచారణ కమిషన్ పదవీ కాలాన్ని మరో సంవత్సరంపాటు పొడిగించారు.

పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిశీలించి రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు గాను యీ కమిషన్ ఏర్పాటు చేయబడింది.

# జయప్రకాశ్‌కు రక్తశుద్ధి

బొంబాయి డిసెంబరు 27

జయప్రకాశ్ నారాయణ్‌కు నేడు జస్లోక్ హాస్పటల్లో దాదాపు 7 గంటల సేపు రక్తశుద్ధి చికిత్స జరిగింది.

సాయంత్రం హాస్పిటల్ నుండి ఆయన తన సోదరుని ఇంటికి వచ్చారు.

తిరిగి సోమవారం రక్తశుద్ధి చేయబడుతుందని హాస్పటల్ అధికారులు తెలిపారు.

# బాల బాలికల ప్రత్యేక పార్కు

## నెల్లూరు మునిసిపాలిటీ ప్రతిపాదన

నెల్లూరు డిసెంబరు 27

మద్రాసు బస్‌స్టాండ్ వద్ద బాల బాలికలకు ప్రత్యేకంగా పార్కు నిర్మించడానికి నెల్లూరు మునిసిపాలిటీ 1976-77 బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

రామమూర్తి నగర్, పఠాన్‌పేటలలో కొత్తగా కూరగాయల మార్కెట్లు ప్రారంభించడానికి కూడా ప్రతిపాదించడం జరిగిందని మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, కమిషనర్ శ్రీ పి. నాగేశ్వరరావు ఇటీవల విలేకరులతో అన్నారు.

ఈ సంవత్సరం నెల్లూరు మునిసిపాలిటీకి లక్ష్యం (రు కోటి) కంటె ఎక్కువ ఆదాయం వచ్చిందని, గతంలో ఎప్పుడూ ఇలా రాలేదని 1976-77 లో కోటి 35 లక్షల 89 వేల ఆదాయం వస్తుందని బడ్జెట్ అంచనాలు తెలుపుతున్నాయని తెలిపారు.

నెల్లూరు జనాభా బాగా పెరిగిపోతున్నందువల్ల ఫలితంగా కొన్ని సమస్యలుకూడా కొత్తవి పుట్టుకొస్తున్నాయని, పట్టణంలో [illegible] అధ్వాన్నంగా వున్న యాసీ సీటని పరిశుభ్రపరచడానికి రు 20 లక్షలు కేటాయించారని శ్రీ నాగేశ్వరరావు తెలిపారు.

వీధిలైట్లు కొన్ని మామూలు బల్బుల స్థానే ట్యూబులైటులు వేస్తున్నారు.

# ప్రాథమిక చేనేత సంఘాలకు రిబేటు సౌకర్యానికి విజ్ఞప్తి

భట్టిప్రోలు డిసెంబరు 27

చేనేత నిల్వలు ఎప్పటి నుండో పేరుకుని పోయి ప్రాథమిక చేనేత సహకార సంఘాలు తీవ్ర ఇబ్బందులకు లోనైనందున ఈ ప్రాథమిక సంఘాలకు కూడా రిబేటు సౌకర్యం కల్పించాలని, భట్టిప్రోలు చేనేత సహకార సంఘం మేనేజరు శ్రీ రామచంద్రం జగన్మోహనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డిసెంబరు 20 నుండి జనవరి 3 వరకు చేనేత వస్త్రాల అమ్మకాలపై 20 శాతం రిబేటు ఇస్తున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించారు.

అయితే ఈ ప్రకటన ప్రాథమిక సంఘాలకో లేక రాష్ట్ర సొసైటీలకో లేక అన్నింటికీ వర్తిస్తుందో లేదో స్పష్టంగా లేనందున ఆయన పై విధంగా విజ్ఞప్తి చేశారు.

# కళాకారులకు జోహార్లు

ఏలూరు డిసెంబరు 27

పశ్చిమగోదావరిజిల్లా నృత్య, నాటక వృత్తి కళాకారుల సంఘం సమావేశం ఇటీవల యిక్కడ జరిగింది.

గత నాలుగు దశాబ్దాలుగా నాటక కళోన్నతికి కృషిచేసి నటీ, నటులకు శిక్షణ కలుగజేసి, రంగస్థలానికి అద్వితీయమయిన సేవల నర్పించిన శ్రీయుతులు కోనే మాధవరావు, చింతా సుబ్బారావుల మృతికి సమావేశంలో సంతాపం తెలియజేశారు.

# సభలు-సమావేశాలు

చల్లపల్లి మార్కెట్ ఏరియా చెరకు రైతుల మహాసభ ఈనెల 31 వ తేదీ మధ్యాహ్నం చల్లపల్లి కమలా టాకీస్‌లో జరుగుతుంది. ప్రదేశ్ రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రసంగిస్తారు.

# సినిమా మోజు గలవారిని మోసం చేసిన దొంగ

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ డిసెంబరు 27

సినిమా పరిశ్రమ ప్రముఖులతో పరిచయమున్నదని, సినిమాలు తీస్తున్నామని మోసగించి దొంగతనాలు చేస్తున్న ఒక యువకుని విజయవాడ పోలీసులు నేడు అరెస్టు చేశారు.

విజయవాడకు చెందిన గుడిపల్లి జగన్నాథరావు పి కె యం ప్రకాశరావు పేరుతో క్రాంతికళా అడ్వర్టైజర్స్ ద్వితీయ చిత్రం అనురాగబంధం నిర్మిస్తున్నట్లు పెక్కుమందికి నమ్మించాడు కొన్ని చిత్రాలను ఏరియా వారిగా కొంటున్నట్లు నమ్మించేవాడు, ప్రముఖ తారలకు అడ్వాన్సులు యిచ్చినట్లు లెక్కలు కొన్ని చూపేవాడు కొన్ని కొత్తవారలు [illegible] చేశాడు.

గత 8 సంవత్సరాలుగా యీ విధంగా దొంగతనాలు చేస్తున్న యితని కొరకు విజయవాడ పోలీసులు 8 సంవత్సరాల కాలంగా అన్వేషిస్తున్నారు. రు 3,300 నగదుతో సహా [illegible] అరెస్టు చేశారు. ఇతనివద్దనుండి 20 వేల విలువగల ఏడు విదేశీ టేపు రికార్డర్లను రివాల్వరును స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు, [illegible] తదితర పట్టణాలలో దొంగతనాలు చేశాడు. సికింద్రాబాద్ ఒక వ్యాపారికి 6 టేపురికార్డర్లను అమ్మాడు. ఈ వ్యాపారి ఆ తరంగిణి థియేటర్ [illegible] 27 సంవత్సరాల వయస్సుగల జగన్నాథరావు రాష్ట్రంలోని అన్ని పట్టణాలలో సినిమా మోజుగల పెక్కుమందిని మోసంచేసి యీ విధంగా దొంగతనాలు చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పట్టణ డి. యస్ పి. శ్రీ వి. రామచంద్రుడు ప్రత్యక్షపర్యవేక్షణలో యిన్‌స్పెక్టర్ శ్రీ సత్యనారాయణ యీ దొంగను అరెస్టుచేశారు.

# గుప్తధనం ఐచ్ఛిక ప్రకటన గడువు పొడిగింపుకు తిరస్కృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 27

గుప్తధనాన్ని బహిర్గతం చేయుటచేసే పథకం గడువు పొడిగింపు కేంద్రప్రభుత్వం నిరాకరించిందని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

ముందు తెలిపిన ప్రకారం డిసెంబరు 31 అర్ధరాత్రితో ఈ పథకం గడువు ముగుస్తుందని ఆ ప్రతినిధి తెలిపారు.

## రాష్ట్రంలో రు.4 కోట్ల ప్రకటన

హైదరాబాద్ డిసెంబరు 27

ఇంతవరకు రాష్ట్రంలో రు 4 కోట్లకు పైగా గుప్తధనం ఐచ్ఛికంగా బయటపెట్టడం జరిగింది. ఇది 700 మంది వ్యక్తుల ఖాతాలకు సంబంధించిందని ఆదాయపు పన్ను శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

గుప్తధనం బయటపెట్టడానికి నిర్ణయించిన గడువు దగ్గరపడుతున్న కొద్దీ రాష్ట్రంలోని 34 ఆదాయపుపన్ను అధికారుల కార్యాలయాలలో వ్యాపారస్తులు పారిశ్రామిక వేత్తల రద్దీ ఎక్కువైందని ఆ ప్రతినిధి తెలిపారు.

ఈ రోజు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటలవరకు 207 ఖాతాలు బయట పెట్టబడ్డాయి ఇవన్నీ నగదు, నగలు, పెట్టుబడులకు సంబంధించినవని ఆ ప్రతినిధి తెలిపారు.

## 4 రోజులే గడువు

విజయవాడ డిసెంబరు 27

గుప్తఆదాయం గుప్త ధనం స్వచ్ఛందముగా వెల్లడి చేయటానికి యిక నాలుగు రోజులు గడువు వున్నదని విజయవాడ ఆదాయం పన్నుశాఖ ఇన్‌స్పెక్టింగ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ యం. సీతారామయ్య తెలియ చేస్తున్నారు.

# లారీ ప్రమాదంలో ముగ్గురు రిక్షా డ్రైవర్లకు గాయాలు

రాజమండ్రి డిసెంబరు 26

ఇక్కడి 2 వ టౌను పోలీసు స్టేషన్ ప్రాంతంలో నిన్న రాత్రి ఒక లారీని మరో లారీ తప్పించుకుని వేగంగా పోవడానికి ప్రయత్నించగా పేపరుమిల్లుకు పోతున్న లారీ ఎ పి ఎస్ 1471 రోడ్డు ప్రక్కగల రిక్షాలమీదుగా డ్రైనేజిని దాటి మునిసిపల్ పార్కు పిట్టగోడను గుద్దుకుంది.

ఈ సందర్భంగా కాపవరపు సత్యనారాయణ నాయుడు, పెద్దిరాజు, సిద్ధాబత్తుల వెంకట్రావు అనే ముగ్గురు రిక్షావాళ్లు సైకిలుమీద వెళుతున్న మరో ప్రయాణీకుడు గాయపడ్డారు. సైకిలు వ్యక్తికి చాలా తీవ్రంగా గాయాలు తగిలినట్లు తెలుస్తున్నది. మూడు రిక్షాలు, ఒక సైకిలు లారీ క్రింద పడి నలిగిపోయాయి. మరో రిక్షా కూడా పూర్తిగా పాడైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే రిక్షా డ్రైవర్సు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీ కోరెడ్ల శ్రీరామమూర్తి, అంబటి సూర్యారావులు ప్రమాద స్థలానికి వచ్చి గాయాలు తగిలిన వారిని వెంటనే ఆసుపత్రిలో చేర్చారు.

పట్టణంలో కంకరలారీలు పేపరమిల్లుకి సరుకులు చేరవేసే కొన్ని లారీలు చాలా వేగంగా పోతుండడంవల్ల వేగాన్ని తగ్గించే చర్యలు పోలీసు అధికారులు వెంటనే తీసుకుని ప్రజలను ప్రమాదాల నుండి తప్పించాలని కోరుతున్నారు.

# "స్వాతంత్ర్య పరిరక్షణ కృషిలో ఎట్టి త్యాగాలకైనా వెనుదీయం"

## భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవ ఢిల్లీసభలో శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 28

భారతదేశ స్వాతంత్ర్యాన్ని, ఐక్యతను పరిరక్షించి, దేశాన్ని యింకా ముందుకు కొనిపోవడానికై జరిపే పోరాటంలో భారత కమ్యూనిస్టుపార్టీ ఎన్ని త్యాగాలు చెయ్యవలసి వచ్చినా వెనుకాడదని యీ నెల 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవ సభలో ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు ఉద్ఘాటించారు.

ప్యారేలాల్ భవనంలో జరిగిన మహాసభకు అధిక సంఖ్యలో హాజరైన అతిథులతో సభాభవనం కిటకిటలాడిపోయింది.

మహాసభకు అనేకమంది పార్టీ సభ్యులు నాయకులు, అనేకమంది ప్రముఖ కాంగ్రెసు నాయకులు యితర ప్రముఖులు హాజరయ్యారు. ఢిల్లీలోని సోషలిస్టుదేశాల, ఇతర దేశాల రాయబార కార్యాలయాల అధికారులు, దౌత్యవేత్తలుకూడా హాజరయ్యారు.

శ్రీ రాజేశ్వరరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు పాల్గొనలేదని విమర్శించే వారి వాదనలను సోదాహరణంగా ఖండించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ విప్లవకారుల పార్టీ అని దేశ స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టుపార్టీ ఎల్లప్పుడూ పోరాడుతూనే వుందనీ చెప్పారు.

అంతేకాదు భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే నినాదాన్ని కమ్యూనిస్టుపార్టీయే యిచ్చిందనికూడా ఆయన యీ సందర్భంగా గుర్తుచేశారు.

భారత కమ్యూనిస్టుపార్టీ దేశభక్తియుతమయిన అన్ని పోరాటాల్లోను, ఉద్యమాల్లోను పాల్గొంటూ, ప్రజాతంత్ర, దేశభక్తియుత విస్తృతసంఘటన నిర్మాణానికి కృషిచేస్తూ వచ్చింది అని తెలిపారు.

పార్టీ నిర్వహించిన బ్రహ్మాండమయిన పోరాట చరిత్రను వివరిస్తూ, తెలంగాణా సాయుధ పోరాటం కేరళలో జరిగిన పున్నప్రా - వాయలార్ పోరాట గాథలను వివరించారు పశ్చిమబెంగాల్ తెభాగా కిసాన్ పోరాటం, జాతీయ స్వాతంత్ర్యోద్యమం కాలంలో సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఏవిధంగా వీరోచితంగా పోరాటం కొనసాగిస్తూ వచ్చిందీ శ్రీ రాజేశ్వరరావు వివరించారు.

జె పి. నాయకత్వాన నిర్వహించబడిన అభివృద్ధినిరోధక వ్యూహానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టుపార్టీ ఏవిధంగా పోరాడిందీ వివరించి, ఆపోరాటంఫలితంగానే కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీ తదితర ప్రజాతంత్రశక్తులు కలవడానికి అవకాశం లభించిందనీ, తద్వారా జె పి వ్యూహాన్ని ఓడించామని తెలియజేశారు.

కాంగ్రెసు, తదితర అభ్యుదయ శక్తులతో కలిసి, కమ్యూనిస్టుపార్టీ భారతదేశాన్ని ముందుకు గొనిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని 20 అంశాల కార్యక్రమాన్ని పూర్తిగా అమలుజరపవలసిన అవశ్యకత కలదని, ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికి పూనుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఇటీవల మార్క్సిస్టుపార్టీ సభ్యులు అనేక సంఖ్యాకులు కమ్యూనిస్టుపార్టీలో చేరుతున్న అంశాన్ని ప్రస్తావించి, మన దేశంలో తిరిగి కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత సాధనకు ఒక విధంగా అది సూచనగా వుందని రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

పార్టీ నిధి వసూలుకు తీసుకున్న కోటా రు 50 లక్షలు పూర్తయిపోయిందనీ, అంతేకాక, పార్టీ పత్రికల సర్క్యులేషన్ కూడా గణనీయంగా పెరిగిందనీ ఆయన ప్రకటించారు.

పార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా చేర్పించవలసిన పార్టీ సభ్యత్వం లక్ష్యందాటి పోయిందని తెలిపారు.

స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్ వద్ద, ప్యారేలాల్ భవనంలోను స్వాగతద్వారాలు, రంగులైటింగ్ ఏర్పాటుచేశారు. పెద్ద పెద్ద ప్యానెల్సు కటౌట్లు ఏర్పాటుచేశారు. కేంద్ర పార్టీ పత్రిక న్యూఏజ్, హిందీ దిన పత్రిక హిందీ వారపత్రిక ఉర్దూవారపత్రిక ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. భారత కమ్యూనిస్టుపార్టీ గత ఏభై సంవత్సరాలలో నిర్వహించిన పోరాటాలను వివరించే ఆల్బం కూడా ప్రచురించబడింది.

(28 వ తేదీ విశాలాంధ్రలో భారత కమ్యూనిస్టుపార్టీ చైర్మన్ శ్రీ ఎస్ ఎ డాంగే ప్రసంగం పాఠాన్ని ఇచ్చాం )

# కడప విద్యార్థి కార్యకర్తల సమావేశం

కడప డిసెంబరు 26

కడప టౌన్ విద్యార్థి సమాఖ్య కార్యకర్తల సమావేశం డిసెంబరు 17 వ తేదీన కడపజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ విద్యార్థిసమాఖ్య అధ్యక్షులు శ్రీ పి శ్రీనివాసులునాయుడు హాజరయ్యారు. సమావేశానికి శ్రీ దివాకర రెడ్డి అధ్యక్షత వహించారు.

శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో విద్యార్థుల కర్తవ్యాన్ని వివరించి, ఫాసిస్టు శక్తులు దేశంలో కొనసాగించే అభివృద్ధి నిరోధక కుట్రలను భగ్నం చేసేందుకు కలిసికట్టుగా పని చేయాలని పిలుపిచ్చారు.

తరువాత కడపజిల్లా విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు శ్రీ జె శివాజీ మాట్లాడారు.

తరువాత డిసంబరు 6 వ తేదీన జరిగిన సమావేశం నిర్ణయాలమేరకు సభ్యత్వం చేర్పిస్తున్నామని చెప్పారు.

తరువాత పార్టీ 50 వ వార్షికోత్సవం సందర్భంగా కడప జిల్లాలో విద్యార్థి సమాఖ్య కార్యకర్తలను 75 మందిని పార్టీ సభ్యులుగా చేర్పించాలని తీర్మానించారు.

డిసెంబరు 26 నాటికి కడప పట్టణంలో యువజన సమాఖ్య సభ్యత్వాన్ని 20 నుంచి 50 కి పెంచాలని, ఆ మేరకు కార్యకర్తలు కృషిచేయాలని తీర్మానించారు.

కడపలో పోస్టుగ్రాడ్యుయేటు సెంటర్" స్థాపనకు కడపజిల్లాలో ఎంతకాల ఉద్యమం నిర్వహించాలని తీర్మానించారు.

కడప పట్టణంలో త్వరలో స్పోర్ట్సుక్లబ్ విద్యార్థి, యువజన సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెల్పారు.

17 వ తేదీ రాత్రి శ్రీనివాసులు నాయుడు కాలేజి సోషల్ వెల్‌ఫేర్ హాస్టలుకు శివాజీ, దివాకర్లతో వెళ్ళి విద్యార్థులను పరామర్శించి వచ్చారు.

# ఖమ్మం జిల్లాలో స్వర్ణోత్సవ వేడుక

(1వ పేజీ తరువాయి)

ఇప్పటికీ యింకా కొన్ని ప్రాంతాలనుంచి మిగిలినవారు మేళతాళాలతో ఊరేగింపులుగా, డప్పుల వాయిద్యాలతో వస్తూనే వున్నారు.

వారంరోజులుగా జరుగుతున్న యీ స్వర్ణోత్సవాలకి ముందుగా కమ్యూనిస్టు కార్యకర్తలు, యువజనసంఘ కార్యకర్తలు గనికార్మికులు, పట్టణం యావత్తు ఎర్ర జెండాలతోనూ, తోరణాలతోనూ శోభాయమానంగా అలంకరించారు.

## 5 వేల మందితో బహిరంగ సభ

తరువాత తాలూకా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ వి రమేష్‌బాబు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. సభలో 5 వేలకు పైగా ప్రజలు పాల్గొన్నారు.

తొలుత జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ టి వి చౌదరి సభకు అతిథులైన నాయకులను ఆహ్వానించారు రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాదరావు జిల్లాపార్టీకార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావు సహాయకార్యదర్శి దొండపాటి వెంకయ్య, శాసన సభ్యులు శ్రీ మహ్మద్ రజబ్‌ఆలి జిల్లా రైతుసంఘ అధ్యక్షుడు శ్రీ వాసిరెడ్డి వెంకటపతి, తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కె అచ్యుతన్, ఖమ్మం తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ పారుపల్లి పుల్లయ్య, బూర్గంపహాడ్ తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ యం. వెంకటేశ్వరరావు, ఖమ్మం పట్టణ పార్టీ కార్యదర్శి శ్రీ యం సంగయ్యలు వేదిక పైన ఆసీనులయ్యారు.

## ఎర్రజెండా అందజేత

పార్టీ స్వర్ణోత్సవాల సందర్భంలో తెలంగాణా సాయుధ పోరాటంలో గిరిజన ప్రజలకు నాయకత్వం వహించి, పోలీసు మిలటరీ తూటాకు గురై బలైన అమరవీరుడు కామ్రేడ్ సోయం గంగులు పేరుతో బూర్గంపహాడ్ తాలూకా బండారుగూడెం నుంచి యువ కమ్యూనిస్టు కార్యకర్త దాట్ల చిరంజీవి బాబు నాయకత్వాన అరుణపతాకాన్ని తీసుక వచ్చారు. వారు 20వ తేదీనాడు బయలుదేరి 23 వ తేదీనాడు బూర్గంపహాడ్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొని, 24వ తేదీనాడు భద్రాచలం, 25వ తేదీనాడు పాల్వంచలో జరిగిన ప్రదర్శనలో పాల్గొని, 26వ తేదీ నాటికి ఆ జండాను ఇల్లెందు తీసుకొని వచ్చారు. వారిని బూర్గంపహాడ్ తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం వెంకటేశ్వరరావు యీ బహిరంగసభలో రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్‌కు గౌరవ చిహ్నంగా అప్పగించారు.

ఆనాటి తెలంగాణా పోరాటంలో తన సహచరుడిగా వుండి అనేక పోరాటాలలో పాల్గొని తుపాకీ గుండ్లకు బలైపోయిన అమరవీరుని పేరుతో ఎంతో దూరం జైత్రయాత్ర జరిపి తెచ్చిన ఎర్రజెండాను తనకు అందించినందుకు ఆయన కార్యకర్తలకు కృతజ్ఞతలను తెలిపారు.

## సంపూర్ణ స్వాతంత్ర్య నినాద ప్రదాత కమ్యూనిస్టుపార్టీ

భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదట నినాదం యిచ్చింది కమ్యూనిస్టుపార్టీ మాత్రమేనని, భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడిన 43 సంవత్సరాలకు అది ఇలాంటి తీర్మానాన్ని లాహోర్ మహాసభలో మాత్రమే ఆమోదించగలిగిందని భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఇల్లెందులో జరిగిన గొప్ప బహిరంగసభలో ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ వెల్లడించారు.

గత 50 సంవత్సరాలుగా మనదేశంలో కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను గురించి శ్రీ గిరిప్రసాద్ వివరించారు.

కమ్యూనిస్టుపార్టీ ఏర్పడుటకు40 సంవత్సరాలకు పూర్వమే మన దేశంలో ఏర్పడిన జాతీయ కాంగ్రెస్ మనదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం చేయలేకపోయింది ఆనాడు కాంగ్రెసులోవున్న మితవాదులు బ్రిటిష్‌వారికి కోపం వస్తుందనే భయంతో "బాధ్యతాయుత ప్రభుత్వమని" మాత్రమే చెపుతూ వచ్చారు.

కాంగ్రెసుకు యిలాంటి తీర్మానంచేసేందుకు 43 సంవత్సరాలు పట్టింది. ఈ తీర్మానం చేయడంలో కూడా ఆనాడు కాంగ్రెసులో అతివాద భావాలు కలవారు, కమ్యూనిస్టులు వున్నందునే సాధ్యపడింది అని శ్రీ గిరిప్రసాద్ స్పష్టీకరించారు.

ఆనాడు కాంగ్రెసు దేశంలో 10 ఏండ్లకొక పోరాటం నడుపుతూవచ్చింది ఇలాంటి పోరాటాలలో లాభంలేదని కమ్యూనిస్టుపార్టీ స్వతంత్రంగా దేశంలో కార్మిక కర్షక విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను స్థాపించింది.

దానితరువాతనే బొంబాయిలో జరిగిన నౌకాదళ తిరుగుబాటు సమ్మెను పార్టీ బలపర్చింది ఇలాంటి అనేక మహోజ్వల పోరాటాలు నడిపి, దేశ స్వాతంత్ర్య పరిరక్షణకు కమ్యూనిస్టుపార్టీ పడిన అనేక పాట్లను వివరించారు.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కమ్యూనిస్టుపార్టీ ప్రతిపక్షంలో వుండి అనేక పోరాటాలు నడిపింది విజయాలు సాధించింది నైజాం నవాబును గద్దె దించేందుకు అనేక పోరాటాలను నడిపాం. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ భూ సంస్కరణలు మొదలైన వాటిని సాధించుకున్నాం ఇంకా ఎన్నో సాధించవల్సివుంది మన దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యంతో పాటుగా సోషలిజాన్ని సాధించేందుకుగాను అభ్యుదయభావాలు కలిగిన వారంతా కమ్యూనిస్టు [illegible] చేయవలసి వుందని శ్రీ గిరిప్రసాదరావు తన సుదీర్ఘ ప్రసంగాన్ని హర్షధ్వానాలమధ్య ముగించారు.

## పి. నాగేశ్వరరావు

తరువాత జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావు ప్రసంగిస్తూ యీ దేశంలో మితవాద, మతవాద శక్తులను నిర్మూలించేందుకు కమ్యూనిస్టుపార్టీ దేశవ్యాపితంగా జరిపిన సాహసోపేతమైన పోరాటాన్ని వివరిస్తూ, యీ పోరాటంలో అభివృద్ధి భావాలు కలిగిన కాంగ్రెస్‌వారు అనేక మంది కలిసి వచ్చారనీ ఈ ఐక్యతను ఇంకా ముందుకు తీసుకపోవాలన్నారు.

## లెనిన్ చిత్రం బహూకరణ

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లాలో ప్రజా సమీకరణ, అలంకరణ, ప్రచారం విషయంలో అగ్రగామిగా పనిచేసిన కమిటీలకు బహుమతులు పంచేందుకు జిల్లా కమ్యూనిస్టు సమితి నిర్ణయించిన మేరకు, జిల్లాలో వెనుకబడిన అడవి ప్రాంతమైన బూర్గంపహాడ్ తాలూకాలో ప్రజా సమీకరణ, అలంకరణ జరిపినవారికి ప్రథమ బహుమతిగా తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ ఎం వెంకటేశ్వరరావుకు లెనిన్ చిత్రాన్ని రాష్ట్రసమితి సహాయకార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాదరావు బహుకరించారు.

ద్వితీయ బహుమతి ఇల్లెందు తాలూకాకు తృతీయ బహుమతి భద్రాచలం డివిజన్ సమితికి లభించాయి.

## బహుమతుల ప్రదానం

వారం రోజులపాటు నిర్వహించిన జిల్లా యువజనోత్సవాలలో గెలుపొందిన విజేతలకు శాసన సభ్యులు శ్రీ మహమ్మద్ రజబ్ ఆలీ బహుమతులు పంచారు.

జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ టి. వి చౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

ఆహ్వాన సంఘం తరపున శ్రీ వి [illegible], యీ కార్యక్రమాలను జయప్రదంగా కొనసాగించేందుకు తోడ్పడిన వారందరికీ ధన్యవాదాలు అర్పించారు.

ఈ సందర్భంలో యివ్వబడిన బహుమతులు మొత్తం 1100 వందల రూపాయలు పెట్టి ఖరీదుచేసి సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ ఇల్లెందు బ్రాంచివారు యువజనోత్సవాలకు యిచ్చారు.

తరువాత ప్రజా నాట్యమండలి వారి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## బూర్గంపహాడ్ తాలూకాలో అపూర్వప్రజా సంరంభం

ఖమ్మం జిల్లాలోని అడవి ప్రాంతమయిన వెనుకబడిన గిరిజనప్రాంతమయిన బూర్గంపహాడ్ తాలూకాలో భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలను జయప్రదంగా జరుపుకొని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది.

చరిత్రలో ఏనాడూ ఎరుగని విధంగా బూర్గంపహాడ్ పట్టణాన్ని అరుణ పతాకాలతో అలంకరించి అరుణమయం చేశారు.

పార్టీ బ్యానర్లతోను పతాకాలతోను శోభాయమానంగా అలంకరించారు.

గత సంవత్సరంనుండే యీ తాలూకా కేంద్రంలో కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పడి పనిచేస్తున్నప్పటికీ అచటున్న పేద ప్రజలు యువకులు పార్టీ వైపు ఆకర్షింపబడి స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంలో 23 వ తేదీ నాడు ఇచ్చట పార్టీ తరపున ప్రదర్శన, బహిరంగ సభను తాలూకాపార్టీ ఏర్పాటు చేసింది.

ఈ పట్టణానికి 40 మైళ్ళదూరంలో వున్న ఏడేరు కొండాయగూడెం మణుగూరు, గోపాలపురం నెల్లిపాక, [illegible] అశ్వాపురం మొదలుకొని బూర్గంపహాడ్ వరకువున్న రోడ్డు పక్కల అడవుల్లోవున్న 40 గ్రామాలనుంచి ప్రజలు ఒక రోజు ముందుగానే బయలుదేరి చల్దిమూటలు కట్టుకొని, చంటిపిల్లలను చంకనిడుకొని వందలాది గిరిజన, హరిజన స్త్రీలు చలిని కూడ లెక్కచేయకుండా కాలినడకన చేరుకొని ప్రదర్శనలో పాల్గొన్నారు.

రోడ్డు పొడవునావున్న గ్రామాలన్నీ అరుణ పతాకాలతో అలంకరించారు.

## అరుణ కాంతులతో 80 ప్రభలు

చుట్టుపక్కల వున్న 30 40 గ్రామాలనుంచి అరుణపతాకాలతో అలంకరించిన 80 ప్రభలు 23 తేదీ నాటికి బూర్గంపహాడ్ చేరుకొని చరిత్రను సృష్టించాయి. వీటిపైన కోయ ప్రజలు తమ సాంప్రదాయ పాటలతోనూ, పార్టీ పాటలతోనూ 'కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" "ఎర్రజెండ వర్ధిల్లాలి" అనే నినాదాలతో వచ్చి బూర్గంపహాడ్ పురవీధులలో ఊరేగింపు జరుపుతుండగా ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలతో తిలకించారు. అగ్రభాగాన తాలూకాపార్టీ కార్యదర్శి శ్రీ ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి వెంకటపతి నడువగా వారివెనుక జనసేవాదళ్ సభ్యులు, గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన వేలాది ప్రజలు పాల్గొన్నారు.

## 5 వేలమందితో సభ

ఆ సాయంత్రం తాలూకాపార్టీ కార్యదర్శి యం వెంకటేశ్వరరావు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. 5 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. సభలో కమ్యూనిస్టు పార్టీ చరిత్రను గురించి జిల్లాపార్టీ కార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావు శాసనసభ్యులు శ్రీ మహ్మద్ రజబ్‌అలి శ్రీ వాసిరెడ్డి వెంకటపతి, శ్రీ అక్కిరాజు గురుప్రసాదరావు, శ్రీ పారుపల్లి పుల్లయ్య ప్రసంగించారు జిల్లాపార్టీ సహాయకార్యదర్శి శ్రీ దొండపాటి వెంకయ్య, శ్రీ వావ వెంకటేశ్వరరావులు కూడా ఈ సభలో పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో

ఖమ్మం జిల్లా, సత్తుపల్లి తాలూకా కేంద్రంలో కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలు అట్టహాసంగా జరిగాయి గ్రామాన్ని అరుణపతాకాల తోరణాలతో అలంకరించారు స్మృతివీధుల గేటు నిర్మించారు 22 వ తేదీ నాడు 500 మందితో ప్రదర్శన, [illegible] సెంటర్లో బహిరంగసభ జరిగింది సభకు శ్రీ యం. డి కరీం అధ్యక్షత వహించారు తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ రేళ్ళ చెన్నారెడ్డి సభను ప్రారంభించారు

జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావు రైతు సంఘ అధ్యక్షుడు శ్రీ వాసిరెడ్డి వెంకటపతి శ్రీ పారుపల్లి పుల్లయ్య ప్రసంగించారు యీ సందర్భంలో 25 గ్రామాల్లో ప్రచారం గావించి కమ్యూనిస్టుపార్టీ చరిత్రను వివరించారు అనేక గ్రామాలను అరుణ పతాకాలతో అలంకరించారు

పార్టీ చీలిన తర్వాత నిస్తేజంలో వున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు అనేక మంది యీ ఉత్సవాలలో కలిసి వచ్చారు 12 సంవత్సరాల కాలంలో కమ్యూనిస్టుపార్టీ తరఫున యీ సెంటర్లో అడుగుపెట్టలేని ఇది పరిస్థితిలో ఇంత పెద్ద ప్రదర్శన బహిరంగసభను చూసి అనేకమంది పేద ప్రజలు ఉత్సాహం చెందారు. ఇప్పటికి 40 50 మైళ్ళ దూరంలో వున్న గుమ్మడివల్లి [illegible] అశ్వారావుపేట వొట్టువారిగూడెం, దమ్మపేట ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు ప్రచారం చేస్తూ వచ్చి పాల్గొన్నారు.

సభలో వనం కిష్టాపురం [illegible] కృతజ్ఞత చెప్పారు

## ఖమ్మంలో జనరల్ బాడీ

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంలో ఖమ్మం తాలూకా, పట్టణ కమ్యూనిస్టు పార్టీ సభ్యుల అభిమానుల జనరల్‌బాడీ సమావేశం యీనెల 21 వ తేదీ నాడు మార్క్సుభవన్‌లో జరిగింది. సమావేశానికి శాసనసభ్యులు శ్రీ మహమ్మద్ రజబ్ అలీ అధ్యక్షత వహించారు తాలూకాలోని 40 గ్రామాల నుంచి పట్టణంలోని వివిధ వార్డులనుంచి పార్టీ సభ్యులు, అభిమానులు 8 వందలమంది పాల్గొన్నారు

భారత కమ్యూనిస్టుపార్టీ గత 50 సంవత్సరాలలో నిర్వహించిన పాత్ర, సాధించిన విజయాలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, తెలంగాణా పోరాటం గురించిన సుదీర్ఘమైన నివేదికను రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ యిచ్చారు. జిల్లాలో పార్టీ నిర్వహించిన కార్యకలాపాలను గురించి రాష్ట్ర పార్టీ నిర్ణయాలనుగురించి జిల్లాపార్టీ కార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావు వివరించారు.

## కొత్తగూడెంలో పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన

ఖమ్మం తాలూకా, కొత్తగూడెం గ్రామంలో భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంలో గ్రామప్రజలు నూతనంగా నిర్మాణంగావించ తలపెట్టిన గ్రామపార్టీ కార్యాలయ భవనానికి ఈనెల 19 వ తేదీన జిల్లాపార్టీ కార్యదర్శి శ్రీ పి. నాగేశ్వరరావు శంకుస్థాపన గావించారు గ్రామపార్టీశాఖ కార్యదర్శి శ్రీ చింతకాయల వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు

ఆ రాత్రి యువజన సమాఖ్య తరపున సభ జరిగింది అనంతరం ప్రజా నాట్య మండలివారిచే వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి

## మంగలగూడెంలో

ఖమ్మం తాలూకా మంగలగూడెంలో పార్టీ స్వర్ణోత్సవ సభ జరిగింది. శాసన సభ్యులు శ్రీ మహమ్మద్ రజబ్ అలీ, ఖమ్మం పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యం సంగయ్య ప్రసంగించారు.

ఇదే సందర్భంలో గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలు అమరజీవి కామ్రేడ్ బొజెడ్ల రంగమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త బొజెడ్ల వీరయ్య కమ్యూనిస్టు పార్టీకి యిచ్చిన స్థలంలో ఆగ్రామంలో పెద్ద రైతు శ్రీ. కే. యండపల్లి వెంకయ్య వారి సతీమణి వీరమ్మ గారల పేరుతో వారి కుమారులు నిర్మాణం గావించే స్మారక భవనానికి శ్రీ రజబ్ అలీ శంకుస్థాపన గావించారు.

ఈ గ్రామంలో వారిపేర ఒక స్మారక భవనం నిర్మాణం గావించడం సంతోషించదగిన విషయమని ఆ గ్రామ నివాసి అయిన శ్రీ కత్తుల శాంతయ్య యం. యల్ ఏ. (కాంగ్రెస్) వారి కుమారులను అభినందించారు

## రఘునాథపాలెం

ఖమ్మం తాలూకా రఘునాథపాలెంలో గ్రామమంతా అరుణపతాకాల తోరణాలతో అలంకరించారు ఈనెల 26 వ తేదీనాడు గ్రామంలో వున్న రైతు, కూలి ప్రజలు స్త్రీ, పురుషులు 5 వందల మందితో ఊరేగింపు జరిగింది

తరువాత శ్రీ శేఖు సాగండు అధ్యక్షతన జరిగిన సభలో శాసనసభ్యులు శ్రీ మహ్మద్ రజబ్ అలీ, తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పారుపల్లి పుల్లయ్య, శ్రీమద్దినేని కోటయ్య మాట్లాడారు.

## బయ్యరపునిపల్లె

ఖమ్మం తాలూకా బయ్యరపునిపల్లె గ్రామములో యీనెల 20 తేదీనాడు ఊరేగింపు జరిగింది, గ్రామపార్టీశాఖ కార్యదర్శి శ్రీ కసాదు నారయ్య జండా నెగురవేశారు. జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ కర్నాటి కృష్ణయ్య తాలూకా పార్టీ నాయకులు శ్రీ గుండపనేని వెంకటాద్రి మాట్లాడారు.

## రామకృష్ణాపురం

రామకృష్ణాపురం గ్రామంలో అరుణ పతాకాలతోనూ, బ్యాండుమేళాలతో గొప్ప ఊరేగింపు జరిగింది. గ్రామపార్టీశాఖ కార్యదర్శి శ్రీ కాకుమాను గోవిందరెడ్డి, వ్యవసాయకార్మికుల సంఘం తరపున శ్రీ ముక్తవరపు శిఖామణి, రైతుసంఘం తరపున శ్రీ రంద్యాల గోవిందరెడ్డి, యింకా యువజన సంఘం తరపున కిలారు లక్ష్మయ్య ప్రదర్శనకు నాయకత్వం వహించారు.

## ఖమ్మంలో సైకిళ్ళ ప్రదర్శన

ఖమ్మంపట్టణ యువజనసంఘం తరపున 60మంది యువకులు ఈనెల 21 తేదీన సైకిళ్ల పైన ఎర్రజెండాలు ధరించి పట్టణంలోని ముఖ్యమైన వీధులలో, సందుల్లో ప్రదర్శన జరిపి కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని కరపత్రాల ద్వారా అందించారు. ప్రదర్శనకు పట్టణ యువజనసంఘ అధ్యక్షులు శ్రీ నజీముద్దీన్ కార్యదర్శి శ్రీ యం. చలపయ్యలు నాయకత్వం వహించారు

# 11 వ ఆంధ్రప్రదేశ్ ప్రకృతి మహాసభలు

## వరంగల్‌లో

వరంగల్, డిసెంబరు 27

ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వైద్య పరిషత్ 11 వ మహాసభలు వరంగల్‌లో 1976 జనవరి 17 నుండి 19 వరకు కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో జరుగుతాయి.

ఈ మహాసభ సందర్భంగానే కాకతీయ ప్రకృతి చికిత్సాలయ దశమ వార్షికోత్సవ సభలు జరుగుతాయని ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ చిలువేరు కృష్ణమూర్తి ప్రకటించారు.

ఈ మహాసభను రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ రాజమల్లు ప్రారంభిస్తారు.

# పాలకత్తి నేరానికి శిక్షలు

నెల్లూరు, డిసెంబరు 26

గుండ్లపాలెం వాస్తవ్యుడు శ్రీ పొంగూరు లక్ష్మయ్యకు పాలకత్తి నేరానికిగాను 2 సంవత్సరాల జైలుశిక్ష రూ 1000 జరిమానాను కాకుపల్లె గ్రామస్థుడు శ్రీ రామిరెడ్డి సుబ్బరామిరెడ్డికి 1 సంవత్సరం జైలుశిక్ష రూ 1000 లు జరిమానాను నెల్లూరు సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విధించారు

# సవరణ

ఈ నెల 26 వ తేది ప్రత్యేక సంచికలో ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ రాసిన వ్యాసంలోని "సోషలిజం భావాల వ్యాప్తి" అనే ఉప శీర్షిక క్రింద "ఈ మూడు ప్రాంతాలనుంచి" అన్న మాటలకుబదులుగా ఈ మూడు ప్రవాహాలనుంచి అని చదువుకోవాలి.

అలాగే సాయుధ గెరిల్లా దళాలనిర్మాణం అనే ఉపశీర్షిక క్రింద ఖమ్మంజిల్లా మాగా గ్రామం అనడానికి బదులుగా ఖమ్మంజిల్లా ముసపోలు గ్రామం అని వుండాలి

అలాగే గ్రామరాజ్యాల స్థాపన అన్న ఉపశీర్షిక కింద అయిదు లక్షల ఎకరాల భూమి పంచడం జరిగింది అన్న దానికి బదులుగా 10 లక్షల ఎకరాలభూమి పంచడం జరిగింది అని చదువుకోవాలి. పొరపాట్లు దొర్లినందుకు విచారిస్తున్నాం —సం.

# రాష్ట్రవ్యాపితంగా స్వర్ణోత్సవ ప్రదర్శనలు, సభలు

విజయవాడ, డిసెంబరు 28

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాపితంగా ఎర్రజెండా ప్రతిష్ఠాపనలు, ప్రదర్శనలు, సభలు, ప్రచార కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించబడ్డాయి.

నెల్లూరు జిల్లా కోవూరు టౌన్‌లో ఈ నెల 24 వ తేదీన సాయంత్రం బహిరంగసభ జరిగింది

ముందుగా జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ పి. రామకోటయ్య అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి శ్రీ జి కృష్ణ ఎర్రజెండా పాటను పాడారు.

సభకు టౌన్ పార్టీ కార్యదర్శి శ్రీ ఎస్. ప్రసాద అధ్యక్షత వహించారు. శ్రీ పి. రామకోటయ్య పార్టీ చరిత్రను, సాధించిన పోరాటాలను, వాటినుండి పొందిన అనుభవాలను వివరించారు.

జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ గునుపాటి రామచంద్రయ్య పార్టీ పుటిన తర్వాత యీ యాభయ్యేళ్ళ కాలంలోవచ్చిన మార్పులను పార్టీ పాత్రను వివరించారు

తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ కె చంద్ర మోహన్ ముందుగా సభా ప్రాముఖ్యతను వివరించారు.

### మద్దిపాడులో విశాలాంధ్ర కొత్త ఏజెన్సీ

పార్టీ స్వర్ణోత్సవాల కానుకగా ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా మద్దిపాడు గ్రామంలో కార్యకర్తలు విశాలాంధ్ర పత్రికకు 15 కాపీలకు కొత్త ఏజెన్సీ ప్రారంభించారు. శ్రీ ఎదు సుబ్బారావు కృషి వల్ల ఈ ఏజెన్సీ ఏర్పడింది

### మార్కాపురంలో స్వర్ణోత్సవ సభ

మార్కాపురంలో ఈనెల 24 న పార్టీ స్వర్ణోత్సవం జరిగింది.

సభకు రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి శ్రీ పూల సుబ్బయ్య అధ్యక్షత వహిస్తూ భారతదేశంలో కమ్యూనిస్టుఉద్యమ పురోగం, సాగించిన అనేక పోరాటాలను వివరించారు.

రాష్ట్ర కమ్యూనిస్టుసమితి కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ గజ్జల యల్లమందారెడ్డి మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలపై నిర్మాణమైన కమ్యూనిస్టుపార్టీని విచ్ఛిన్నంచేసిన వారిలో ఎన్నో, తీవ్రమైన సిద్ధాంతాలను అవలంబించినవారెందరో కాలగర్భంలో కలిసిపోయారని కానీ-పార్టీ మాత్రం అప్రతిహతంగా పురోగమిస్తున్నదని అన్నారు పోరాటాల లోంచిపుటినయీపార్టీ ఎన్నో మహోద్యమాల నడిపించిందని వర్ధిల్లుతుందని, సోషలిస్టు సమాజాన్ని నిర్మించి తీరుతుందని అన్నారు.

మార్కాపురం తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ ఆర్ చెంచయ్య మృతవీరుల కుటుంబ సభ్యులను వేదికపైకి ఆహ్వానించి నూతన వస్త్రాలతో సన్మానించారు.

సభానంతరం బుర్రకథ చెప్పబడింది.

### సైకిల్ ర్యాలీ

ఈ సందర్భంగా యువజన నాయకులు శ్రీ నారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరుల నాయకత్వాన 70 కిలోమీటర్ల ప్రాంతం స్వర్ణోత్సవాల ప్రాధాన్యత వివరిస్తూ సైకిల్ ర్యాలీ జరిగింది

### పొదిలి తాలూకాలో

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రకాశంజిల్లా పొదిలి తాలూకా కోణజనమిట్ల, నాగరుకుంట, మునగపాడు, పొల్లాట్ల, మర్రిపూడి, ఓనారిగల్లు, పెదారిగట్ల కేంద్రాలలో జెండా ప్రతిష్ఠాపనలు చేసి బహిరంగసభలు పెట్టి వేలమందికి పార్టీ సందేశాన్ని అందివ్వటం జరిగింది.

ఓనారిగల్లులో శ్రీ బడుగుల వెంకటరెడ్డి నాయకత్వాన 500 మందితో ఊరేగింపు బహిరంగసభ జరిగింది, తప్పెట్లు, బాణాలు మేళాంతో ఎంతో ఉత్సాహంగా ఈ ప్రదర్శన జరిగింది.

సభలో శ్రీ యల్లమందారెడ్డి, శ్రీ కాశిరెడ్డి, శ్రీ వీరాస్వామి, శ్రీ పుల్లయ్యలు ప్రసంగించారు.

కోణజనమిట్ల ప్రదర్శనలో పిల్లల కోలాటం ఒక ప్రత్యేక ఆకర్షణ. అనంతరం బహిరంగసభ జరిగింది

పెదారిగట్లలో తప్పెట్లు బ్యాండు మేళాలతో ఎర్రజెండా ఊరేగింపు జరిగింది అనంతరం బహిరంగసభ జరిగింది.

స్వర్ణోత్సవాల సందర్భంగా పెదారిగట్లలో జరిగిన బహిరంగసభలో శ్రీ యల్లమందారెడ్డి, శ్రీ వీరాస్వామి, శ్రీ కాశిరెడ్డి ప్రసంగించారు.

ఈ తాలూకాలో వెంకటగిరి జమీందారీ వ్యతిరేక పోరాటం, నాగార్జునసాగర్ కొరకు, భూ ఆక్రమణ పోరాటం సందర్భంగా వీరత్వం పొందిన పాత్రను గురించి వివరించారు. జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై వివరించారు.

## బందరు, తిరువూరు, నందిగామ తాలూకాల యువజనోత్సవాలు

బందరు, డిసెంబరు 26

కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని బందరు తాలూకా యువజన సమాఖ్య ఆధ్వర్యాన ఈ నెల 24 న బహిరంగసభ జరిగింది

ఎర్రతోరణాలు, పతాకాలతో అలంకరించబడిన పురమందిరంలో జరిగిన సభకు జిల్లా కమ్యూనిస్టుసమితి సహాయ కార్యదర్శి శ్రీ మోదుమూడి శ్రీహరిరావు అధ్యక్షత వహిస్తూ, పార్టీ స్వర్ణోత్సవాల ప్రాముఖ్యతను వివరించి తాలూకా పార్టీ నిర్మాతలను, మృతవీరుల కుటుంబ సభ్యులను పరిచయం చేశారు

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ సభను ప్రారంభిస్తూ భారత కమ్యూనిస్టుపార్టీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగమేనని, భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు, అనంతరం జమీందారీ విధానం రద్దుకొరకు భాషా రాష్ట్రాల నిర్మాణము కొరకు ముందుండి పోరాడిన ఘనత కమ్యూనిస్టుపార్టీదే నన్నారు

పార్టీ సాగించిన పోరాటాలను, దేశ ఐక్యతా రక్షణకు చేసిన కృషిని వివరించి, గ్రామీణ ప్రాంతాలలో వర్గ పోరాటానికి పదును పెట్టటానికి, 20 అంశాల కార్యక్రమం ఆధారంగా పార్టీని మరింత విస్తరింపచేసుకోవాలన్నారు

* * *

అనంతరం శ్రీ గిరిప్రసాద్ మృతవీరుల కుటుంబ సభ్యులను, తాలూకాలో పార్టీ నిర్మాతలను నూతన వస్త్రాలతో సన్మానించారు.

భోగదుల రామారావుగారి తల్లి, మాతంపాటి ధనలక్ష్మీరావుగారి కుమార్తె శ్రీమతి నిర్మలను, ఉండ్రు రామలింగయ్యగారి కుటుంబ సభ్యులను అలాగే పార్టీ నిర్మాణానికి పునాదులు వేసిన శ్రీయుతులు మోదుమూడి శ్రీహరిరావు, పిట్ట వీరయ్య, ఆకురాతి వెంకటరామశాస్త్రి, టి. ఎస్. దాసు, బొడ్డు సుబ్బయ్య, సుందటి సుబ్బారావు, కొడాలి ఆదినారాయణ, నాగిరెడ్డి పున్నయ్య, ఉన్నాలి సుబ్బకోటేశ్వరరావు, చాల్లా రామలింగం, పంచకర్ల సుబ్బారావు, పిల్లచి కోట సుబ్బారావు, జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ జి ఎస్ ఆర్. ఆంజనేయులు నూతన వస్త్రాలిచ్చి సన్మానించారు.

* * *

శ్రీ ఆంజనేయశాస్త్రి ప్రసంగిస్తూ సామ్రాజ్యవాద ఫాసిస్టువ్యతిరేకశక్తిగా మార్క్సిజం లెనినిజం సూత్రాల కనుగుణంగా సరైన పోరాట విధానాన్ని రూపొందించి ముందుకు సాగుతున్న శ్రామికప్రజల ఏకైక పార్టీగా కమ్యూనిస్టుపార్టీ మహత్తరమైన పాత్ర నిర్వహించిందని వివరించారు.

సన్మాన తరువాత డా॥ సుబ్బా వెంకటరామశాస్త్రి సమాధానమిచ్చారు. బందరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మెట్ల ఏసయ్య వందన సమర్పణ చేశారు

సభానంతరం బందరు ప్రజానాట్య మండలివారు శ్రీ కె వి. శ్రీరాములు కర్తృత్వంలో "మాలాంటిమీరు" నాటకాన్ని ప్రదర్శించారు

### తిరువూరు లో

పార్టీ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని వారం రోజులపాటు జరిగే తిరువూరు తాలూకా యువజనోత్సవాలు ఊటుకూరు గ్రామంలో ప్రారంభమయ్యాయి.

95 గ్రామాల నుండి వచ్చిన 25 కబాడీ టీములు, 26 బ్యాడ్మింటన్ టీములు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి.

10 నాటికలు వారం రోజులపాటు ప్రదర్శింపబడతాయి

ప్రారంభోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ పుల్లారెడ్డి యువజనోత్సవాలను ప్రారంభిస్తూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానే, సోషలిస్టు వ్యవస్థ నిర్మించటానికి, యువజనులు ప్రజాపోరాటాలలో ప్రధానపాత్ర నిర్వహించాలని, ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులుగా తయారు చేయాలని ఉద్బోధించారు.

సభకు అధ్యక్షత వహించిన తిరువూరు పట్టణ సమితి కార్యదర్శి శ్రీ బోధానం పార్టీ పోరాట చరిత్రతోపాటు, తన అనుభవాలను వివరించారు.

అనంతరం తిరువూరు తాలూకా యువజన నాయకులు శ్రీ పసుపులేటి వెంకయ్య యువజనోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు

ఊటుకూరు గ్రామమంతా యువజన సమాఖ్య నినాదాలతో, అరుణపతాకాలతో అలంకరించారు పార్టీ స్వర్ణోత్సవాల ప్రాముఖ్యతనువివరించే వ్యాసాలనేర్పాటుచేశారు.

అంతకు ముందురోజు జరిగిన బహిరంగ సభలో శ్రీయుతులు వేణుగోపాలరావు, కె. రాజేశ్వరరావు ఉపన్యసించారు.

ఫాసిస్టు వ్యతిరేక ఫొటో ప్రదర్శన ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తున్నది.

## జుజ్జూరులో పెద్ద ప్రజా ప్రదర్శన

కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని నందిగామ తాలూకా యువజన సమాఖ్య జుజ్జూరులో నిర్వహించిన తాలూకా యువజనోత్సవాల ముగింపు సందర్భంగా పెద్ద ప్రజా ప్రదర్శన జరిగింది.

తాలూకా కమ్యూనిస్టు సమితి, యువజన సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘ నాయకత్వాన జరిగిన యీ ఊరేగింపులో యువకులు పెద్ద సంఖ్యలో వివిధ కళారూపాలతో పాల్గొన్నారు. చెన్నారావుపాలెం నుండి ప్రజలు ప్రభ, బండ్లు కట్టుకొని వచ్చారు. జుజ్జూరు ప్రజానాట్యమండలి తప్పెట వాయిద్యాలతో యువకులు జానపదగేయాలతో చేసిన నృత్యాలను రోడ్డుకిరు పక్కలా వున్న జనసందోహం ఎంతో ఆసక్తిగా తిలకించారు.

ఈ ప్రజా ప్రదర్శనకు తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ జల్లి ఏళాలు, శ్రీ కుమ్మెపల్లి సూర్యం, తాలూకా యువజన సమాఖ్య నాయకులు శ్రీ నామినేని వీర్రాఘవం, శ్రీ షేక్ మౌలాలి, శ్రీ ఎల్లెల్లి కోటేశ్వరరావు, జుజ్జూరు గ్రామ ఉపసర్పంచ్ శ్రీ పవ్వా ఎద్మనాథం, జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ పి కిశోర్ నాయకత్వం వహించారు.

ప్రదర్శనానంతరం బహిరంగసభ జరిగింది. తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కటికొండ నాగేశ్వరరావు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. శ్రీ జల్లి ఏళాలు అధ్యక్షత వహించారు.

తాలూకా పార్టీకార్యదర్శి శ్రీ ఎస్. నాగేశ్వరరావు తాలూకాలో పార్టీ నిర్మాతలను, మృతవీరుల కుటుంబ సభ్యులను వేదికపైకి ఆహ్వానించారు.

ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు పార్టీ నిర్మాతలను, మృతవీరుల కుటుంబ సభ్యులను పూలమాలలు వేసి, లెనిన్ బ్యాడ్జీలు లెనిన్ బొమ్మలను, సన్మాన పత్రాలనొసంగి సన్మానించారు.

సన్మానింప బడినవారిలో సూర్యదేవర శివరామయ్య, వాశిరెడ్డి రామారావు వేమా అన్నమ్మ, మోదుగజగ్గయ్య, గుండెం నాగిరెడ్డి, గొంద్రి అప్పయ్య, మారా శివరామయ్య, అబ్దుల్ రహిమాన్, పొన్న బసవయ్య, సూర్యదేవర వెంకయ్య, కొపెల్లి వరదయ్య, దాదా లక్ష్మయ్య, దాదా కనకమ్మ, తోట రామస్వామి తోట సత్యనారాయణ, దాపుల వెంకట లక్ష్మమ్మ, వాసిరెడ్డి మల్లయ్య, మృతవీరుల కుటుంబాల నుంచి వాసిరెడ్డి భాస్కరరావు, ఏలూరు సత్యం వున్నారు.

అనంతరం శ్రీ దాసరి నాగభూషణరావు ప్రసంగిస్తూ సన్మానించబడుతున్నపార్టీ నిర్మాతలు, ప్రాణాలర్పించిన మృతవీరులు 50 ఏళ్ళ నాడు నాటినమొక్కే నాడో ఎవరూ ఎరికివేయలేనంతటి మహావృక్షంగా నేడు కమ్యూనిస్టుపార్టీ దేశ రాజకీయ గమనాన్నే నిర్దేశించగల స్థాయికి చేరిందన్నారు.

ప్రదేశ్ యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ పుల్లారెడ్డి. మృతవీరుల ఆశయాల ముందుకు తీసుకుపోయేందుకు యువజన సమాఖ్య మరింత దృఢదీక్షతో ముందుకు పోవడమే నేడు పార్టీ స్వర్ణోత్సవాల సందేశంగా భావించాలన్నారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎస్. నాగేశ్వరరావు, శ్రీ ఇమునింటి కోటేశ్వరరావుకూడా ప్రసంగించారు.

అనంతరం వారం రోజులుగా నిర్వహించబడిన క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ కొల్లి నాగేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు

అనిగండ్ల ప్రజానాట్యమండలి వారి "అందుకోండి-కొంచెం ఆలోచించండి", పెనుగంచిప్రోలు ప్రజానాట్యమండలి వారి "ఒక రూపాయి" ఉత్తమ ప్రదర్శనలుగా, జుజ్జూరు ప్రజానాట్యమండలి వారి "సీమ బాడు" ప్రత్యేక ప్రదర్శనగా, 'ఇదా నాదేశం', 'ఎం ఎల్. ఏ' ఉత్తమ ఏకపాత్రలుగా ఎన్నికై బహుమతులు అందుకున్నారు

ఆటల పోటీలలో కంచికచర్ల యువజన సమాఖ్య, నందిగామ ఆపిసియల్స్ క్లబ్ జోకర్ టీమ్ (నందిగామ) విన్నర్స్‌గా, రైజింగ్ స్టార్సు (జుజ్జూరు), ముచ్చింతాల యువజనసమాఖ్య, రాజటీమ్ (కంచికచర్ల) రన్నర్సుగా బహుమతులు పొందాయి.

### మృతవీరుల పేరిట ఎర్రజెండా యాత్రలు

ప్రదర్శనకు ముందుగా వీరులపాడు గ్రామంలోని మృతవీరుడు జావిరెడ్డి లావూరి రావు పేరుతో తాలూకా యువజన సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీ వి. వెంకటరెడ్డి నాయకత్వాన, చిర్రావూరిపాలెం నుండి మృతవీరులు రాయల చినకోటయ్య, ప్రత్తిపాటి సూర్యనారాయణ, మోదుమూడి పెదనర్సయ్య పేర్లతో శ్రీ షేక్ సైదులు, శ్రీ షేక్ సైదా నాయకత్వాన, కొంగాపురం నుండి మృతవీరులు శీలం కోటయ్య, ఎపూరి పెద వెంకటేశ్వరరావు పేరుతో శ్రీ వారుపల్లి నాగేశ్వరరావు, శ్రీ కె భాస్కరరావుల నాయకత్వాన 16 మైళ్ళు ఎర్రజెండా యాత్రలు జరిపి మృతవీరుల స్తూపం వద్దకు తెచ్చారు.

సభా ప్రారంభంలో అరుణ పతాకాలను ఉత్తేజకరమైన నినాదాల మధ్య తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ పట్టి కొండ నాగేశ్వరరావు, శ్రీ ఇనుగంటి కోటేశ్వరరావు, శ్రీ ఎం ఎస్. ఆర్. ఆవిష్కరించారు

## తిరుపతిలో ప్రదర్శన, సభ

తిరుపతి పట్టణంలో అరుణ పతాకాలతో, బ్యానర్లతో పెద్ద ప్రదర్శన జరిగింది. రిక్షా, మిల్లు కార్మికులు, పార్టీ, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనంతరం దేవస్థానం అసోసియేషన్ హాలువద్ద శ్రీ పి వాసుదేవరెడ్డి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది

కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు గంథంశెట్టి శివయ్య, కృష్ణారెడ్డి, నాగులు, వాసుదేవరెడ్డి, రామనాథరెడ్డి జగన్నాథం వెంకటశివయ్య, యువజన నాయకులు శ్రీ కె నారాయణ పార్టీ సాగించిన పోరాటాలను వివరించారు. వెనుకబడిన తరగతుల నాయకులు శ్రీ వసుమర్తి రామారావు, స్వాతంత్ర్య యోధులు శ్రీ కందస్వామిరెడ్డి, పట్టణ కాంగ్రెసు కార్యదర్శి శ్రీ సుందరయ్య సందేశాలిచ్చారు.

సభాప్రారంభంలో మృతవీరులు గంగయ్య నారాయణరెడ్డిలకు జోహారులర్పించారు.

## భారత కమ్యూనిస్టుపార్టీ సూత్రబద్ధ వైఖరి: టాస్ ప్రశంస

మాస్కో, డిసెంబరు 27

దేశ పరిస్థితులు సమస్యలను పరిశీలించడంలో భారత కమ్యూనిస్టుపార్టీ సూత్రబద్ధమైన మార్క్సిస్టు లెనినిస్టు పంథాను అనుసరిస్తున్నదని టాస్ పేర్కొంది.

స్వర్ణోత్సవాల సందర్భంగా భారతకమ్యూనిస్టుపార్టీ గురించి ఆ వార్తాసంస్థ ఒక వ్యాఖ్యానం ప్రచురించింది. పార్టీ పుట్టినప్పటినుండి ఈ సూత్రబద్ధవైఖరి కార్యాచరణలో ప్రతిఫలించింది. "ముఖ్యంగా గత వసంతకాలం గుత్తవర్గాలు జయప్రకాష్‌నారాయణ్ తరహా మితవాద నాయకుల ఆశీర్వచనాలతో ప్రధాని శ్రీమతి గాంధి ప్రభుత్వాన్ని కూలదోసేందుకూ, భారత్‌లో ప్రజాస్వామ్య పునాదులను కుదిపి పడవేసేందుకూ అభివృద్ధి నిరోధక శక్తులు యత్నించినపుడు కమ్యూనిస్టు పార్టీ సూత్రబద్ధమైన వైఖరి ద్యోతకమయింది" అని 'టాస్' వ్యాఖ్యాత ఒలెగ్ షిషోవ్ తెలిపారు.

"భారతసమాజంలో ప్రజాతంత్ర సంస్కరణల పథాన్ని అనుసరించే ప్రజాతంత్ర శక్తుల పక్షాన ఆ కీలక తరుణంలో కమ్యూనిస్టుపార్టీ నిలిచిందన్నారు.

### కమ్యూనిస్టుపార్టీకి అబ్బాస్ శాల్యూట్

బొంబాయి డిసెంబరు 27

స్వర్ణోత్సవాల సందర్భంగా భారత కమ్యూనిస్టుపార్టీకి సందేశంతో పాటు సంతాపం కూడా ఇస్తూ ప్రఖ్యాత రచయిత జర్నలిస్టు ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ ఒక ప్రకటన చేశారు.

"రక్తపోటు ఎక్కువగా వుంది. ఏమి రాయటానికి నా డాక్టర్ ఒప్పుకోలేదు. స్వర్ణోత్సవాల సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ, దాని పతాకమూ, ఆశయాలూ, ప్రజా ప్రయోజనాల కోసం అది చేసిన చారిత్రకసేవ దానికి తక్కువేమీ కాని పొరపాట్లు, చిన్న తప్పుల గురించి పూర్తిగా రాద్దామనుకున్న "లాస్టు పేజీ"ని వచ్చే వారానికి వాయిదా వేస్తున్నా

కమ్యూనిస్టు పార్టీ కామ్రేడ్స్‌కు ఇదే నా "సిక్ బెడ్ శాల్యూట్"

బొంబాయి పత్రిక "బ్లిట్జ్"లో ప్రతి వారం అబ్బాస్ వేసే తన "లాస్ట్ పేజ్" కాలమ్‌ను దేశమంతటా వేలాది పాఠకులు ఎంతో ఆసక్తితో చదువుతారు.

## హన్మకొండ బ్లాకులో 30 గ్రామాల్లో సైకిల్ ర్యాలీ

డిసెంబరు 21 నుండి 25 వ తేదీ వరకు వరంగల్ జిల్లా హన్మకొండ బ్లాకులో 30 గ్రామాల్లో 35 సైకిళ్ళపై యాత్ర సాగించి 10 వేల మందికి పార్టీ స్వర్ణోత్సవ సందేశాన్నందించారు.

సీతంపేట, వెంకటాపురం ఊరుగొండ గ్రామాలలో బహిరంగసభలు జరిపారు. పార్టీ శాఖలున్న ప్రతిచోటా అరుణ పతాకాలను ఎగురవేశారు. హసన్‌పర్తి గ్రామంలో విద్యార్థులు, ప్రజలు బ్యాండ్‌మేళాలతో సైకిళ్ల దళానికి ఎదురువెళ్ళి స్వాగతం చెప్పారు. గ్రామ గ్రామాన ప్రజలు ఈ దళంతో కలసి ఊరేగింపు జరిపారు.

ఈ దళానికి బ్లాకు పార్టీ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు శ్రీ వాడి మల్లారెడ్డి కారంగుంటి కొమురయ్య నాయకత్వం వహించారు. ఈ దళ ప్రచారం యువకులెంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

### వరంగల్ లో

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలు ఈ నెల 21 న వరంగల్‌లో ప్రారంభమైనాయి. వివిధ వార్డులలో పతాకావిష్కరణలు సమావేశాలు జరిగాయి. పార్టీ కార్యాలయం వద్ద, యింకా ముఖ్య సెంటర్లలో ఎర్ర తోరణాలతో అలంకరించారు.

అనంతరం పార్టీ కార్యాలయంలో శ్రీ యస్. రాజనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీయుతులు యం. కృష్ణమూర్తి, ఎం. కాళిదాసు, ఎం. వీరయ్య, వరదరాజన్ ఖాన్, ఎస్. రామచంద్రం, డి. ఉపేందర్, టి వెంకట్రాములు తదితరులు మాట్లాడారు. 100 విశాలాంధ్ర, 50 మ్యాగజైన్, 50 కొత్తవారి సభ్యత్వాలు పూర్తి చేయాలని కార్యక్రమం తీసుకొన్నారు

అంతకు ముందు వివిధ వార్డులలో జరిగిన సమావేశాలలో శ్రీయుతులు ఎం. కాళిదాసు, ఎస్. రాజనారాయణ, టి వెంకట్రాములు, వి. హెచ్. కమలమ్మ, వి. రాజమౌళి, ఎ హెచ్. రవిందర్, బి. సాయిలు, హసేనామహబూబ్ తదితరులు పార్టీ స్వర్ణోత్సవాల ప్రాముఖ్యతపై మాట్లాడారు.

### మార్టేరులో

పశ్చిమగోదావరిజిల్లా మార్టేరులో ఈనెల 20 వ తేదీన ముఖ్యమయిన ప్రదేశాలలో ఎర్రతోరణాలతో అలంకరించారు.

శ్రీ గుడిమెట్ల పుల్లారెడ్డి ఎర్రజెండాను ఎగురవేశారు.

వెలగలేరులో శ్రీ మేడపాటి సత్తిరెడ్డి జెండా ఎగురవేశారు.

హరిజనపేటలో శ్రీ కోడం జంగన్న, పల్లవరంలో శ్రీ గుళ్ళపల్లి సత్యం హరిజనపేటలో శ్రీ మంచే కృష్ణమూర్తి ఎర్రజెండాను ఎగురవేశారు.

స్వర్ణోత్సవాల సందర్భంగా మార్టేరు పట్టణ కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన శ్రీ మేడపాటి సత్తిరెడ్డి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

సభలో రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు, కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ భారత కమ్యూనిస్టుపార్టీ 50 ఏండ్ల చరిత్ర, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల గురించి ప్రసంగించారు.

శ్రీ పిద్దాల వెంకటస్వామి భారత జాతీయ జీవనంలో కమ్యూనిస్టుపార్టీ పాత్ర గురించి వివరించారు.

అనంతరం మార్టేరులోని సీనియర్ పార్టీ సభ్యులైన శ్రీ గుడిమెట్ల వెంకన్న, శ్రీ పంకా సత్యనారాయణను శాలువలతో సత్కరించారు.

### హిమాయత్‌నగర్ లోని సిటీ పార్టీ కార్యాలయంలో

హైదరాబాద్ డిసెంబరు 26

అత్యంత ఉత్సాహపూరిత, ఉత్తేజకర దృశ్యాలమధ్య నేటి ఉదయం హిమాయత్‌నగర్‌లోని నగరపార్టీ కార్యాలయం ఆవరణలో అరుణపతాకాన్ని సీనియర్ కామ్రేడ్ మార్కండేయులు ఆవిష్కరించారు.

ముఖ్యంగా మహిళలు, ఎక్కువ మంది ఉద్యోగులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు రాష్ట్రంలోని బ్యాంకు ఉద్యోగులు, ఎన్. జి. వోలు, ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, ఆయా సంఘాల నాయకులు ఎంతో మంది పార్టీ శ్రేయోభిలాషులు అభిమానులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు.

ఉత్సవానికి హాజరయినవారిలో ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ ప్రభృతులున్నారు.

యువ కమ్యూనిస్టులు గొంతెత్తి సమరశీల నినాదాలనుండగా పతాకావిష్కరణ జరిగింది.

పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి శ్రీ సలాం సాహెబ్ అధ్యక్షత వహించారు.

అంతకుముందు నగర కమ్యూనిస్టుసమితి సహాయ కార్యదర్శి శ్రీ యూసఫ్ స్వాగతం చెప్పారు, శ్రీమతి పద్మా నరసింహారావు "ఎత్తరా మన ఎర్రజెండా" గీతాన్ని ఆలపించారు. నినాదాలు మిన్నుముట్టుతుండగా పతాకావిష్కరణ ఉత్సవం ముగిసింది.

### పెనుమాకలో వృద్ధ కమ్యూనిస్టు నాయకునికి సన్మానం

మంగళగిరి, డిసెంబరు 25

గుంటూరుతాలూకా పెనుమాకలో కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఎర్రజెండా ఎగురవేశారు, తదనంతరం జరిగిన సమావేశంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శ్రీ ఆమర శివరామకృష్ణయ్య తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ యార్లగడ్డ సుబ్బారావు కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల ప్రాముఖ్యతను గురించి వివరించారు సమావేశంలో చిరకాలంగా కమ్యూనిస్టుపార్టీలో వుండి పని చేస్తున్న శ్రీ కంకణాల వెంకటేశ్వరరావును సన్మానించారు. (వి వి.)

## కర్నూలులో సైకిల్ ర్యాలీ

కర్నూలు, చుట్టు పక్కల గ్రామాలలో పార్టీ కార్యకర్తలు శ్రీయుతులు లక్ష్మిరెడ్డి సత్యనారాయణరాజు నాయకత్వాన ఈ నెల 24 న సైకిల్‌ర్యాలీ జరిగింది.

26 వ తేదీన పార్టీ కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో ఎర్రజెండాలతో అలంకరించారు.

అందంగా అలంకరించబడిన టీచర్సు గిల్డు హాలులో జరిగిన బహిరంగసభకు కాలేజి లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికసంఖ్యలో విద్యార్థులు, కార్మికులు హాజరయ్యారు.

పట్టణ పార్టీ కార్యదర్శి శ్రీ లక్ష్మిరెడ్డి అధ్యక్షత వహించారు శ్రీ సత్యనారాయణ రాజు సభ ఉద్దేశాన్ని వివరించారు.

జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ స్వామిరెడ్డిని, తుంగభద్ర ఇండస్ట్రీస్ కార్మికుడు శ్రీ హాజీసాహెబ్‌ను దుశ్శాలువాతో సభాధ్యక్షులు సన్మానించారు.

శ్రీ స్వామిరెడ్డి పార్టీ నడిపిన పోరాటాలను, ప్రజా సంఘాల నిర్మాణంలోను, ప్రగతిశీల శక్తులను ఏకం చేయటంలో చేసిన అవిరళ కృషిని వివరించారు.

### ఆసిఫాబాద్ తాలూకాలో

ఆసిఫాబాద్ తాలూకా కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన వెంగారావుపేట, ఇదులవాడ గ్రామాలలో పార్టీ స్వర్ణోత్సవాలు జరిగాయి.

శ్రీయుతులు నాయకుని మల్లేశం సింగరావుపేటలో, శ్రీ మానిడి వెంకయ్య ఇదులవాడలో అరుణపతాకాలను ఆవిష్కరించారు. రెండు గ్రామాలలో పెద్దప్రదర్శన ప్రధాన వీథులగుండా సాగింది.

అనంతరం శ్రీ తెన్నేరి గుండయ్య అధ్యక్షతన జరిగిన సభలో తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ పి నరసయ్య, శ్రీ పి. మొండి, శ్రీ టి. బాపురెడ్డి పార్టీ చరిత్రను వివరించారు. మృతవీరులకు జోహార్లర్పించారు.

### కనిగిరి తాలూకాలో సైకిల్ ర్యాలీ

ప్రకాశంజిల్లా కనిగిరి తాలూకాలో పార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా యువజన, విద్యార్థులు శ్రీయుతులు వి. ఆలూరావు, రామచంద్రయ్య, రవికుమార్, మాల కొండయ్యల నాయకత్వాన యీ నెల 22 న కనిగిరి పార్టీ ఆఫీసు నుండి సైకిల్‌ర్యాలీ ప్రారంభమైంది.

శ్రీయుతులు కె గురుస్వామి రెడ్డి, సయ్యద్ హనీఫ్ వీడ్కోలిచ్చారు.

ర్యాలీ కంభంవరం, వ్యాసంగుంటపల్లె, సాగునల్లె, చినయర్లపాడు, ఏకులారిపల్లె, పెదఅలవలపాడు మారెళ్ళ, పెదచెర్లోపల్లె, వ్యాపిగుంపల్లె చింతగుంపల్లె, పెదయర్రపాడు, గుంటుపల్లె బలిజెపాలెం, కొండిగొంవల, బొట్లగూడూరు, మోపాడు, మునిమెల్ల, పామూరు, వగ్గంపల్లె, కట్టకిందపల్లె, లింగరెడ్డిపల్లె, దాదిరెడ్డిపల్లె, కనిగిరి మొత్తం 4 ఫిర్కాలలో 22 పంచాయితీలలో 150 మైళ్ళు తిరిగి 24 తేదీకి కనిగిరి చేరుకొన్నది.

### అద్దంకిలో బహిరంగసభ

అద్దంకిలో యీ నెల 24 వ తేదీ సాయంత్రం పార్టీ ఆఫీసునుండి బస్ స్టాండువరకు అరుణ పతాకాన్ని ఊరేగించారు, అక్కడ శ్రీ వి. రామకోటయ్య పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన బహిరంగ సభలో తాలూకా పార్టీ తరపున కార్యదర్శి శ్రీ వి. యల్లయ్య శ్రీ రామకోటయ్యను సన్మానించారు.

జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ పెదవలి శ్రీరాములు పార్టీ పుట్టుక, స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర, అనంతరం సాగించిన మహత్తర పోరాటాలను వివరించారు. జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ నాతాని వెంకటస్వామి ప్రస్తుత పరిస్థితులు, పార్టీ కార్యక్రమం వివరించి అన్ని వర్గాల ప్రజలు అండదండలివ్వాల్సిందిగా కోరారు.

### తాళ్ళూరులో పార్టీ నిధి వసూలు

స్వర్ణోత్సవాల సందర్భంగా మసుకోట తా॥ తాళ్ళూరు గ్రామములో రు 1010 లు పార్టీ నిధి వసూలు అయింది. యింకా నాలుగు వేల రూపాయలు వసూలు చేయాలని స్థానిక శాఖ నిర్ణయించింది. దీనికి జిల్లా కార్యవర్గ సభ్యులు తమ్మెర వెంకటరామ నర్సయ్య తాలూకా పార్టీ కార్యదర్శి బంద్యాల సామయ్య నాయకత్వం వహించారు.

నెల్లూరు ట్రంకురోడ్డు సెంటరువద్ద అరుణపతాక ఆవిష్కరించినప్పటి దృశ్యం

## మండపేట, కొత్తపేటల్లో ప్రదర్శనలు, సభలు

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 25 వ తేదీన ఆలమూరు తాలూకా మండపేటలో ప్రదర్శన బహిరంగసభ జరిగాయి

ఆలమూరు నుంచి యువకులు సైకిళ్ళపై స్వర్ణోత్సవాల ప్రాముఖ్యతను ప్రచారం చేసుకుంటూ మండపేట గ్రామానికి చేరుకొన్నారు అలాగే ఏకి నుంచి మరోక దళం వచ్చింది

ఆలమూరు నుంచి బజీగీర వర్గాలవారు 15 మంది డోలక్ తప్పెటలతో ప్రదర్శనలో పాల్గొనడం ఒక విశేషం

ప్రదర్శన అనంతరం శ్రీ యన్నమని లక్ష్మీపతి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

* * *

తాలూకాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి 35 సంవత్సరాలుగా సేవ చేస్తున్న శ్రీ పాలపర్తి పనసరామన్న, శ్రీ యన్నమని లక్ష్మీపతి, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణను తాలూకా సమితి తరపున శ్రీ పేడిరెడ్డి సత్తిరాజు పూలమాలలతో సన్మానించారు.

* * *

తాలూకా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ జె వి. వి సూర్యనారాయణ మూర్తి సన్మానితులు పార్టీ ఉద్యమానికి చేసిన సేవలగురించి వివరించారు.

అనంతరం శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ భారత కమ్యూనిస్టుపార్టీ 50 ఏళ్ళ త్యాగాలతో నిండిన సమరశీల పోరాట చరిత్రలను గురించి వివరించారు.

శ్రీ పాలపర్తి పనసరామన్న అమరజీవి తోరాటి లక్ష్మణమూర్తి జీవిత చరిత్రను, చేసిన త్యాగాల గురించి వివరించారు.

### కొత్తపేటలో ఊరేగింపు, బహిరంగ సభ

తూర్పుగోదావరిజిల్లా కొత్తపేటలో యీ నెల 25 న ఊరేగింపు, బహిరంగసభ జరిగాయి.

వ్యవసాయ పనులు చాలా ముమ్మరంగా వున్నప్పటికీ వ్యవసాయ కార్మికులెంతో ఉత్సాహంతో వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభా ప్రాంగణం జిల్లాకు చెందిన మృతవీరులు 11 మంది, తాలూకాకు చెందిన మృతవీరులపేర్ల పత్రికలు, తాలూకా పార్టీ ప్రముఖుల పేర్లగల బోర్డులతో అలంకరించారు. సభ వేదికపై లెనిన్, మృతవీరులు చింతసత్యనారాయణదాసు, పెన్మత్స అనంతరాజు ఫొటోలతోపాటు డాంగే ఫోటోను కూడా అలంకరించారు.

సభకు తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ మీసాల గంగాధరరావు అధ్యక్షత వహించారు. తాలూకా కమిటీ సభ్యులు వేదికపై ఆసీనులయ్యారు.

తాలూకా పార్టీ సహాయ కార్యదర్శి శ్రీ సత్యం సుబ్బారావు శ్రీ గంగాధరరావు జీవిత విశేషాలను వివరించి తాలూకా పార్టీ తరపున ఆయనకు వస్త్ర బహూకరించి పూలమాలలతో సత్కరించారు. ప్రజాసంఘాల తరపున కూడా ఆయనను సన్మానించటం జరిగింది. పుల్లేటికుర్రు గ్రామ పార్టీ శాఖ తరపున శ్రీ పినాపాటి సత్యనారాయణ శ్రీ గంగాధరరావును నూతన వస్త్రాలతో సన్మానించారు.

అనంతరం శ్రీ గంగాధరరావు పార్టీ చరిత్రను, తాలూకాలో మృతవీరుల త్యాగాలను వివరించారు.

జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ పార్టీ సాగించిన పోరాటాలను, ప్రస్తుత దేశ పరిస్థితి వివరించి, ప్రగతిశీల శక్తులను ఏకం చేయటంలో పార్టీపైన వున్న బాధ్యతను తెలియ చేశారు.

### పల్నాడు తాలూకాలో

పల్నాడు తాలూకాలో కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాలు నారాయణపురం (దాచేపల్లి) లో మృతవీరుల స్తూపంవద్ద బ్రహ్మాండంగా జరిగాయి. ప్రదర్శనలో వెయ్యి మంది సభలో 2010 మంది పాల్గొన్నారు.

ఇరికేపల్లి నుండి, రామాపురం నుండి దాచేపల్లి నుండి చిత్ర విచిత్ర అలంకరణలతో బండ్లు కట్టుకొని ఊరేగింపుగా స్తూపం వద్దకు ప్రదర్శకులు చేరారు.

పిడుగురాళ్ళ యువకులు సైకిల్‌ర్యాలీతో పిడుగురాళ్ళ, బ్రహ్మణపల్లి, కామేపల్లి కరాలపాడు, తుమ్మలచెరువు, వీరాపురం గ్రామాలలో ప్రచారం చేస్తూ సాయంత్రం 4 గంటలకు స్తూపం వద్దకు చేరారు. తాలూకాలోని 30 గ్రామాలలోని పార్టీ ముఖ్యులంతా వచ్చారు

సాయంత్రం 4-30 లకు స్తూపంవద్ద నుండి ప్రదర్శన బయలుదేరింది. అత్యుత్సాహ వాతావరణంలో అనేక భంగిమలతో చిత్రవిచిత్ర వేషాలలో దాదాపు వెయ్యిమంది ప్రదర్శకులు దాచేపల్లి పురవీధులగుండా ప్రదర్శన జరిపారు

బహిరంగసభకు శ్రీ వి. సైదారెడ్డి అధ్యక్షత వహించారు. మృతవీరుల కుటుంబాలను పార్టీ నిర్మాత శ్రీ ఎర్రబ్రహ్మారావును వేదిక మీదకు ఆహ్వానించడం జరిగింది.

శ్రీ టి రామాంజనేయులు మాట్లాడుతూ తెలంగాణా పోరాట అనుభవాలు వివరించారు.

తరువాత చల్లా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుపార్టీ ప్రపంచంలో ప్రపంచ యుద్ధం రాకుండా అపగలుగుతూందని చెప్పారు.

ఈ సందర్భంగా శ్రీ మందపాటి నాగిరెడ్డి (యం.యల్.ఏ) మాట్లాడుతూ ప్రభుత్వం చేసే చట్టాలుగాని, 20 అంశాల కార్యక్రమం గాని ప్రభుత్వం దానికదే చేస్తుందనుకోవడం పొరపాటని, మన ప్రజా ఉద్యమాలద్వారానే అమలు జరిపించుకోవాలని చెప్పారు.

పల్నాటి రాజకీయచరిత్రను పటికలతో గుర్తుచేశారు.

చివరగా మృతవీరుల చరిత్రను వివరించి మృతవీరుల కుటుంబాలను నూతనవస్త్రాలతో సన్మానించారు. సభానంతరం మాచర్ల ప్రజానాట్యమండలివారిచే "పల్నాటి చరిత్ర" బుర్రకథ చెప్పబడింది.

### పిడుగురాళ్ళలో

పల్నాడు తాలూకా పిడుగురాళ్ళలో భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవము సందర్భంగా యీనెల 21 న 16 సైకిళ్ళతో సైకిల్ ర్యాలీ జరిగింది

యీ దళానికి శ్రీయుతులు పి. ప్రేమానందం, నంబా అమృతరావు, కె. కిష్టయ్య, డి నాగేశ్వరరావు నాయకత్వంవహించారు.

* * *

అంతకుముందు ఉదయం పార్టీ కార్యాలయంలో పిడుగురాళ్ళ శాఖలో సీనియర్ సభ్యుడు శ్రీ మిరియాల కిష్టయ్యకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ యస్. ఖాసింపీరా (తాలూకా కార్యవర్గ సభ్యులు) అధ్యక్షత వహించారు.

* * *

బుర్రకథలు - గొల్లసుద్దులు (జముకుల) ద్వారా, పార్టీకి ఎన్నో విధాలుగా వుపయోగపడిన వారిలో శ్రీ కిష్టయ్య ఒకరని శ్రీ ఖాసింపీరా ప్రశంసించారు.

ఇంకా శ్రీయుతులు పి. ప్రేమానందం, అయితం నర్సయ్య, యస్. అమృతరావు, కె. కిష్టయ్య యస్. నారాయణ మాట్లాడారు.

పార్టీ కార్యాలయంలో గ్రామ సెంటరులో ఎర్ర తోరణాలు జండాలతో అలంకరించారు. శ్రీ మిరియాల కిష్టయ్య, సెంటరులో ఎర్రజెండాను ఆవిష్కరించారు.

### సింగరాయకొండలో

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా సింగరాయకొండలో కల్లూరి చంద్రమౌళి అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం జరిగింది

సమావేశానికి చుట్టుపక్కల గ్రామాల నుండి నాలుగువందలమంది సభ్యులు హాజరయ్యారు.

అనంతరం పెద్ద ఊరేగింపు జరిగింది. ఊరేగింపు బ్యాండు వాయిద్యాలతో స్త్రీ-పురుషులు, విద్యార్థి, యువజనులు, గోల్డెన్ టుబాకో కార్మికులు నినాదాలిస్తూ, పాటలుపాడుతూ వుత్సాహంగా ప్రదర్శన జరిపారు

ప్రదర్శనలో 800 మంది పాల్గొన్నారు. ప్రదర్శనానంతరం జరిగిన బహిరంగ సభకు శ్రీ కొండు రత్నం అధ్యక్షత వహించారు.

శ్రీ యస్. సుబ్బారావు వక్తలను వేదిక పైకి ఆహ్వానించారు

సభలో శ్రీయల్లమందారెడ్డి, శ్రీ దివికొండయ్య, శ్రీ మిడసల వెంకట సుబ్బయ్య, శ్రీయుతులు కూనంనేని రాములు, కె పాపిరెడ్డి ఉపన్యసించారు.

సభలో వ్యవసాయ కార్మిక పరిషత్ నిధికి రు. 500 లను సమర్పించారు.

శ్రీ పి. రత్నం వందన సమర్పణతో సభ ముగిసింది.



విజయవాడలో జరిగిన స్వర్ణోత్సవసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ తమ్మినపోతరాజు, వేదికపై శ్రీయుతులు మోదుమూడి శ్రీహరిరావు, వేమూలపల్లి శ్రీకృష్ణ, మైనేని లక్ష్మణస్వామి, ఆంజనేయశాస్త్రి, టి. వెంకటేశ్వరరావు లున్నారు.

# ఏలూరు, జగ్గయ్యపేట, గన్నవరంలలో సమధికోత్సాహంతో ప్రజా సమీకరణ

ఏలూరు, డిసెంబర్ 27

భారతకమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని ఏలూరు తాలూకా-పట్టణ కమ్యూనిస్టు సమితుల సంయుక్తఆధ్వర్యాన పెద్ద ప్రదర్శన, గొప్ప బహిరంగసభ నిన్న ఏలూరులో జరిగాయి. పార్టీ కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులు, జూట్ కార్మికులు, వ్యవసాయ కార్మికులు తోపుడు బండ్లు, బీడీ చేనేత, రిక్షా, గోల్డెన్ టుబాకో, ఆర్. టి. సి., యువజనులు, విద్యార్థులు, ప్రింటింగ్ ప్రెస్ కార్మికులు, ఇతర శ్రామిక సంఘాలవారు, అధికసంఖ్యలో మహిళలు, మూడు వేలమంది బారులుతీరి అరుణపతాకాలతో, బ్యానర్లతో, ప్లేకార్డ్స్‌తో, పెద్ద పెద్ద చిత్రాలతో, సుత్తీ-కొడవలి చిహ్నాలతో విచిత్రవేషాలతో, బ్యాండ్ వాయిద్యం, మంగళ వాయిద్యాలతో కమ్యూనిస్టుపార్టీ వర్ధిల్లాలి! అమరవీరులకు జోహార్లు! స్వర్ణోత్సవం జయప్రదంకావాలి! భూములు వెంటనే పంచాలి! బ్లాక్‌మార్కెట్ నశించాలి! ఫాసిస్టు శక్తులను ఐక్యంగా ప్రతిఘటించాలి! అభివృద్ధి నిరోధకులు నశించాలని దిక్కులు పిక్కటిల్లేవిధంగా నినదిస్తూ ప్రధాన వీధుల గుండా జనసమ్మర్ద ప్రాంతాల్లో ఊరేగింపుగా మోతే గంగరాజు పార్కుకు చేరారు. కమ్యూనిస్టు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అగ్రభాగాన నడిచారు.

స్వర్ణోత్సవాన్ని గుర్తుచేస్తూ ఏభయ్ అవుటు రాకెట్లు, అవ్వాయిలు కాల్చారు.

ప్రజా ప్రదర్శన పొడుగునా ప్రజా నాట్యమండలి, ఇతర సాంస్కృతిక సంస్థలవారు తమ తమ సాంస్కృతిక ప్రదర్శనలతో - కళా రూపాలతో అశేష ప్రజానీకాన్ని ఆకట్టివైచారు.

నిడుకుండి గంధి దళం సుత్తీ-కొడవలి నృత్యం, వరికోత నృత్యం శ్రామికులను బాగా ఆకర్షించింది.

సీతారామ కోలాట బృందం రాజకీయ ఇతివృత్తం ఆధారం చేసుకుని ప్రదర్శించిన కోలాటం చిన్నలకు, పెద్దలకు వినోదం కలిగించింది.

శ్యామలపల్లి రామారావు సంగీతరూపకం 'దేశద్రోహులు - పేద ప్రజలు' పేదలకు కర్తవ్యాన్ని ప్రబోధించింది.

కృపతి అప్పలస్వామి దళం అంబాడీ నృత్యాన్ని నిరుపమానరీతిలో నిర్వహించింది.

చాటపర్రు లెనిన్ నగరు భజనదళం శ్రీ సుబ్బయ్య నాయకత్వాన విప్లవ గీతాలను చెక్కభజన పద్ధతిలో నృత్యం చేస్తూ వినిపించారు.

13 వ వార్డు శాఖ సుత్తీ-కొడవలిని బ్రహ్మాండమైన ప్రమాణంలో నిర్మించి ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు.

కలిసెట్టి బృందం, రెల్లి సూర్యనారాయణ బృందం అల్లాఖాని వేషాలతో, జముకుల కథగా జనాన్ని ఆకర్షించారు.

చాటపర్రు వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ప్రభను నిర్మించి ఊరేగిస్తూ వచ్చి బృహత్ ప్రదర్శనలో కలిశారు.

జూట్ కార్మికుడు ఆవాల రాములు లెనిన్ వేషం వేసుకుని ఏలూరులో రష్యన్ విప్లవ దృశ్యాన్ని నృపించాడు. పలు వాడల నుండి పాయలుగా వచ్చి చేరిన చిన్న ఊరేగింపులు బృహత్ ప్రదర్శనగా మారి కొన్నిచోట్ల ట్రాఫిక్ బంద్ అయింది. మోతే గంగరాజు పార్కులో అరుణ పతాకాల రెపరెపల్లో, ఎర్ర తోరణాల అలంకరణలో విద్యుత్ దీపాల వెలుగులో పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పూడి అప్పలస్వామి అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది.

* * *

పోరాటంలో ప్రాణాలిచ్చి స్మృతిపీఠులై నిలిచిన కామ్రేడ్స్ పి. మృత్యుంజయుడు భార్య శ్రీమతి ధనమతిని, స్వర్గా అంజనేయులు భార్య శ్రీమతి కోటేశ్వరమ్మను, పార్టీ నిర్మాతలు కామ్రేడ్స్ వై. పోలిశెట్టి, సంకు అప్పారావులను ప్రజాసంఘ నిర్మాతలు కామ్రేడ్స్ కడుపు రాములు, బసిశెట్టి అప్పారావు, కృష్ణం పి. హాచలం, వంకినేని సత్యనారాయణలను రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ యం. వి. యస్. శివప్ప, వంకా సత్యనారాయణ, ఇందుకూరి సుబ్బరాజులను ఈ సభలో పార్టీ, ప్రజా సంఘాల తరఫున సన్మానించారు.

* * *

ప్రెస్ కార్మికులు తమ నాయకుల సంఘానికి చేసిన సేవలను కొనియాడుతూ సన్మానపత్రం చదివారు.

రాష్ట్ర కమ్యూనిస్టునాయకులు శ్రీ సంకు అప్పారావు తమ ప్రసంగంలో భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఎప్పుడు పుట్టిందో, ఎన్ని నిర్బంధాలకు గురైనదో, శ్రామికులకోసం దోపిడి అత్యాచారాలపై పోరాటం ఎలా సాగిస్తూ వుంటుందో వివరించి భారతప్రభుత్వం బూర్జువా ప్రభుత్వమని, ఇందిరాగాంధి సోషలిజం తెస్తుందని కమ్యూనిస్టుపార్టీకి భ్రమలు లేవని ప్రజలు పోరాడి త్యాగాలు చేసి సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటుచేసుకోవలసిందేనని, కమ్యూనిస్టుపార్టీ అందుకు కంకణం కట్టుకుందన్నారు.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి వర్గ సభ్యులు, శాసన సభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ ప్రసంగిస్తూ దేశ స్వాతంత్ర్యంకొరకు, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ కమ్యూనిస్టుపార్టీలు మొదటినుండీ పోరాటం సాగించాయి. కమ్యూనిస్టుపార్టీ ఎన్ని సంవత్సరాల క్రితమో ప్రతిపాదించి ఆందోళన సాగిస్తూ వచ్చిన కార్యక్రమాన్నే ఈ నాడు కాంగ్రెసుపార్టీ ఇందిరాగాంధీ నాయకత్వాన అమలు జరుపుటకు సిద్ధపడితే ఉభయులు కలిసి పని చేయడంలో ఆక్షేపణ వుండరాదన్నారు.

కాంగ్రెస్‌లో అధిక సంఖ్యలో అభివృద్ధి నిరోధకులు వుండటం మరవకూడదని, అయినా దేశానికి ఫాసిస్టు ప్రమాదం ఉన్నందున కాంగ్రెసులోని ప్రగతిశీల, మధ్యేమార్గవాదులు, కమ్యూనిస్టు కలిసి పనిచేస్తేనే దేశాన్ని రక్షించడం సాధ్యమని హెచ్చరించారు.

ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ యమ్. వి. యస్. కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి, శాసనమండలి సభ్యులు శ్రీ కొండ్రు సుబ్బారావు, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఇందుకూరి సుబ్బరాజు ప్రసంగిస్తూ జిల్లాలో సాగించిన జమీందారీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల చరిత్రను పేద ప్రజల పాత్రను తెలియజేశారు.

ఏలూరు ప్రజానాట్యమండలివారి గొల్ల సుద్దుల రాజకీయంతో కార్యక్రమం ముగిసింది. (వి. వి)

## జగ్గయ్యపేటలో

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా నిన్న ఇక్కడ రాష్ట్ర రైతు సంఘ నాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

సభలో ప్రముఖ మార్క్సిస్టు మేధావి శ్రీ ఏటుకూరి బలరామమూర్తి ప్రసంగిస్తూ "భారతకమ్యూనిస్టుపార్టీ సరైనపంథాలో పయనిస్తున్నదంటే దానికి కారణం మార్క్సిస్టు లెనినిస్టు అవగాహన, అంతర్జాతీయ దృక్పథం అని అన్నారు

రాష్ట్ర గీత కార్మిక సంఘ నాయకులు శ్రీ బొమ్మగాని ధర్మభిక్షం ప్రసంగిస్తూ తెలంగాణా పోరాటాన్ని ప్రస్తావించి అది ఫ్యూడల్ వ్యతిరేక పోరాటమే గాక స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక భాగమని అంతర్జాతీయంగా, జాతీయంగా కమ్యూనిస్టులు జరిపే పోరాటంలో కూడా ఒక భాగమేనని అన్నారు.

సభకు ముందు శ్రీ కంజుల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో అమరజీవులు శ్రీ కిలారు అప్పయ్య, శ్రీ గుప్తా సుబ్బయ్యల కుటుంబాలను పట్టణ కమ్యూనిస్టు సమితి తరఫున పిల్లలమర్రి అన్నపూర్ణమ్మ, శ్రీ వేమూరి నరేంద్ర కుమారిలు నూతన వస్త్రాలతో సన్మానించారు.

పార్టీలో అనేక త్యాగాలు చేసి, నేటికి ఉద్యమంలో పని చేస్తున్న శ్రీయుతులు షేక్ అమీర్, వి. యస్. ఆర్. ఆంజనేయులు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, కందిబండ పిచ్చయ్య, శ్రీమతి పాలకం తిరుపతమ్మలను పట్టణ కమ్యూనిస్టు తరఫున సన్మానించారు.

పట్టణ ట్రేడ్‌యూనియన్ అధ్యక్షులు శ్రీ మళ్ళ క్రిష్ణ సన్మానితులను, వక్తలను వేదికమీదకు ఆహ్వానించారు.

ప్రధాన అతిథి శ్రీ ఏటుకూరి బలరామమూర్తిని శ్రీ చిలకా పెద వెంకటేశ్వర్లు (యర్రయ్య) సన్మానించారు.

అమరజీవి అవాసపు రాధా పేర నిర్మించిన వేదికపై పట్టణ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీయుతులు పిడింతల గోపయ్య, టి. పి. ప్రసాద్, బొల్లికం రాఘవులు మహమ్మద్ మస్తాన్, వి. నర్సయ్య ఆశీనులయ్యారు.

ఉదయం పట్టణంలోని వివిధప్రాంతాల్లో శ్రీయుతులు పిల్లలమర్రి, నరేంద్రకుమారి, యర్రయ్య అమీర్, బండి రామ్మోహనరావు, అరుణ వెంకటాద్రి, మళ్ళ కృష్ణ, మస్తాన్, లక్ష్మి, తాడికొండ పిచ్చయ్య, కందిబండ పిచ్చయ్య లాల్ అహ్మద్ లు అరుణ పతాకాలను ఆవిష్కరించారు.

సాయంత్రం పెద్ద ప్రదర్శన జరిగింది ప్రదర్శన అగ్రభాగాన వ్యవసాయ కార్మికులు [illegible] యువకుడు, యువతి చిత్రం ప్రజలను ఆకర్షించింది

## గన్నవరంలో

గన్నవరం, డిసెంబరు 25

భారత కమ్యూనిస్టుపార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా గన్నవరం తాలూకా కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన స్థానిక ఎన్. జి. ఓ. హోం లో సభ జరిగింది

సభలో తాలూకా కమ్యూనిస్టుపార్టీ నిర్మాతల్లో ఒకరు, తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కాట్రగడ్డ పెదవెంకట్రాయుడు అధ్యక్షత వహించారు.

తాలూకా వ్యవసాయ కార్మికసంఘ అధ్యక్షులు శ్రీ కొప్పెర్రు సులేమాన్ సభను ప్రారంభిస్తూ రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. వి. కృష్ణారావును, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రిని వేదికమీదకు ఆహ్వానించారు.

సభాధ్యక్షులు శ్రీ కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు పార్టీ నిర్మాతలను, అమరవీరుల కుటుంబ సభ్యులను వేదికపైకి ఆహ్వానించారు.

తాలూకా కమ్యూనిస్టుపార్టీకి అవసరమైన సమయాల్లో సహకారాన్ని అందచేస్తున్న గన్నవరం పంచాయతీ సమితి అధ్యక్షులు డాక్టర్ పి. యల్. రాయుడును కూడా సభావేదిక మీదకు ఆహ్వానించారు.

మృతవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

స్వర్ణోత్సవాల సందర్భంగా తాలూకా కమ్యూనిస్టు సమితి ప్రచురించిన "అమరవీరుల జీవిత చరిత్రలు" అనే పుస్తకాన్ని శ్రీ అంజనేయశాస్త్రి ఆవిష్కరించారు.

రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రసంగిస్తూ కమ్యూనిస్టుపార్టీ 50 ఏళ్ళ చరిత్రలోని ప్రముఖ ఘట్టాలు, పార్టీ నిర్వహించిన పాత్ర, భవిష్యత్ కార్యక్రమం వివరించారు.

* * *

సభకు హాజరైన మృతవీరుల కుటుంబ సభ్యులు శ్రీ చింతపల్లి లక్ష్మారాయుడు, శ్రీ గుండక సోమిరెడ్డి శ్రీమతి యలమంచిలి శశిరేఖ, శ్రీమతి ఈడ్పుగంటి బుల్లెమ్మ, శ్రీమతి పర్వతనేని సీతారావమ్మ, శ్రీమతి కాట్రగడ్డ భారతి, శ్రీమతి కొమ్మారెడ్డి రత్నమ్మ, శ్రీమతి సీతామహాలక్ష్మి శ్రీమతి జోసీ, అమరవీరుడు బాస్తి బసవరావు కుమారునికి సన్మానం జరిగింది.

సభకు హాజరైన తాలూకా పార్టీ నిర్మాతలు శ్రీ వై. వి. కృష్ణారావు, శ్రీ జె ఎస్ ఆర్ అంజనేయశాస్త్రి, శ్రీ కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు, శ్రీ బండి వెంకటకృష్ణయ్య శ్రీ పెనుమాకూరి కృష్ణమూర్తి, శ్రీ కడియాల పరశురామయ్య, శ్రీ తాలాడి రామకోటయ్య, శ్రీ వల్లభనేని నారాయణదాసు, శ్రీ కడియాల పిచ్చయ్య, శ్రీ అన్నవరపు తపయ్యలకు కూడా సన్మానం జరిగింది.

* * *

## ఆదిలాబాద్‌లో

ఆదిలాబాదు పార్టీ కార్యాలయంలో యీ నెల 26 వ తేదీన స్వర్ణోత్సవ సభ అనంతర టౌన్ కౌన్సిల్, హమాలీయూనియన్, విద్యార్థి యువజన సమాఖ్యల సంయుక్త సమావేశం జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్రీ దాశశంకర్ అధ్యక్షతన జరిగింది

పట్టణ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ కె రామకిషు ప్రసంగిస్తూ కమ్యూనిస్టుపార్టీ చరిత్ర వివరించారు.

తెలంగాణా సాయుధ పోరాటాన్నిగురించి వివరించారు

శాంతి సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ రామమంత్రరావు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం నేటి ప్రపంచంలో ఏ విధంగా నిర్ణాయక శక్తిగా తయారైంది తెలియజేశారు.

తాలూకా సమితి కార్యదర్శి శ్రీ పండరినాథ్, శ్రీయుతులు జి. సదాశివ్, వసంత కుమారి (విద్యార్థి నాయకులు) ప్రసంగించారు.

దాశీశంకర్ ప్రసంగంతో సమావేశం ముగిసింది.

ఉత్సవాలకు ముందు ఆదిలాబాదుకోసు చుటుపట్ల గ్రామాలలోను యువకులు, [illegible]

కొత్త సంవత్సరంలో

# పారిశ్రామిక ఉత్పత్తి రేటు బాగా పెరిగే అవకాశం

న్యూఢిల్లీ, డిసెంబరు 28

పారిశ్రామిక విధానంలో ప్రత్యేకించి అత్యవసరపరిస్థితి ప్రకటనానంతరం, లైసెన్సింగ్ పద్ధతులను సులభతరం చెయ్యడం, కష్టతరంగా చేసే పారిశ్రామిక సంకెలను తొలగింపచేయడం వగైరా ప్రధానమైన మార్పులవల్ల వచ్చే సంవత్సరంలో పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధిరేటు ఎక్కువగా వుంటుందని భావింపబడుతోంది.

నిర్మాణం, ఆటోమొబైల్స్, ఎక్కువ కాలంమన్న వినిమయసరుకులు జౌళి పరిశ్రమలవంటి కొన్ని రంగాలు మినహా, మొత్తంమీద ప్రధానమైన పరిశ్రమలలో ఉత్పత్తి 1975 వ సంవత్సరంలో బాగానే వుంది. ఉత్పత్తులు దెబ్బతిన్న కొన్ని రంగాలలో కూడా ప్రభుత్వం ప్రకటించిన పాకేజీచర్యల ఫలితంగా, ఉత్పత్తి పెరుగుతున్న నిదర్శనలు కనబడుతున్నాయి

ప్రభుత్వరంగ పరిశ్రమల్లోకూడా, గత సంవత్సరాలతో పోల్చినప్పుడు యీ సంవత్సరం ఉత్పత్తులు బాగానే పెరిగాయి ప్రభుత్వరంగపరిశ్రమలలో ఉత్పత్తి 1977 ఏప్రిల్-అక్టోబరు నెలల మధ్య, గత సంవత్సరం యిదే కాలంలో కంటె 15 శాతం ఉత్పత్తులు పెరిగాయి. అమ్మకానికి అనుగుణమైన ఉక్కు ఉత్పత్తి 16 శాతం, లిగ్నైట్‌తోసహా బొగ్గు ఉత్పత్తి 11 శాతం పెరిగాయి

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో 46 శాతం విద్యుదుత్పాదక భారీ పరిశ్రమలలో 25 శాతం ఉత్పత్తి పెరిగింది. సిమెంటు ఉత్పత్తి 10 శాతం, అల్యూమినియం, రాగి ఉత్పత్తులు గతం కంటే బాగా పెరిగాయి.

ఇతర పరిశ్రమల్లో-[illegible] పరిశ్రమలో ఉత్పత్తి 38 శాతం, చక్కెరపరిశ్రమలో 14 శాతంఉత్పత్తులు పెరిగాయి రవాణారంగంలో, పాసెంజరు కార్ల ఉత్పత్తి తగ్గింది కాని వాణిజ్య వాహనాల ఉత్పత్తి 8 శాతం, స్కూటర్ల ఉత్పత్తి 14 శాతం. [illegible] ఉత్పత్తి 25 శాతం పెరిగాయి.

వ్యాపారం కొనసాగిస్తున్న సంస్థలు, మినహా, పరిశ్రమల స్థాపన, విస్తరణకోసం పెట్టుకున్న దరఖాస్తులు, నవంబరు 1వ తేదీకి 879 మాత్రమే పరిష్కారం కావలసి వున్నాయి.

జనవరినుండి అక్టోబరువరకు గత 10 నెలల్లోను వచ్చిన దరఖాస్తుల సంఖ్య 2 493 వున్నదృష్ట్యా, పరిష్కారం కావలసిన దరఖాస్తుల సంఖ్య తక్కువే. జనవరి 1 వ తేదీ నాటికి 1 054 దరఖాస్తులు పరిష్కారం కావలసి వుండగా, 751 దరఖాస్తులు సక్రమంగా లేవని తిప్పి పంపబడ్డాయి. అదేకాలంలో 1 917 దరఖాస్తులు పరిష్కరింపబడ్డాయి.

1974 జూలై 1-1975 అక్టోబరు 31 వ తేదీల మధ్య ప్రభుత్వం వివిధ కార్యకలాపాలకుగాను 1 492 అనుమతి పత్రాలు 1600 పారిశ్రామిక లైసెన్సులు జారీచేసింది.

1975-76 వ సంవత్సరంలో అనుసరించదగిన నూతన దిగుమతి లైసెన్సు విధానం ప్రకారం కొత్త పద్ధతులను ప్రవేశపెట్టి, వెంటవెంటనే లైసెన్సులు జారీచేయడం ప్రారంభించడంతో, లైసెన్సుల జారీలో జాప్యం తగ్గించడానికి 30 రోజుల్లో 80 లైసెన్సులకు పైగా జారీ చెయ్యడానికి అవకాశం లభించింది.

ప్రాధాన్యతల రంగాల్లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టించేందుకు వీలుగా యీ సంవత్సరంలో ప్రభుత్వం తన పారిశ్రామిక విధానాన్ని పునర్నిర్ణయించింది. ప్రప్రథమంగా ఎగుమతులను ఎక్కువగా ప్రోత్సహించేందుకై 15 ఇంజనీరింగు పరిశ్రమలకు వెంటనే వాటి ఉత్పత్తి శక్తిని సంవత్సరానికి 5 శాతం లేక ఐదు సంవత్సరాల్లో 25 శాతం హెచ్చించడానికి యిప్పుడు అనుమతి యివ్వబడింది

అంతేకాక పరిశ్రమల పూర్తి ఉత్పాదక శక్తిని వినియోగించాలనే అభిప్రాయంతో, పారిశ్రామిక యంత్రాలు యంత్రపరికరాలు విద్యుత్ పరికరాలు, ఉక్కు పోత, ఉక్కు ఫోర్జింగు ఫాక్టరీలలో ఉత్పత్తిని బహుముఖము చెయ్యడానికి అనుమతి యివ్వబడింది

గుత్త పెట్టుబడుల నిరోధక చట్టం క్రిందకు రాని పారిశ్రామిక సంస్థలలో వాటి ఉత్పాదక శక్తికి అనుగుణంగా పరిశోధన, అభివృద్ధికృషి కొనసాగించేందుకు అనుమతి యివ్వబడింది.

## తగినంత విద్యుత్ సరఫరాకు డిమాండ్

### పశ్చిమగోదావరిజిల్లాపరిషత్ తీర్మానం

ఏలూరు, డిసెంబరు 27

వ్యవసాయ కార్యకలాపాలకు సకాలంలో తగినంత విద్యుత్ సరఫరా కానందువల్ల పశ్చిమ గోదావరి జిల్లా రైతులు చాలా ఇబ్బందులకు గురిఅవుతున్నారు విద్యుత్ సరఫరా రోజుకి కనీసం 12 గంటలైనా సప్లై చేయనందున చాలా నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

రైతుల సౌకర్యార్థం భీమడోలు విద్యుత్ కేంద్రం నుండి 20 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేయాలని రోజుకు 16 గంటలైనా విద్యుత్ సరఫరా చేయాలని ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానించారు.

సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు పంచాయతీరాజ్ రజతోత్సవాల గురించి సమీక్ష చేస్తూ ఐదవ పంచవర్ష ప్రణాళికలో కొత్తగా 3 వేల టీచర్ల ఉద్యోగాలను ఏర్పాటుచేయటానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలియజేశారు.

## పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో తెలుగులో బోధన

### గుంటూరులో విద్యామంత్రి వివరణ

గుంటూరు, డిసెంబరు 28

వచ్చే సంవత్సరంనుంచి తెలుగులో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించనున్నట్లు [illegible] హ్యూమానిటీ, రాజకీయశాస్త్రం చరిత్ర మున్నగు విషయాలను తెలుగులో బోధించనున్నట్లు రాష్ట్ర విద్యామంత్రి శ్రీ యం. వి. కృష్ణారావు వెల్లడించారు.

స్థానిక ఎ. సి. కాలేజీలో నిన్నటినుండి ప్రారంభమైన తెలుగు అకాడమీ ఓరియంటేషన్ వర్కుషాపును ప్రారంభిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

తెలుగు అకాడమీ డైరెక్టరు శ్రీ వెంకటస్వామి అతిథులకు స్వాగతం తెలుపుతూ 220 మందికి పైగా లెక్చరర్లు 5 రోజులు జరుగుతున్న యీ వర్కుషాపులో పాల్గొంటున్నారని తెలిపారు.

విద్యా మంత్రి శ్రీ కృష్ణారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యార్థులు తేలికగా అవగాహన చేసుకోడానికి వీలుగా టెక్స్ట్ పుస్తకాలను తెలుగులోకి అనువదించేందుకు రివ్యూ కమిటీ తోడ్పడాలని సలహా యిచ్చారు.

విదేశీ పరిశోధకులు విశ్వవ్యాపిత అంగీకారానికి ఏ విధంగా దోహదం చేస్తామో వివరిస్తూ ఇవి సదవగాహన పెంపొందించటానికి ఉపయోగ పడతాయని ఆయన తెలిపారు

ఇంగ్లీషు మీడియం విద్యార్థుల కన్నా తెలుగు మీడియం విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్షలలో తమ సమర్థతను ఏ విధంగా రుజువు చేసుకున్నదీ వివరించారు.

ఉద్యోగాలు ఇచ్చుటలో తెలుగు మీడియం విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా సూచించారు.

అధ్యాపకులు తెలుగు మీడియం బోధించేటప్పుడు ఆ విద్యార్థులలో తెలుగు మీడియం పట్ల అనురక్తిని పెంపొందించే మార్గాలను అనుసరించాలని కోరారు.

టెక్స్ట్ పుస్తకాలు చౌక ధరలకు లభ్యమయ్యేలా అవకాశాలు కల్పించాలని తెలిపారు.

ఇందువల్ల, అత్యధికవిద్యార్థులు తెలుగు మీడియం స్వీకరించుటకు ముందుకువచ్చేందుకు కృషి చెయ్యాలనివిద్యామంత్రి సలహా యిచ్చారు.

జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ కాసు వెంగళరెడ్డి సభకు అధ్యక్షత వహిస్తూ ఎకాడమీ అనే పదాన్ని తెలుగులోకి అనువదించాలన్నారు.

## ఆలమూరు తాలూకా కో ఆపరేటివ్ సొసైటీలలో పేదలకు ప్రాతినిధ్యం

ఆలమూరు డిసెంబర్ 27

ఆలమూరు తాలూకాలో కో-ఆపరేటివ్ సొసైటీలకు ప్రభుత్వం కమిటీలను నియమిస్తున్నందున ఈ కమిటీలలో భూస్వామ్య వర్గాల ఏజెంట్లకు, భూస్వామ్య వర్గాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఇవ్వకుండా పేద ప్రజలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

ఇటీవల భూతనఖా బ్యాంక్‌కు నియమించిన కమిటీలో భూస్వామ్య వర్గానికి వారి తాబేదార్లకు ప్రాతినిధ్యం ఎక్కువగా ఇవ్వబడింది

జేకిలో తాలూకా కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్‌కి వచ్చి భూస్వాములతో మంతనాలు జరిపి కమిటీని వేయటానికి పేర్లను తీసికెళ్ళినట్టు తెలుస్తుంది.

అందువల్ల ఈ విషయమై ప్రభుత్వాధికార్లు విచారించి, వేయనున్న కమిటీలలో పేద ప్రజలకు కూడా ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేటట్లు చూడవలసిందిగా కోరుతున్నారు.

# శాంతిని పటిష్ఠం చేయడమే అలీన విధాన లక్ష్యం:

### విదేశాంగమంత్రి చావన్ స్పష్టీకరణ

చండీఘర్, డిసెంబరు 28

అలీన దేశాల ప్రజలకు ఎక్కువగా ఆర్థిక సహాయం రాబట్టటం, ప్రపంచ శాంతిని పటిష్ఠవంతం చెయ్యడం భారత విదేశాంగ విధానం - అలీన విధానం లక్ష్యాలని భారత విదేశాంగ మంత్రి శ్రీ వై. బి. చావన్ చెప్పారు.

భారతదేశ జాతీయప్రయోజనాలదృష్ట్యాను, ఉద్రిక్తతల సడలింపు, వివిధ దేశాల మధ్య అవగాహన, సహకారాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో అలీన విధానం రూపొందించబడిందన్న అంశం, అలీన విధానంపై పరిశీలన జరిపే ఏ అంతర్జాతీయ వాదికైనా అవగాహన అవుతుందని కామగటమారు నగరులో జరగనున్న కాంగ్రెసు 75 వ ప్లీనరీ సమావేశం సందర్భంగా విడుదల చేయనున్న సావనీర్‌కు "భారతదేశ విదేశాంగ విధానంపై" వ్రాసిన వ్యాసంలో తెలిపారు.

అమెరికాతో సత్సంబంధాలు నెలకొల్పుకునే విషయమై భారతదేశం చేస్తున్న ప్రయత్నాలనుగురించి వివరిస్తూ ఆ దేశానికి, మన దేశానికి మధ్య ఎక్కువ ఉమ్మడి అంశాలు కలవనీ, అటువంటి పరిస్థితుల్లో ఆ దేశంతో మనకు సత్సంబంధాలు లేకపోవడానికి కారణం కనబడటంలేదని అన్నారు. మన జాతీయ అవసరాలు, మన భావాలను ఎన్నడూ తగినంతగా అర్థం చేసుకోలేకపోవడం దురదృష్టకరం. ఫలితంగా ఉభయ దేశాల సంబంధాలలో వ్యత్యాసాలు వ్యక్తంఅవుతున్నాయి. కాని మన సంబంధాలను మెరుగు పరుచుకోడానికి వాస్తవ ప్రాతిపదికపైన, ఉజ్జ్వలతో కృషిచెయ్యడం జరుగుతోంది.

భారతదేశంలో సామాన్యుల సాంఘిక, ఆర్థిక పరిస్థితులను అభివృద్ధి పరచడం, జాతీయ భద్రతను పరిరక్షించడం అనే మన దేశ ముఖ్య ప్రయోజనాలు మన విధానాలకు ఎల్లప్పుడూ మార్గదర్శిగా వుంటున్నాయని చావన్ తెలిపారు.

దేశంలో విపరీతంగా వున్న సాంఘిక ఆర్థిక అసమానతలను తొలగించి, సంపద, అభివృద్ధి సమానంగా పంపిణీ జరిగేటట్లు హామీ వుండాలనీ, మన దేశ భౌగోళిక సమగ్రత సర్వం సహాధికారం, స్వాతంత్ర్యానికి ప్రమాదం వాటిల్లకుండా మన జాతి అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు భారతదేశ సరిహద్దుల భద్రత అత్యంత ప్రధానమైన అంశమనీ మన విదేశాంగ విధానం అందుకు గణనీయంగా తోడ్పడుతుందనీ చావన్ పేర్కొన్నారు.

అణ్వస్త్ర దేశాలు ఒకవైపున అత్యంత అధునాతనమైన అణ్వాయుధాలను ప్రవేశపెడుతూనే, శాంతియుత కార్యకలాపాలకై కొనసాగించే అణుపరిశోధనలపై ఏకపక్షంగా, వివక్షా పూర్వకమైన నిర్బంధాలు విధిస్తున్నాయని ఆయన తెలిపారు.

## బి. బి. సి. జర్నలిస్టుల సమ్మె

లండన్, డిసెంబరు 28

బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బి బి సి)కి చెందిన జర్నలిస్టులు రేపు ఒకరోజు సమ్మె జరుపుతారని జర్నలిస్టుల జాతీయ యూనియన్ ప్రకటించింది. బి బి సి టెలివిజన్ న్యూస్ ఎడిటర్స్ సమ్మెలో పాల్గొనక పోవచ్చునని యూనియన్ నాయకులు ప్రకటించారు "వేళకాని వేళల్లో" పని చేసే జర్నలిస్టులకు అదనపు వేతనం చెల్లించే సూత్రాన్ని రూపొందించడాన్ని కోరుతూ సమ్మె జరుపుతున్నారు.

# 1976లోగా పేదలకు భూముల పంపిణీ

## సర్వోదయ కార్యకర్తల సమావేశం నిర్ణయం

పౌనార్, డిసెంబర్ 27

పేదలకు ఇండ్ల స్థలాలు భూములు పంచిపెట్టే జాతీయ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు 1976 వ సంవత్సరాన్ని తుది గడువుగా పెట్టుకోవాలని భూదాన్ కార్యకర్తల సమావేశం నిర్ణయించింది.

సమావేశం ముగింపు సందర్భంగా ఒక ప్రకటన విడుదలచేస్తూ 1976 లోగా భూముల పంపిణీలక్ష్యంపరిపూర్తిచేసేందుకు ఐదు శక్తుల (జనశక్తి, సజ్జనశక్తి విద్వాంసశక్తి, మహాజనశక్తి, శాసనశక్తి) మధ్య ఐక్యత సాధించాలని కోరింది.

మూడు రోజుల భూదాన్ కార్యకర్తల సమ్మేళనం నిర్వహణ కార్యకర్తలలో ఒకరైన శ్రీ నరేంద్ర దూబే ప్రకటనను విడుదలచేస్తూ "ఏకాభిప్రాయం, పార్టీరాహిత్యం రాజకీయాలనుండి స్వేచ్ఛ"పట్ల సమ్మేళనం విశ్వాసాన్ని పునరుద్ఘాటించిందన్నారు.

సమస్యలకు ఆచార్యులు, యోగులు తమ సునిశితమైన నిర్భీతకరమైన, పార్టీరహితమైన అభిరుచులతో అత్యాశ సమాజానికి ఏకాభిప్రాయాన్ని ఒక దృక్కోణాన్ని కలిగించేందుకు అనువైన వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించాలని సమావేశం కోరింది.

త్యాగం, సేవల ఆచరణాన్ని సృష్టించాలని, భూదాన్, గ్రామదాన్, గ్రామస్వరాజ్‌లు అటువంటివాతావరణాన్ని కలిగిస్తాయని శ్రీ దూబే అన్నారు

### రాజకీయ పరిస్థితిపై సమాధానాలకు వినోబాభావే తిరస్కృతి

దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు ఆచార్య వినోబాభావే తిరస్కరించారు

విలేకరులు అడిగిన ప్రశ్నలకు [illegible]పూర్వక సమాధానాలనిస్తూ "రాజకీయాలను గురించి నేను ఆలోచించటంలేదు. ఆత్మ సంబంధమైన తత్త్వ ప్రశ్నలకు మాత్రమే సమాధానమిస్తాను" అని శ్రీ భావే అన్నారు.

అత్యవసర పరిస్థితి కొనసాగింపుపైనా, అనుశాసన అనే అభిప్రాయంపై ప్రస్తుత పరిస్థితికిగల సంబంధంపైన విలేకరులు ప్రశ్నలు అడిగారు.

అనుశాసన్ అనే పదానికి వివిధరకాల వ్యాఖ్యానాలు చేస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా "వారి యిష్టమొచ్చినట్లు వ్యాఖ్యానాలు చెప్పనివ్వండి నేను చెప్పదలచు కొన్నదేమిటో చెప్పాను" అని అన్నారు

సర్వ సేవాసంఘంలో రెండు ముఠాల మధ్య ఐక్యతకు చేస్తున్న ప్రయత్నాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ కొంతమంది ఆ ధోరణిలో ఆలోచిస్తున్నారని శ్రీ భావే అన్నారు

సమీప భవిష్యత్తులో జయప్రకాశ్ నారాయణ్ మిమ్మల్ని కలుసుకుంటారా అని అడుగగా యీ విషయాన్ని జయప్రకాశ్‌యే చెప్పవలసి వుంటుందని శ్రీ భావే తెలిపారు

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ లేక జయప్రకాశ్ నారాయణ్‌లకు సందేశమేమైనా వున్నదా అని ప్రశ్నించగా సందేశమేమీ లేదన్నారు.

భూదాన్ కార్యకర్తల రజతోత్సవ సమావేశ ఫలితమేమిటని ప్రశ్నించగా "సున్నా" అని శ్రీ భావే సమాధానమిచ్చారు.

## సోవియట్ హెలికాప్టర్ విడుదల

పెకింగ్, డిసెంబరు 7

గత సంవత్సరం పొరపాటుగా చైనా భూభాగంలో దిగినందుకు నిర్బంధించిన సోవియట్ హెలికాప్టరును, సిబ్బందిసభ్యులు ముగ్గురిని విడుదల చేసినట్లు చైనా వార్తా సంస్థ ప్రకటించింది

1974 మార్చిలో వాతావరణం సరిగా లేక చైనా భూభాగంలోదిగిన హెలికాప్టరును చైనా అధికారులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారు

హెలికాప్టర్‌ను దాని పరికరాలను తిరిగి డాక్యుమెంట్లను సోవియట్ యూనియన్‌కు అప్పగించినట్లు చైనా తెలిపింది

పొరపాటుగా తాము చైనా భూభాగంలో దిగామనే హెలికాప్టర్ సిబ్బంది ప్రకటనను అంగీకరించినట్లు వార్తాసంస్థ పేర్కొంది.

# క్రీడారంగం

## కర్నాటక, రైల్వే జట్టు సెమీఫైనల్స్‌కు చేరిక

### సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో

కోళికోడ్, డిసెంబర్ 27

ఇక్కడ జరుగుతున్న సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో మొదటి పూల్ నుండి కర్నాటక రైల్వేజట్లు నేడు సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి.

గత సంవత్సరం ఛాంపియన్ షిప్‌ను గెల్చుకున్న బెంగాల్‌జట్టును రైల్వేజట్టు ఒక గోలు తేడాతో ఓడించింది కర్నాటకజట్టు కూడా మహారాష్ట్ర జట్టును ఒక గోలు తేడాతో ఓడించింది

మూడు లీగ్ మ్యాచ్‌లనుండి కర్నాటక, రైల్వే జట్లు చెరినాలుగు పాయింట్లు, మహారాష్ట్రకు మూడు పాయింట్లు, పంజాబ్ జట్టుకు ఒకపాయింట్ వచ్చాయి

అంతకుముందు మహారాష్ట్ర జట్టురైల్వే జట్టును ఓడించింది, పంజాబ్‌తో డ్రా చేసింది

### జాతీయ బ్యాట్‌మింటన్ పోటీలు, సెమీఫైనల్స్‌కు 4 జట్లు చేరిక

బొంబాయిలో జరుగుతున్న జాతీయ బాల్ బ్యాట్‌మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలలో పురుషుల విభాగంలో గత సంవత్సర ఛాంపియన్‌లు తమిళనాడు, రన్నర్స్ రైల్వే కర్నాటక, కేరళ జట్లు నేడు సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి

రేపు జరిగే సెమీ ఫైనల్స్‌లో తమిళనాడు కర్నాటకతోనూ, రైల్వేస్ కేరళతోనూ ఆడతాయి

బాలుర విభాగంలో కేరళ జట్టు గత సంవత్సరం ఛాంపియన్‌లు అయిన ఆంధ్ర జట్టును ఓడించి ఫైనల్స్‌కు చేరుకుంది. నేడు జరిగిన మరో సెమి ఫైనల్స్‌లో మధ్య ప్రదేశ్ జట్టును హైదరాబాద్ జట్టు ఓడించింది

### తెనాలిలో చెడుగుడు పోటీలు

గుంటూరుజిల్లా తెనాలిలో జనవరి 19 నుండి కొంపటి దనుంజయ్య పదవ అఖిల భారత చెడుగుడు పోటీలు నిర్వహించబడతాయి. జూనియర్స్‌కు, సీనియర్స్‌కు పోటీలు విడివిడిగా నిర్వహించబడతాయి

ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు ప్రవేశ రుసుము రు 10 లతో టీము పేర్లను జనవరి 10 వ తేదీ లోపుగా అర్గనైజరుకు పంపాలి

ప్రథమ స్థానం పొందిన వారికి రు 600లతోపాటు రోలింగ్ కప్పు, 2 వ స్థానం పొందిన వారికి రు 450 నగదు బహుమతులివ్వబడతాయి

3, 4, 5, 6 వ స్థానం పొందిన వారికి కూడా నగదు బహుమతులు ఇవ్వబడతాయి.

### దక్షిణ మండలం జట్టుచే 6 వికెట్ల నష్టానికి 304 పరుగులు

మద్రాసు, డిసెంబరు 27

దక్షిణ మండలం, ఉత్తర మండలంల మధ్య నేడిక్కడ ప్రారంభమైన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ ఫైనల్స్‌లో ఆట ముగిసే సమయానికి దక్షిణ మండలంజట్టు 6 వికెట్ల నష్టానికి 304 పరుగులు సాధించింది

దక్షిణ మండలం జట్టు కెప్టెన్ వెంకటరాఘవన్ టాస్ గెల్చి బ్యాటింగ్‌ను ఎన్నుకున్నారు. రోజర్ బిన్నీ, కృష్ణస్వామి బ్యాటింగ్‌ను ప్రారంభించి మొదటి వికెట్‌కు 102 పరుగులు చేశారు

ఉత్తర మండలంజట్టులోని స్పిన్ బౌలర్ రాజేందర్ గోయల్ 74 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టారు. ఉత్తర మండలం కెప్టెన్ బేడి ఒక వికెట్‌ను కూడా తీసుకోలేకపోయారు.

ఆట ముగిసే సమయానికి బ్రిజేష్ పటేల్ 60 పరుగులతోనూ, కిర్మాని 22 పరుగులతోనూ ఔట్ కాకుండా వున్నారు.

### ఆస్ట్రేలియాచే 4 వికెట్లకు 270 పరుగులు

మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో నేడు రెండవరోజు ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది.

నిన్న మొదటి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ జట్టు 224 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

ఆస్ట్రేలియా ఆటగాడు రెడ్‌పాత్ 102 పరుగులు చేయటం నేటి విశేషం.

నేడుఆటముగిసే సమయానికి కోసియర్ 44 పరుగులతోనూ, చాపెల్ 42 పరుగులతోనూ ఔట్ కాకుండా వున్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీ

గుంటూరు, డిసెంబరు 27

గుంటూరు ఫిలిం ఆర్ట్స్ అసోసియేషన్ వారిచే స్త్రీలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీ ఏర్పాటు చేయబడింది. ఈ పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు ఇవ్వబడతాయి.

ముగ్గులు పంపువారు 11×[illegible] అం॥ డ్రాయింగ్ పేపరు మీద ఇండియన్ ఇంక్‌తో ముగ్గులువేసి జనవరి 10 లోగా శ్రీ రూప చంద్రరావు, కార్యదర్శి ఫిలిం ఆర్ట్స్ అసోసియేషన్ పాతగుంటూరు, గుంటూరు 522001 చిరునామాకు పంపాల్సివుంది.

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి మెమొరాండం

ఏలూరు, డిసెంబరు 27

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీ [illegible] శ్రీరామమూర్తి ఈ నెల 25 న [illegible]వచ్చిన సందర్భంగా పట్టణ విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ యస్. బ్రహ్మణాచారి విద్యార్థుల తరఫున ఒక మెమొరాండం సమర్పించారు

ఈ మెమొరాండంలో పట్టణంలో 4 హైస్కూళ్ళు, ఒక పీ యూ సీ కాలేజి జూనియర్ కాలేజి కలవని, హరిజన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా వున్నందున ప్రస్తుతం హరిజన బాలుర హాస్టల్‌లోవున్న సీట్ల సంఖ్య చాలనందున అనేకమంది విద్యార్థులు తిరిగి పోతున్నారని, అందువల్ల హరిజన హాస్టల్లో సీట్ల సంఖ్యను పెంచాలని, బాలికల హాస్టల్ ప్రస్తుతం హరిజన హాస్టల్ భవనంలో నడుస్తున్న బాలికల సంఖ్యను 40 నుంచి 70 కు పెంచాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు

## దొంగరవాణా చేస్తున్న 17 బస్తాల చక్కెర స్వాధీనం

రాపూరు, డిసెంబరు 27

ఇటీవల కొందరు రాజులనుంచి కొంతమంది వ్యాపారులు, చక్కెర డీలర్ల వద్దనుండి కొనుగోలు చేసి వెంకటగిరి తదితర ప్రాంతాలకు దొంగరవాణా జరుపుతున్న విషయాన్ని గురించి ప్రజలిచ్చిన సమాచారంపై స్థానిక తహసీల్దారు శ్రీ టి. కె. నరసింహారావు అక్రమంగా రవాణా అవుతున్న 17 బస్తాల చక్కెరను స్వాధీనం చేసుకొన్నారు

దీనిపై తహసీల్దారు, ఆర్. డి. వో. దర్యాప్తు జరుపుతున్నారు.

# నూతక్కి ఏరియాలో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం

మంగళగిరి, డిసెంబరు 28

ఇటీవల పగలు, రాత్రి విద్యుత్ సరఫరా ఆపి వేస్తున్నందువల్ల గుంటూరు జిల్లా నూతక్కి ఏరియాలో కొన్నివేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది.

గత వారంరోజుల నుండి ఉదయం 6 గంటల ప్రాంతంలోనే కరెంటు సరఫరా ఆపివేస్తున్నారు. రాత్రి ఎనిమ్మిది పదిగంటల ప్రాంతానికికానీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంలేదు ఫలితంగా నీరు పెట్టడం సాధ్యంకానందున కొన్నివేల ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. అరటి, పసుపు, మిరప, చెరకు, తమలపాకు, కాలీఫ్లవర్ తోటలకు నీరు పెట్టడం సాధ్యం కాకుండా పోతున్నది. ఎప్పుడో రాత్రి 10 గంటల ప్రాంతంలో కరెంటువచ్చినా చలి విపరీతంగా ఉంటున్నది కాబట్టి రైతాంగం అప్పుడు పొలాలకు వెళ్ళి నీరు పెట్టాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు నీరు అందక కొన్ని పొలాలు చలికి బిగుసుకొని బీటలు వారిపోతున్నాయి.

ఈ సంవత్సరం వరి పంట కూడా అంతంత మాత్రంగానే పండింది. ఎకరానికి పది పన్నెండు బస్తాలకంటె ఎక్కువ దిగుబడి రాలేదు. వీటికి తోడు ఇప్పుడు చెరకు, పసుపు పంటలకు తెగులు సోకింది

## అసిఫాబాద్ తాలూకాలో పంట నష్టం

ఈ సంవత్సరం నవంబరు మాసం ఆఖరు వరకు విపరీతమైన వర్షాలు పడినందువల్ల అసిఫాబాద్ తాలూకాలో ఖరీఫ్ పంట బాగా దెబ్బతిన్నది. మొక్కజొన్న, పెసరపంట బాగా దెబ్బతిన్నాయి. ఈ తాలూకాలో జొన్న, ఆముదంపంటలు కూడా సరిగా పండలేదు

## నర్సయ్య విజ్ఞప్తి

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే రైతాంగానికి సాయపడాలని తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పి. నర్సయ్య ఇటీవల ఒక ప్రకటనలో కోరారు.

భూమిశిస్తు వసూలు ఆపాలని, రుణాలు ఇవ్వాలని వాణిజ్య పంటల పన్ను మినహాయించాలని ఆయన కోరారు.

పంట దెబ్బకు తోడు ఈ [illegible] ప్రాంతంలో మలేరియా, విష జ్వరాలు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి

## కూలి సమస్య

వెనుకబడిన కార్మికులకు రోజుకు పురుషులకు రు 3 స్త్రీలకు రు. 2 మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన రేటుకంటే యిదిచాలా తక్కువని అధికారులు ఈ విషయమై తగిన చర్య తీసుకోవాలని శ్రీ నర్సయ్య కోరారు.

# 5 లక్షల ఉద్యోగాల పథకం క్రింద టీచర్ల సమస్య

### త్వరలో పరిశీలన

హైదరాబాదు, డిసెంబరు 10

5 లక్షల ఉద్యోగాల పథకం క్రింద నియమింపబడిన టీచర్ల భవిష్యత్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నిర్ణయము తీసుకోనుంది

విద్యాశాఖ మంత్రి శ్రీ యం. వి. కృష్ణారావును కలుసుకొన్న టీచర్ల ప్రతినిధి వర్గానికి మంత్రి హామీ యిచ్చినట్లు నేషనల్ స్టూడెంట్సు యూనియన్ ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ జలీల్‌పాషా నేడు తెలియజేశారు.

ఈ టీచర్లకు గత 30 నెలల నుండి నెలకు రు. 150 స్టయిపెండ్ మాత్రమే చెల్లించబడుతున్నది వారి సర్వీసులు యింతవరకు క్రమబద్ధం చేయడం కూడా జరగలేదు.

# వరికోతల ద్వారా 50 బస్తాల ధాన్యం నిధి

### దేవరకొండ తాలూకాలో

హైదరాబాద్ డిసెంబరు 27

దేవరకొండ తాలూకాలోని 13 గ్రామాలకు చెందిన 1300 మంది వ్యవసాయ కార్మికులు 50 ఎకరాల్లో వరికోత కార్యక్రమం సాగించి సంపాయించిన 50 బస్తాల ధాన్యాన్ని కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు

దుద్రాయగూరం గ్రామంలో వరి కోతల కార్యక్రమానికి శాసన సభ్యులు శ్రీ బి రామశర్మ, పడమటపల్లి గ్రామ దళానికి దేవరకొండ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ పల్లా పర్వతరెడ్డి, గిడియ గౌరారం దళానికి తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ ఏ నారాయణరావు నాయకత్వం వహించారు

బొగ్గుమన్నె గ్రామంలో 200 మంది శ్రీ వాసుదేవ్ నాయకత్వాన 18 ఎకరాల్లో వరి కోశారు. ఇదింపల్లి, పావికొండ్లు, దుద్రాయిగూడెం, రహమంతపురం, ఇన్నాపురం, వేమంతలపల్లె, తిప్పనాయనపల్లె, మూండ్లగూడెం, మల్లేపల్లి, పోటుమాను, గడిపల్లి గ్రామాలలో వరికోతల ద్వారా నిధి సేకరణ జరిగింది. కమ్యూనిస్టుపార్టీ, యువజన సమాఖ్య సభ్యులు అనేకమంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# సత్తుపల్లి తాలూకాలో ముఖ్యమంత్రి పర్యటన

కల్లూరు, డిసెంబరు 27

సత్తుపల్లి తాలూకా చౌడవరం గ్రామంలో రోటువాగువద్ద చెరువుకు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు పునాది రాయి వేశారు

రు. 6 లక్షల వ్యయంతో సాగే ఈ పథకంవల్ల 600 ఎకరాలకు నీరు లభిస్తుంది ఇది ప్రధానంగా గిరిజనులకు ప్రయోజనకారి.

శంకుస్థాపన సందర్భంగా 26 వ తేదీన జరిగిన సభకు నీటి పారుదల మంత్రి శ్రీ అనం వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. గత మూడు నెలల్లో ఇరిగేషన్‌కు ప్రభుత్వం రు 12 కోట్లు వెచ్చించిందన్నారు

గ్రామస్థులు కోరిన విధంగా చెరువు మట్టాన్ని రెండు అడుగులు పెంచుతామనీ, గిరిజనులకు రుణాలు యిస్తామని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు

చీఫ్ ఇంజనీరు శ్రీ పి ఆర్ గోపాలకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. గిరిజన సంక్షేమ మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గిరిజనాభివృద్ధి గురించి వివరించారు

శ్రీ ఎం. శివరామయ్య వందనసమర్పణ చేశారు

## ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్

అనంతరం అశ్వారావుపేటలో ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు ఇది 64 గ్రామాలకు, 300 క్లస్టర్ ట్యూబ్‌వెల్స్‌కు విద్యుత్ సరఫరా చేస్తుంది.

ఈ సందర్భంగా జరిగిన సభకు విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు విద్యుత్‌బోర్డు చైర్మన్ శ్రీ యన్. తాతారావు స్వాగతం పలికారు. విద్యుత్‌బోర్డు ఉద్యోగుల ప్రవాహ సహాయ నిధికిచ్చిన రు 3 లక్షల చెక్కును ఆయన ముఖ్యమంత్రి కిచ్చారు

రైతుల నుండి చెల్లింపు ఆశించకుండా ట్యూబ్‌వెల్స్‌కు వెంటనే విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆ చెల్లింపును ప్రభుత్వమే సబ్సిడీగా యిస్తుందన్నారు. భారత గ్రామీణ విద్యుదీకరణ అధ్యక్షులు శ్రీ బుర్రా వెంకటప్పయ్య నాయుడికి ముఖ్యమంత్రి కృతజ్ఞత తెలిపారు స్పెషల్ ఆఫీసర్ శ్రీ బసవరాజు వందన సమర్పణ చేశారు.

సభకు మంత్రులు శ్రీయుతులు భాట్టం శ్రీరామమూర్తి, సాగి సూర్యనారాయణ రాజు, అనం వెంకటరెడ్డి, యస్. టి సి చైర్మన్ శ్రీపున్నయ్య, ప॥గో॥జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ అల్లూరి బాపినీడు, మాజీ చైర్మన్ శ్రీ జె. కొండలరావు, శ్రీ జలగం ప్రసాదరావు, శ్రీ టి వెంకటప్పయ్య ఎం. ఎల్. ఏ), వంగా సుబ్బారావు (ఎం. ఎల్. ఏ) హాజరయ్యారు

రు 2 18 లక్షల భూతనఖా బ్యాంకు రుణాలు, రు 4 64 లక్షలు సహకార బ్యాంకు రుణాలు రు. 1 35 లక్షల చేతి వృత్తి రుణాలు, 2673 ఎకరాలకు 1201 పట్టాలను సత్తుపల్లి తాలూకా పేదలకు ముఖ్యమంత్రి పంచారు

# ఖమ్మం జిల్లాలో భూములకు, నివేశన స్థలాలకు పట్టాలు

### ముఖ్యమంత్రిచే పంపిణీ

ఖమ్మం డిసెంబరు 27

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు డిసెంబరు 21 నుండి 24 వ తేదీవరకు ఖమ్మం జిల్లాలో జరిపిన పర్యటన సందర్భంగా ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, బూర్గంపాడు భద్రాచలం తాలూకాలోను మొత్తం 3,272 మంది భూమిలేనిపేదలకు 6 077 ఎకరాల భూమికి పట్టాలు బలహీన వర్గాలవారికి 4 481 నివేశన స్థలాలకు పట్టాలు పంపిణీచేసినట్లు కలెక్టరు శ్రీ పి. ఆర్ కే ప్రసాద్ పత్రికలవారికి చెప్పారు 3 674 మంది చిన్న, మధ్యతరగతి రైతాంగానికి స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు రు.50 21లక్షలు రు 29 52 లక్షలు వాణిజ్య బ్యాంకులద్వారా షెడ్యూల్డుకులాలకు షెడ్యూల్డుతెగలకు రు 2) 62 లక్షలు దీర్ఘకాలిక రుణాలు యిచ్చారు. ఫైనాన్స్ కార్పొరేషన్ 560 మందికి రు 10 24 లక్షలు, గ్రామీణ పారిశ్రామిక ప్రాజెక్టు క్రింద రు. 4 31 లక్షలు సమగ్ర ఆదివాసి అభివృద్ధి సంస్థ రుణాలు, రు 2 30 లక్షలు మొత్తం రు 96 లక్షలు రుణాలు యిచ్చినట్లు తెలిపారు (వి. వి.)

# లఘు పరిశ్రమల ఏర్పాటుకు రు. 7.65 లక్షలు

హైదరాబాద్, డిసెంబరు 27

చిత్తూరు, కడప జిల్లాలలో స్వయం ఉపాధి కల్పనా పథకం క్రింద లఘు పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ లఘు పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ రు 7 65 లక్షలుమంజూరు చేసిందని నిన్న ఇక్కడ విడుదలచేసిన అధికార ప్రకటన తెలిపింది.

# గ్రామీణ విద్యుదీకరణ సత్వరం పూర్తిచేయాల్సిన ఆవశ్యకత

### భారత రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ డిసెంబరు 26

స్వాతంత్ర్య సాధనానంతర కాలంనుండి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై కొనసాగించబడుతున్న గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమం అమలు జరిగిన ప్రాంతాల్లో ఎంతగానో సాంఘిక ఆర్థిక పరివర్తన జరిగిందని రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ నేడిక్కడ చెప్పారు

ఇంకా మూడింట రెండు వంతుల గ్రామాలలో, ఇళ్ళలోను వీధులలోను విద్యుద్దీపాలు వెలిగించుకోడానికి ఉత్పత్తి యంత్రాలు తిప్పడానికి ప్రాథమిక విద్యుత్ సౌకర్యాలు కలిగించవలసి వుందని చెప్పారు.

గ్రామీణ విద్యుదీకరణను త్వరితం చెయ్యడానికి సర్వతోముఖ కృషి జరగాలని విద్యుత్ ఇంధనం వినియోగంపై యిక్కడ జరిగిన జాతీయ గోష్టి ప్రారంభిస్తూ చెప్పారు.

గ్రామీణ విద్యుదీకరణను త్వరితంచేసే సమస్య ఎన్నో క్లిష్టమైన సవాళ్ళతో కూడుకొని వుందని, అదొక బృహత్తర కార్యక్రమమని తెలుపుతూనే గోష్టిలో పాల్గొన్న ప్రభుత్వ నాయకులు, పారిశ్రామిక వేత్తలు రాష్ట్రపతి చెప్పిన అంశాలను బలపరిచారు.

గ్రామీణ విద్యుదీకరణ ఫలితంగా గ్రామీణ జీవితంలో తలెత్తిన నూతన వ్యత్యాసాలు, వైరుధ్యాలు ఏ విధంగా తలెత్తిందీ వారు తెలిపారు.

# పేదరికం నిర్మూలనకు శాస్త్ర విజ్ఞానం

### — డాక్టర్ మహాజన్

హైదరాబాద్, డిసెంబరు 26

పేదరికాన్ని నిర్మూలించే కలను నిజం చేయాలంటే అది శాస్త్ర విజ్ఞానానికే సాధ్యమని పూనా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. ఎస్. మహాజన్ అన్నారు.

మూడు రోజులపాటు జరిగే మరాఠీ విజ్ఞాన సమ్మేళన్ ప్రారంభ సభకు ఆయన నిన్న అధ్యక్షత వహించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చికి చెందిన ప్రొఫెసర్ ఉద్‌గోకర్ ప్రారంభోత్సవం జరిపారు.

స్వాతంత్ర్యానంతర ఆర్థిక సమస్యలను అధిగమించేందుకు దేశం కృషి చేస్తోందని మహాజన్ అన్నారు. భూత వైద్యాలు, నరబలులు అక్కడక్కడా సతీసహగమనాలు కూడా జరుగుతున్నప్పటికీ శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత్ ఎంతో పురోగమించింది [illegible] ప్రార్థనలు నిర్మూలించ లేక పోయాముగానీ శాస్త్రం [illegible]. నిత్య జీవితంలో శాస్త్రీయ దృష్టి పెంపొందించేందుకు ప్రాథమిక పాఠశాలలనుండి 8 అంశాల కార్యక్రమం చేపట్టాలి.

ఎందుకంటే దేశంలో 6 లక్షల గ్రామాలున్నాయి. ఈ కార్యక్రమంలో టీచర్లకు ప్రధానపాత్రవుంది.

పరిశోధనా సంస్థలకూ, ప్రజలకూ మధ్య సంబంధాలను పటిష్టం చేయాలని శ్రీ ఉద్‌గోకర్ అన్నారు.

# 'సిండికేట్ బండారం బయటపడింది'

### —హితేంద్రదేశాయ్

అహ్మదాబాద్, డిసెంబర్ 26

సిండికేట్ ఒక ప్రత్యేకమైన పార్టీగా కొనసాగుతుందని గుజరాత్ నాయకులు పలుకుతున్న డంబాల బండారం ఎస్. కె పాటిల్ ప్రకటనలో బయటపడిందని పి సి.సి అధ్యక్షులు శ్రీ హితేంద్రదేశాయ్ అన్నారు.

ప్రతిపక్షాలన్నీ రద్దయి ఒకే పార్టీగా ఏర్పడాలని చెప్పిన పాటిల్ సిండికేట్ కొనసాగింపు గురించిన వ్యవహారాలన్నిటినీ తేల్చేశాడని నిన్న ఒక ప్రకటనలో శ్రీ దేశాయ్ చెప్పారు. "ఇప్పుడిక సిండికేట్ కార్యకర్తలకు రెండే మార్గాలున్నాయి వారు ఇటు కాంగ్రెసులో నన్నా చేరాలి, లేదా పాటిల్ చెప్పిన ప్రతిపక్ష పార్టీలో నన్నా చేరాలి" అన్నారు.

# ఫోర్డుపై అమెరికా రైతుల ధ్వజం

న్యూయార్క్, డిసెంబరు 27

సోవియట్ యూనియన్‌కు ధాన్యం ఎగుమతిపై ఫోర్డు అనూహ్యంగా విధించిన నిషేధాన్ని అమెరికాలో (రిపబ్లికన్ అనుకూల) రైతులు నిరసిస్తూ ఆందోళన చేస్తున్నారు.

దీనివల్ల వచ్చే జనవరినుండి జరగబోయే ప్రాథమిక ఎన్నికల్లో ఫోర్డు అవకాశాలు దెబ్బతినవచ్చునని న్యూయార్కునుండి పి. టి ఐ విలేకరి చక్రపాణి రాస్తున్నారు

గత ఆగస్టులో అర్ధాంతరంగా ధాన్యం ఎగుమతిపై నిషేధం విధించడంవల్ల తీవ్రమైన నష్టాలు వచ్చాయని రైతులు చెప్తున్నారు. ఉన్న మొత్తం భూమిలో నాట్లు వేసుకోవచ్చునని ప్రభుత్వం ఎగుమతి ఆంక్షలు విధించబోదనీ చెప్పి తమను మోసంచేశారని వాదిస్తున్నారు.

అక్టోబర్‌లో ఎగుమతి నిషేధం ఉపసంహరణ అంతా చేయిదాటిపోయింతర్వాత చేశారు. ఈలోగా గోధుమ, జొన్న ధరలు విపరీతంగా పడిపోయాయి. ఇప్పుడు జొన్న ధరలు వసంతకాలం ముందుకంటె 30-25 శాతం తక్కువగా ఉన్నాయి.

# గిరిజన ప్రాంతాల్లో లెవీ సేకరణకు నిర్ణయం

### మంత్రి శ్రీభాట్టం వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 27

విశాఖపట్నం శ్రీకాకుళం, ఆదిలాబాదు జిల్లాలోని గిరిజన రైతులనుండి 1000 టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి దారుల లెవీని సేకరించడానికి ఆంధ్రప్రదేశ్ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ నిర్ణయించిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి శ్రీ భాట్టం శ్రీ రామమూర్తి తెలిపారు

గిరిజన సంక్షేమశాఖ, లెజిస్లేటివ్ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ప్రసంగిస్తూ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించుటకు ఒక కోటి రూపాయల రుణం పొందుటకు రిజర్వు బ్యాంకుకు హామీగా వుండాలని రాష్ట్రప్రభుత్వాన్ని కార్పొరేషన్ కోరిందని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో గోదాములు నిర్మాణానికి కార్పొరేషన్ ఇప్పటికే జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ నుండి రు. 25 లక్షల రుణ సహాయం పొందడం జరిగిందని ఆయన తెలిపారు.

# పెన్షన్ కేసుల పరిష్కారంలో విపరీత జాప్యం

హైదరాబాద్, డిసెంబరు 27

పెన్షన్ కేసులను పరిష్కరించడంలో జరుగుతున్న విపరీత జాప్యాన్ని ఆర్థిక మంత్రి శ్రీ పి. రంగారెడ్డి తీవ్రంగా విమర్శించారు.

క్రితం ఇందుకు సంబంధించిన అధికారుల సమావేశం జరిగిన తరువాత ప్రభుత్వం పెన్షన్ మంజూరుకు సంబంధించిన విధానాలను సులభతరం చేసినప్పటికీ, పరిస్థితి అప్పటికన్నా ఇంకా క్షీణించిందని నేడు జరిగిన అధికారుల సమావేశంలో ఆయన అన్నారు

ఉద్యోగి రిటైర్ అయిన నెలలోపల పెన్షన్ చెల్లించాలని ఆయన అన్నారు.

కొన్ని పెన్షన్ కేసులు గత 12 ఏండ్లుగా పెండింగ్‌లో వుండటంపట్ల ఆయన విచారం వ్యక్తంచేసి, ఇందుకు బాధ్యులైన అధికారుల నుండి సంజాయిషీ కోరవలసిందిగా ఆయన ఆర్థిక శాఖను ఆదేశించారు.

ప్రతి సంవత్సరం 10 వేల మంది ఉద్యోగులు రాష్ట్రంలో రిటైర్ అవుతుంటారని, పెన్షన్ మంజూరులో జాప్యంవలన వారు బాధలు పడాల్సి వస్తుందని ఆయన అన్నారు.

# డిప్యూటీ కమాండెంట్ శ్రీ సుబ్బయ్య మృతి

హైదరాబాద్ డిసెంబరు 26

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు నాల్గవ బెటాలియన్ (వరంగల్) డిప్యూటీ కమాండెంట్ శ్రీ కె యం సుబ్బయ్య గతరాత్రి గుండెపోటువల్ల మరణించారు.

రాష్ట్ర పోలీసుల క్రీడోత్సవాలలో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు.

# తుది మెరుగులు దిద్దుకుంటున్న అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన

హైదరాబాద్, డిసెంబరు 28

జనవరి 1 వ తేదీ నుండి ప్రారంభం కానున్న "అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన" ఇక్కడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తుది మెరుగులు దిద్దుకుంటున్నది

ఇప్పటికే వందలాదిస్టాల్స్ నిర్మించారు. ప్రదర్శనను ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు జనవరి 1 వ తేదీ సాయంత్రం ప్రారంభోత్సవం చేస్తారని ఎగ్జిబిషన్ కమిటీ ముఖ్యులు మొన్న ఇక్కడ జరిపిన పత్రికా గోష్ఠిలో తెలియజేశారు

ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ప్రధానమంత్రి ప్రకటించిన 20 అంశాల ఆర్థిక కార్యక్రమం ప్రాతిపదికగా ఆయా రంగాలలో సాధించిన ప్రగతి, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలు, వాటిని ప్రతిబింబించే విధంగా వుంటాయని కమిటీ వర్గాలు తెలిపాయి

ప్రధానంగా పారిశ్రామికంగా చిన్న, మధ్యతరహా, ఖాదీ పరిశ్రమలు మన రాష్ట్రంలోని పరిశ్రమలకు అద్దంపట్టే విధంగా ప్రదర్శనకు రూపు దిద్దుతున్నారు.

రాష్ట్రంలోని పారిశ్రామికాభివృద్ధి సంస్థలన్నీ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. పారిశ్రామిక శాఖ కూడా ఒక పెవిలియన్‌ను నిర్వహిస్తున్నది.

ప్రపంచ తెలుగు మహాసభ, జంటనగరాల అభివృద్ధి సంస్థకూడా స్టాల్స్‌ను తీసుకున్నాయి

ఎగ్జిబిషన్ కమిటీ తాను నిర్వహిస్తున్న 10 విద్యాసంస్థలకు ప్రతి సంవత్సరం రు. 6 లక్షలు మంజూరు చేస్తున్నది. రు 20 వేల ఖర్చుతో డిస్పెన్సరీ నడుపుతుంది. ఈ డబ్బంతటిని ఎగ్జిబిషన్ నిర్వహణద్వారా సొసైటీ సంపాదిస్తున్నది.

ఎగ్జిబిషన్ జరుగుతున్న సమయంలో అనేక క్రీడలు, ఇంకా ఎన్నో పోటీలు జరుగుతాయి.

మహిళలకు ప్రత్యేకంగా మూడురోజులు కేటాయించారు చిన్న పెద్ద వాణిజ్య సంస్థలకు 1600 స్టాల్స్ యిచ్చామని కమిటీ వర్గాలు తెలిపాయి.

అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు స్టాళ్ళను నిర్వహిస్తున్నాయి

కాశ్మీర్, పంజాబ్, హర్యానా, అస్సాం, ఒరిస్సా, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన అనేకసంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి

వైద్య పరీక్షలకుకూడా ఏర్పాట్లు చేశారు రూపాయి చెల్లించి ఎవరైనా వైద్య పరీక్ష చేయించుకోవచ్చును అయిదు రూపాయలు చెల్లించినట్లయితే, ఎక్స్‌రే, ఇ సి జి పరీక్ష అదనంగా జరుపుతారు

# శ్రీ ఆకాశపు కోటయ్య మృతి

నర్సాపురం, డిసెంబరు 26

పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం హేండ్‌లూంవర్కర్సుయూనియన్ నాయకులు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు అయిన శ్రీ ఆకాశపు కోటయ్య 24 వ తేదీ రాత్రి రక్తపు వాంతి చేసుకొని మృతిచెందారు.

గత 12 సంవత్సరాలుగా చేనేత ఉద్యమంలోను, ఎనిమిది సంవత్సరాలుగా కమ్యూనిస్టు కార్యకర్తగాను పనిచేస్తూ చేనేత వారి ఆదరాభిమానాలను ఎక్కువగా చూరగొన్నారు. వీరివయస్సు 48 సంవత్సరాలు. ఈయన మరణవార్త వినగానే వందలాది చేనేతకార్మిక స్త్రీ-పురుషులు దుఃఖంతో విలపించారు

ఎర్ర జండాలతోను, పూల మాలలతోను అంతిమయాత్ర జరిగింది

స్మశానవాటికలో శ్రీ బళ్ళకోటమల్లయ్య అధ్యక్షతన సంతాప సభ జరిగింది సద్గురు గంగరాజు ఆయన జీవిత విశేషాలను వివరించారు. సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించబడింది.

(వి. వి)

# రేడియో

మంగళవారం డిసెంబరు 30

శక 1897 ⁂ పుష్య 9

## హైదరాబాద్ (ఏ)

405.4 మీ. (740 కి. హె).

6.00 వందే మాతరం; 6-10 భక్తిరంజని. తరంగాలు; 6-55 చైతన్య రథం; 7-15 జానపద గేయాలు; 7-30 చిత్రసీమ- ప్రేమనగర్, శారద, సీత-విజాయితీ; 8-30 పద్మాస్వామినాథన్, గానం; 12-05 పద్మాస్వామినాథన్, గానం; 12-20 హిందీపాఠం; 1.00 చిత్రసీమ- పెద్దలుమారాలి, కథానాయకునికథ, అనురాగం; 5-20 ఈ పాట నేర్చుకుందాం; 5.45 సంగీతసుధ, నేతు రామన్, పొన్నుస్వామి నాదస్వరం; 7-45 ఈ నాటి విషయం; 8.00 నాటిక; 8-45 గీతమాలిక; 9-15 స్పాట్‌లైట్; 9.30 సంగీతోత్సవం - (మద్రాసు నుండి); 11-00 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

## విజయవాడ

357 1 మీ. (840 కి. హె)

6-00 వందే మాతరం, శుభోదయం ప్రసార విశేషాలు; 6-05 భక్తి రంజని - తిరుప్పావై - సప్తపది, రామదాసుకీర్తనలు ఆంజనేయస్తుతి; 6.55 ప్రబోధం; 7-15 జానపద గేయాలు; 7 45 చిత్రతరంగిణి- 8-30 ఎస్ ఎస్. రామకృష్ణశాస్త్రి - వయొలిన్; 11-45 చిత్ర తరంగిణి - మా ఊరి గంగ, జమీందారుగారి అమ్మాయి, రాం-రహీం ఆడపిల్లతండ్రి; 12 05 ఎస్. ఎస్. రామకృష్ణశాస్త్రి, వయొలిన్; 1-00 చిత్రతరంగిణి; 2-10 చిత్రతరంగిణి. 5-30 సంగీతశిక్షణ, (దేశభక్తిగేయం); 6-30 యువవాణి; 7.45 హైదరాబాద్ వలె. 7-55 చెణుకులు; 8-00 నాటిక; 8-30 పొన్నా - పొగడ; 9-15 స్పాట్‌లైట్; 9-30 జాతీయ కార్యక్రమాల్లో సమీక్ష; 9.45 సంగీతోత్సవం, (మద్రాసునుండి); 11-00 ప్రసార సమాప్తి

## విశాఖపట్టణం

322.6 మీ. (936 కి. హె.)

ప్రసారము - I

6-00 వందేమాతరం, శుభోదయం, మంగళధ్వని, 6-15 భక్తిరంజని - తిరుప్పావై - సప్తపది, హనుమాన్ చాలీసా, సర్వేశ్వర శతకమునుండిపఠనం, పుష్పాంజలి భక్తిగేయాలు-రహస్యం; 7-30 విలయ కళాకారుల వాద్యగోష్ఠి

ప్రసారము - II

12 00 మధుమంజరి-ఆదర్శకుటుంబం, బందిపోటుదొంగలు, చందన, లక్ష్మీనివాసం, మనుషులు, మట్టిబొమ్మలు, రంగేలీరాజా, పాండవ వనవాసం; 1-20 వాతావరణ సూచన, మధురిమ - బంగారుకలలు, చీకటి వెలుగులు, ధనమా-దైవమా.

(I, II ప్రసారాలలో మిగతా కార్యక్రమాలు విజయవాడ వలె)

ప్రసారము - III

6.55 ఉషఃకాంతులు; 8-30 కన్నీటి బతుకులు-మూ జీవితాలు, రెండవభాగం, వేశ్యగామారిన స్త్రీతో పరిచయం; 9-30 సంగీతోత్సవం (మద్రాసునుండి)

(మిగతా కార్యక్రమాలు హైదరాబాద్ వలె)

## కడప

(333-3 మీ. 900 కి. హె.)

ప్రసారము - I

6-00 వందేమాతరం; 7.30 చిత్రాంజలి; 7.45 సంగీతామృతం, టి ఎస్. కృష్ణన్, వయొలిన్; 8-20 కర్ణాటకసంగీతం;

ప్రసారము - I

12-05 కర్నాటక సంగీతం- కె ఎస్ నారాయణస్వామి-వీణ; 1-10 చిత్రజగత్తు;

ప్రసారము - II

5-30 కర్నాటక సంగీతం - టి. ఎస్ రాజరత్నం పిళ్ళై, నాదస్వరం. 7.45 చిత్రసీమ; 8 30 అభిరుచి.

(మిగతా కార్యక్రమాలు హైదరాబాదు వలె;

# విద్యాశాఖ అధికారిచే నాన్‌ఫార్మల్ విద్యా కేంద్రాల సందర్శన

మొవ్వ, డిసెంబరు 27

కృష్ణాజిల్లా మొవ్వ పంచాయతీ సమితిలో గల ఆరు నాన్ ఫార్మల్ విద్యా కేంద్రాలను రాష్ట్ర విద్యా మండలి పరిశోధక సంస్థ డైరెక్టరు శ్రీ ఎ. గోపీనాథరావు ఈ నెల 15 వ తేదీన తనిఖీచేశారు. మొవ్వసమితిలో 38 నాన్ ఫార్మల్ విద్యా కేంద్రాలలోను 14 స్త్రీలకు 19 పురుషులకు, 5 బాల-బాలికలకు ఏర్పాటు చేయబడ్డాయి. అయ్యంకి, పెదపూడి, శ్రీకాకుళంలలో గల ఆరు కేంద్రాలను డైరెక్టరు తనిఖీచేసి యీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించబడుతున్నందుకు విద్యాశాఖ అధికారులను, సమితి వారిని అభినందించారు కేంద్రాలకు చేరిన సభ్యుల అభిరుచినిబట్టి విద్యాబోధన జరగాలని, సామాన్య భాషలోనే విద్య గరపాలనీ ఆయన సలహా యిచ్చారు జిల్లా విద్యా శాఖాధికారి శ్రీ డి వి వెంకటసుబ్బయ్య దివి తాలూకాలో 7 కేంద్రాలు నిర్వహించబడుతున్నాయనీ, బందరు తాలూకాలో కూడా యివి ప్రారంభించబడి పుత్సాహంగా పనిచేస్తున్నాయని అన్నారు

తరువాత శ్రీ కాకుళం పరిషత్తు హైస్కూలులో ఉపాధ్యాయులచే తయారు చేయబడిన కళాశిల్పాలను చార్టు చిత్రములను డైరెకరు దర్శించి అవి బాల బాలికలకు ఉపయోగపడునట్లు తయారు చేయాలని ప్రధానోపాధ్యాయులు శ్రీ యస్ వెంకట్రామయ్యకు సలహా యిచ్చారు శీలంవారిపాలెంలో నిర్వహించబడుతున్న విద్యాకేంద్రమునకు సమితి వుపాధ్యాయులు శ్రీ టి కుమారస్వామి నాయుడు విరాళముగా యిచ్చిన పరికరములను డైరెక్టరు విద్యార్థులకు అందజేశారు.

తొలుత మొవ్వ సమితి అధ్యక్షులు శ్రీటి వెంకట సుబ్బయ్య స్వాగతం పలికారు ఈ పర్యటనలో గజిటెడ్ యిన్‌స్పెక్టరు శ్రీ యం యల్. నారాయణప్ప, సీనియర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టరు శ్రీ వి రామారావు, తాలూకా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ బి ఆస్కర్‌పాల్, విద్యావిస్తరణాధికారి శ్రీ తోట నరయ్య జూనియర్ ఇన్‌స్పెక్టరు శ్రీ శ్రీహరిరావు, మొవ్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ యం వి కృష్ణారావులు డైరెక్టరు వెంటవున్నారు తరువాత వుపాధ్యాయుల ఆటల పోటీలు జరుగుచున్న కొడాలి గ్రామాన్ని డైరెక్టరు దర్శించారు.

# సభలు-సమావేశాలు

తిరువూరు తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం యీ నెల 30 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి తిరువూరు పార్టీ కార్యాలయములో జరుగుతుంది

# "ఆదుర్తి" జయంతి

హైదరాబాద్, డిసెంబరు 22

కీ॥శే॥ 'ఆదుర్తి' 51వ జయంతినిపురస్కరించుకొని చక్రవర్తి ఆర్ట్ థియేటర్స్ హైదరాబాదు తమద్వితీయవార్షికోత్సవం డిసెంబరు 16న రవీంద్రభారతిలో ఘనంగా జరుపుకున్నారు ఆంధ్రప్రదేశ్ చేనేత శాఖామాత్యులు శ్రీ కె వి. కేశవులు అధ్యక్షత వహించారు. ప్రముఖ చలనచిత్ర నిర్మాత దర్శకులు శ్రీ ప్రత్యగాత్మ ముఖ్య అతిథిగా విచ్చేయగావర్ధమానసినీమాతారకుమారి జయసుధ శ్రీ ఆదుర్తి సంస్మరణ ప్రత్యేక సంచికవిడుదలచేశారు ప్రముఖ సినీనటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు ఆదుర్తి తైలవర్ణ చిత్రాన్ని ఆవిష్కరించారు ప్రసిద్ధ సినీ రచయితలు శ్రీ సత్యానంద్, శ్రీ గోపి. శ్రీ గణేశ్ పాత్రో, వెండితెర సంపాదకులు శ్రీ బి. ఎ వి. శాండిల్య వీరందరూ కీ॥ శే॥ ఆదుర్తి ప్రతిభను కొనియాడుతూ వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సంస్థ పురోభివృద్ధిని ఆకాంక్షించారు. తొలుత సంస్థ అధ్యక్షులు స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి శ్రీ యం.వి.రమణ నివేదిక సమర్పిస్తూ ప్రతి సంవత్సరం ఆదుర్తిగారి పేరిట నాటక పోటీలు నిర్వహిస్తామని అందరి సహకారం కోరారు. డి. ప్రభాకర్ వందన సమర్పణతో సభా కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. తదనంతరం దేశరాజు హనుమంతరావు దర్శకత్వంలో యండమూరి వీరేంద్రనాథ్ రచించిన హాస్య ప్రధానమైన నాటకం 'పుట్టు' ప్రదర్శించబడింది.

ఆటోమేటిక్ డెలివరీ సిస్టం ద్వారా
లాభం పొందండి
శ్రీ విజయ భాస్కర రైస్ కంపెనీ
ఫోన్ 73831
రాంగోపాల్‌వీధి • విజయవాడ.1
బాగుచేయించిన పాత బియ్యం
సరసమైన ధరలకు లభించును


సమసమానత్వాన్ని తిట్టు పరంగా ప్రభోధించిన తిట్టుకవిగా
వేములవాడ భీమకవి
-చూడండి!
పోతభూపా! కానుకలు తీసుకొని కూడబెట్టిన ఈసొత్తు మేము ముట్టం. ఇది ప్రజలది ప్రజలకే చేరాలి


ఒక దానికొకటి మించినది... కిర్లోస్కర్ ఇంజన్... ఏది కావాలో ఎంచుకోండి. కావలసినంత నీటిని చేదండి. ఏపుగా పెరిగే పైరును పొందండి

ఎల్ కె ఎ 1 ఎయిర్ కూల్డ్ 4 హార్స్ పవర్
సిఎ1 ఎయిర్ కూల్డ్ 5 హార్స్ పవర్
ఎవి 1 వాటర్ కూల్డ్ 5 హార్స్ పవర్
ఎస్‌వి1 వాటర్ కూల్డ్ 8 హార్స్ పవర్

వారి ఉత్పత్తులు
జెవి 1 6 హార్స్ పవర్
టివి 1 7 హార్స్ పవర్
ఇతర అన్ని విధములైన ఇంజనులు
(వివిన్న హార్స్ పవర్‌లలో)
దొరుకుచున్నవి.

మీ పొలానికి నిర్ణీతమైన సమయంలో కావలసినంత నీటిని పొందాలంటే కిర్లోస్కర్ డీజిల్ ఇంజన్ పంప్ సెట్ బహు లాభదాయకమైనది ఇది చాల దృఢంగా నిర్మింపబడుటచే ఎలాంటి ఆటంకములు లేకుండా అనేక సంవత్సరాలు మీకు సేవ చేస్తోంది అనగా ఇదొక్కటి అన్ని ఋతువులందు కూడ చక్కని ఫలసాయాన్ని వృద్ధి చేస్తుంది చెరకు రసం తీయడానికి గింజలను శుభ్రపరచడానికి ధాన్యం ఆరబెట్టటానికి వేరుశనగ పొట్టు తీయడానికి ధాన్యపు మర ఆడించడానికి నువ్వులనుండి నూనె తీయడానికి అవసరమయ్యే యంత్రములకు ఈ ఇంజన్‌ను జోడు చేయండి

అమ్మకం తరువాత మీకు ఎటువంటి సర్వీసు కావాలన్నా అసలైన విడిభాగములు కావలసినా కిర్లోస్కర్ విక్రేత వద్ద పొందవచ్చు గుర్తుంచుకోండి కిర్లోస్కర్ ఇంజన్ ఎలాంటి దంచే ఇంధనపు ఖర్చులో 25 శాతం తగ్గిస్తోంది దీనిని వాడటంలో ఎలాంటి శ్రమ లేదు బాగుచేత ఖర్చులు కూడ చాల తక్కువౌతాయి

కోయెల్ సేల్స్ అండ్ సర్వీస్
(కిర్లోస్కర్ ఆయిల్ ఇంజన్స్ లిమిటెడ్ వారి శాఖ)
చంద్రలోక్ 1వ అంతస్థు, 111 సరోజిని రోడ్ సికింద్రాబాద్-500 003
ప్రధాన కార్యాలయము కోత్‌రుడ్ పూనా-411 029
PRATIBHA 757 TEL

• డిస్ట్రిబ్యూటర్లు •

(1) మెస్సర్స్ కుసుమహరనాథ ఇంజనీరింగ్ కంపెనీ, బాబురాజేంద్రప్రసాద్ రోడ్, విజయవాడ-1. (2) మెస్సర్స్ శివఇంజనీరింగ్ కంపెనీ, స్టేషన్‌రోడ్, గుంటూరు. (3) మెస్సర్స్ చంద్ర జనరల్‌స్టోర్సు, గిద్దలూరు, ప్రకాశంజిల్లా. (4) మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగు కంపెనీ జి.టి రోడ్, అనకాపల్లి, వైజాగ్‌జిల్లా. (5) మెస్సర్స్ శ్రీ సూర్య ఇంజనీరింగ్ కంపెనీ, 8 1-102 జెతవీధి, విజయనగరం, వైజాగ్‌జిల్లా. (6) మెస్సర్స్ ఇ కృష్ణారావు బ్రదర్సు సూర్యాబాగ్, విశాఖపట్నం-2 (7) మెస్సర్స్ విక్టరీ బ్రదర్సు, సుబేదారుపేట, నెల్లూరు. (8) మెస్సర్స్ జె. రామకృష్ణయ్య & కంపెనీ న్యూటాకీస్ ఎదురుగా నెల్లూరు (9) మెస్సర్స్ పి.వి. మాధవరావు సన్స్ & కంపెనీ, 52-213, బస్‌స్టాండు కర్నూలు (10) మెస్సర్స్ వినాయక ఇంజనీరింగుకంపెనీ 17-2-46 పిన్నియమ్మన్ కోయిల్‌స్ట్రీట్ చిత్తూరు (11) మెస్సర్స్ మునగ ఏజన్సీస్, మెయిన్‌రోడ్, కడప (12 మెస్సర్స్ వెంకటేశ్వర మిల్ స్టోర్సు మెయినరోడ్, చోడవరం వైజాగ్‌జిల్లా (13) మెస్సర్స్ మిత్రా ఏజన్సీస్ రాజగోపాలాచారి స్ట్రీట్, గవర్నరుపేట, విజయవాడ-2 (14) మెస్సర్స్ రవికుమార్ 4-262 రాజాస్ట్రీట్, మార్కాపూర్, ప్రకాశంజిల్లా. (15) మెస్సర్స్ కాంతి జనరల్ స్టోర్స్ 1-65 మెయిన్‌బజార్, బద్వేల్, కడపజిల్లా. (16) మెస్సర్స్ యునైటెడ్ అగ్రో ఎలక్ట్రికల్స్, ట్రంక్‌రోడ్, రాయచోటి, కడపజిల్లా.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్: టి వెంకటేశ్వరరావు
ఎడిటర్: ఏ. రాఘవాచారి: ముద్రణ: స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు. విజయవాడ- 520004 R. NO. 1138/57